www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 128

గురువారం | 22-8-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: తదియ మ. 1.46 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా 10.05 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 9.09-10.35; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.02, మ. 3.12-4.02; అమృతఘడియలు: సా. 5.46-7.12; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.03, సూర్యాస్తమయం: 6.32

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


పేలుడుతో కర్మాగారం నుంచి వెలువడుతున్న పొగలు



కర్మాగారం వద్ద సమిగూడిన కార్మికుల కుటుంబీకులు

పెను విషాదం

ఫార్మా కంపెనీలో భారీ పేలుడు.. 18 మంది దుర్మరణం


శిథిలాల కింద ఛిద్రమైన మృతదేహాలు

అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా'లో

రసాయన ద్రావకం లీక్

ఎలక్ట్రిక్ ప్యానల్‌పై పడిన రసాయనం

ఉష్ణోగ్రతకు ఆవిరి మేఘాలుగా సాల్వెంట్

మంటలతో 'వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్'

కుప్పకూలిన భవనం శ్లాబ్, ఓ గోడ

కార్మికుల హాహాకారాలు.. పరుగులు

చెల్లాచెదురుగా మృతదేహాలు

సమీపంలోని చెట్ల మీదకూ ఛిద్రమైన శరీర భాగాలు

20 మందికి పైగా తీవ్ర గాయాలు

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం


క్షతగాత్రులు ఆస్పత్రికి తరలింపు

(అనకాపల్లి/విశాఖపట్నం/అచ్యుతాపురం - ఆంధ్రజ్యోతి)

అది అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా సంస్థ! బుధవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయం! మొదటి షిఫ్టు కార్మికులు విధులు ముగించుకుని.. రెండో షిఫ్టు సిబ్బంది లోపలికి వెళ్తున్నారు. అంతలోనే... దట్టమైన పొగ అలుముకుంది. ఏం జరుగుతోందో తెలుసుకునేలోపే... చెవులు దద్దరిల్లేలా భారీ పేలుడు! ఒక్కసారిగా హాహాకారాలు! పేకమేడలా కూలిపోయిన ఫ్యాక్టరీ శ్లాబ్! ఒకరిద్దరితో మొదలైన ప్రాణనష్టం... సమయం పెరిగేకొద్దీ పెరుగుతూనే ఉంది. రాష్ట్ర ఫార్మా పరిశ్రమ చరిత్రలోనే అతి పెద్ద ప్రమాదం

మిగతా 11వ పేజీలో...

ఘోరం జరిగింది! పెను విషాదం చోటు చేసుకుంది. ప్రాణ నష్టం పరంగా 'ఫార్మా' చరిత్రలోనే అతి భారీ ప్రమాదమిది! అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో జరిగిన పేలుడుతో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని చెబుతున్నారు.


ఫ్యాక్టరీ వద్ద విలపిస్తున్న ఉద్యోగి కుటుంబ సభ్యురాలు

భీతావహం..

ముక్కలుగా మృతదేహాలు... గుర్తుపట్టలేని స్థితిలో కాలిన శరీరాలు... ఎటు చూస్తే అటు శిథిలాలతో ప్రమాదస్థలం భీతావహంగా మారింది. కొందరి శరీర భాగాలు తుత్తునియలయ్యాయి. దూరంగా విసిరేసినట్లుగా పడిపోయాయి. సమీపంలోని ఒక చెట్టు కొమ్మల్లోనూ చిక్కుకున్నాయి. క్షతగాత్రులు చెల్లాచెదురుగా పడిపోయి కనిపించారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎంత మంది కంపెనీ ఆవరణలో ఉన్నారు.. వారిలో ఎందరు బయటికి వచ్చారు.. ఎందరు శిథిలాల కింద చిక్కుకున్నారనేది ఇంకా లెక్క తేలడంలేదు. కార్మికుల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. తమ కుటుంబ సభ్యులు కనిపించడం లేదంటూ పలువురు విలపించడం కనిపించింది.



ఊపిరి తీసిన ఆవిరి..

అచ్యుతాపురం సెజ్‌లో అనేక ఫార్మా పరిశ్రమలున్నాయి. చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కానీ... మృతుల సంఖ్యను బట్టి చూసుకుంటే 'ఎసెన్షియా' ఘటన అతి భారీ విషాదమని నిపుణులు పేర్కొంటున్నారు. రియాక్టర్లు, బాయిలర్ల పేలుడు వల్లే పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతుంటాయి. కానీ... తొలిసారిగా 'వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్' (వీసీఈ) జరిగింది.

నేడు అచ్యుతాపురానికి సీఎం చంద్రబాబు

ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశం 11

పామాయిల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు 2

నెల్లూరు జిల్లాలో బాయిలర్ పేలి మంటలు

రాత్రివేళ కావడంతో తప్పిన ప్రాణ నష్టం

రూ.300 కోట్ల సిమెంట్ హాంఫట్



దొరికినంత దోచుకున్న వైసీపీ నేతలు

గత ప్రభుత్వంలో సచివాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టకుండా ఎక్కడికక్కడ దోపిడీ

అవసరం లేకపోయినా కంపెనీల సరఫరా

భారతి సిమెంట్ నుంచే రూ.83 కోట్ల సరుకు

మొత్తం 19 కంపెనీలకు 650 కోట్ల చెల్లింపు

క్షేత్రస్థాయిలో 25% మాత్రమే వినియోగం

మరో 25 శాతం ఇతర పనులకు

మిగిలిన 50 శాతం సిమెంట్ హుష్‌కాకి

ఇంజనీర్లను బలి చేసే ప్రయత్నాలు

గత వైసీపీ సర్కారులో జరిగిన అవినీతి లీలలు అన్నీ ఇన్నీ కావు. తవ్వే కొద్దీ బయట పడుతూనే ఉన్నాయి. వైసీపీ నేతలు తమ స్థాయిని బట్టి దేన్నీ వదలకుండా దోచుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణం ముసుగులో అడ్డగోలుగా సిమెంట్ అమ్ముకున్నారు. నిర్మాణాలను గాలికొదిలేసి దొరికినోళ్లు దొరికినంత దోచుకున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.300 కోట్ల విలువైన సిమెంట్‌ను అప్పనంగా అమ్ముకున్నారు. అన్ని జిల్లాల్లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు ఇష్టారీతిగా అమ్ముకున్నారని తేలింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో అవసరమున్నా లేకపోయినా సచివాలయాల భవనాల నిర్మాణాల కోసమంటూ రూ.650 కోట్ల విలువైన సిమెంట్ అందజేశారు. అస్మదీయ సిమెంట్ కంపెనీలతో పాటు జగన్ సొంత కంపెనీ భారతి సిమెంట్ నుంచి రూ.83 కోట్ల మేర సిమెంట్ సరఫరా చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆయా సిమెంట్ కంపెనీలు ఒత్తిడి చేసి మరీ బిల్లులు వసూలు

మిగతా 2వ పేజీలో...

ఇసుక ఇక.. సులభం!

ప్రత్యేక బుకింగ్ కేంద్రాలు

అనుమతి ఉన్న వాహనాలకే స్టాక్ యార్డ్‌ల్లోకి ప్రవేశం

సెప్టెంబరులో సమగ్ర పాలసీ

ఈలోగా సమస్యలు రాకుండా చర్యలు


అత్యవసరంగా సమీక్షించిన సీఎం

రవాణా చార్జీలు నిర్ణయించండి

రీచ్‌లలో తవ్వకంపై నిరంతరం పర్యవేక్షించండి

కలెక్టర్లకు సీఎస్ నీరబ్ ఆదేశం 3

వాహనాలకు యూనిక్ నంబర్: మీనా



అఘాయిత్యం చేస్తే అదే ఆఖరి రోజు

విచారణలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే నేనే ఘటనా స్థలికి వస్తా 12

గంజాయి, డ్రగ్స్‌కు చెక్: సీఎం



3

ఎవరూ హెల్మెట్ ధరించడం లేదు

చట్ట నిబంధనల అమలులో అలసత్వం

ఎంత మందికి చలాన్లు విధించారు?

ఎంత సొమ్ము వసూలు చేశారు?

ఎంత మంది లైసెన్స్‌లు రద్దు చేశారు?

వివరాలు మా ముందు ఉంచండి: హైకోర్టు

హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీకి ఆదేశం

వెంకటరామిరెడ్డిపై అభియోగాలు 2

15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

ఎన్నికల ముందు వైసీపీకి అనుకూల ప్రచారం చేసి సస్పెండ్ అయిన ఉద్యోగుల సంఘం నేత

హైకోర్టుకు ఇద్దరు శాశ్వత న్యాయమూర్తులు 3

జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావు నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

వివేకా హత్య కేసులో..

ఉదయ్‌కుమార్‌రెడ్డికి టీ-హైకోర్టు బెయిల్

ఈ కేసులో కీలక నిందితులందరూ బయటే

ఇక జైల్లో ఉన్నది ముగ్గురే 11


తుంగభద్ర ప్రాజెక్టు కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చిన కన్నయ్య నాయుడును సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

గత ఐదేళ్లలో గ్రీజే పెట్టలేదు!

కనీసం పెయింట్ కూడా వేయలేదు

అందుకే పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయ్

ప్రముఖ ఇంజనీర్ కన్నయ్యనాయుడు ఆవేదన 12

సొంత రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులో సమస్య తలెత్తినా వస్తానని హామీ

జలాశయ గేట్ల రూపశిల్పికి చంద్రబాబు ఘన సన్మానం

రహస్య కెమెరాలతో మహిళలు, పిల్లల నగ్న వీడియోలు 2



అమెరికాలో ఓ భారతీయ డాక్టర్ దుర్మార్గం

స్వయంగా భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..

వేల సంఖ్యలో బాధితులు.. నిందితుడి అరెస్ట్

మాతో ఆటలొద్దు

రాజకీయ కక్షలకు కోర్టులను వేదిక చేసుకోవద్దు



మాజీ ఎమ్మెల్యే ఆళ్లపై సుప్రీం ఫైర్

ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలన్న పిటిషన్ తిరస్కరణ

సీబీఐ దర్యాప్తునకూ నిరాకరణ



ఆళ్ల రాజకీయ బంధంపై ధర్మాసనం ఆరా

గతంలో వైసీపీ ఎమ్మెల్యేగా పనిచేశారన్న సీఎం తరఫు సీనియర్ న్యాయవాది లూథ్రా

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని కోరుతూ పిటిషన్ వేసిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి తమతో ఆటలాడొద్దని హెచ్చరించింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ ఆయన వేసిన మరో పిటిషన్‌ను కూడా తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని ఆళ్ల గతంలో ఏసీబీ కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేశారు. కోర్టు దీనిపై

మిగతా 12వ పేజీలో...

పునరుత్పాదకంలో రూ.50 వేల కోట్ల భారీ పెట్టుబడులు 2

బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ సంస్థలు అంగీకారం

సీఎం బాబు, మంత్రి రవితో చర్చలు.. దశలవారీగా ప్రాజెక్టులకు ఓకే

ఆర్టీసీకి 1489 కొత్త బస్సులు

కొనుగోలు చేసేందుకు సర్కారు పచ్చజెండా 3

మహిళలకు పకడ్బందీగా ఉచిత బస్సు ప్రయాణం

రవాణా శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

శాంతి సందేశంతో యుద్ధభూమికి!

ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ప్రపంచ దేశాల చూపు

పుతిన్‌ను కలిసిన నెలన్నరలోపే జెలెన్‌స్కీతో చర్చలపై ఆసక్తి

భారత్ జోక్యంతో శాంతి సాధ్యమన్న ఆశతో ప్రపంచం 2


వార్సాలో మోదీకి పోలండ్ అధికారుల స్వాగతం

రహస్య కెమెరాలతో మహిళల, పిల్లల నగ్న వీడియోలు

▸▸ అమెరికాలో ఓ భారతీయ డాక్టర్ దుర్మార్గం.. అరెస్టు



వాషింగ్టన్, ఆగస్టు 21: ఆస్పత్రులకు చికిత్స కోసం వచ్చే మహిళలు, పిల్లల నగ్న చిత్రాలను రహస్య కెమెరాలతో చిత్రీకరించటమేగాక పలువురిపై లైంగికదాడులకు పాల్పడిన ఉమర్ అజీజ్ అనే భారతీయ డాక్టర్‌ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. ఆస్పత్రులలోని బాత్‌రూమ్‌లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర ప్రాంతాల్లో రహస్యంగా కెమెరాలను ఏర్పాటు చేసి ఈ నగ్నచిత్రాలను, వీడియోలను ఉమర్ రికార్డు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉమర్ భార్యనే స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతడి దారుణాలు బయటపడ్డాయి. పోలీసులు మిషిగన్‌లోని రోచ్‌స్టర్ హిల్స్‌లో ఉన్న వారి ఇంట్లో సోదా జరిపినప్పుడు దిగ్భ్రాంతికర అంశాలు వెల్లడయ్యాయి. ఉమర్ రికార్డు చేసిన మహిళల, పిల్లల నగ్న వీడియోలు, ఫొటోలు వేల సంఖ్యలో ఉన్నాయని తెలిసింది. అంతేకాదు, పలువురు మహిళలు స్పృహలో లేనప్పుడు, నిద్ర పోతున్నప్పుడు వారిపై లైంగికదాడులకు, అభ్యంతరకర చర్యలకు పాల్పడి ఆ దృశ్యాలను కూడా ఉమర్ రికార్డు చేశాడు. వీటిని భద్రపరిచిన పలు కంప్యూటర్లు, ఫోన్లు, 15 ఎక్స్‌టర్నల్ డివైజ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క హార్డ్‌డ్రైవ్‌లోనే 13 వేల వీడియోలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీన పోలీసులు ఉమర్‌ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు 20 లక్షల డాలర్ల బాండుతో ఆక్లాండ్ కంట్రీ జైలుకు తరలించారు.

ఇంటి నుంచి ఆఫీసుకి రోజూ 1,600 కిమీల ప్రయాణం

ప్రైవేట్ జెట్‌లో చక్కర్లు కొట్టనున్న స్టార్‌బక్స్ కొత్త సీఈవో

కాలిఫోర్నియా, ఆగస్టు 21: ప్రముఖ కాఫీ బ్రాండ్ స్టార్‌బక్స్ నూతన సీఈవో బ్రియాన్ నికోల్ ఇంటి నుంచి ఆఫీసుకి ప్రతి రోజు 1600 కిలోమీటర్లు ప్రయాణించనున్నారు. నికోల్ నివాసం అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉండగా స్టార్‌బక్స్ ప్రధాన కార్యాలయం సియాటెల్‌లో ఉంది. స్టార్‌బక్స్‌కు చెందిన ప్రైవేట్ జెట్‌లో ఆయన రోజూ ఇంటి నుంచి ఆఫీసుకు చేరుకోనున్నారు. బ్రియాన్ నికోల్‌ను సీఈవోగా నియమిస్తూ స్టార్‌బక్స్ జారీ చేసిన ఆఫర్ లెటర్‌లో ఈ వివరాలు ఉన్నాయి. స్టార్‌బక్స్ హైబ్రిడ్ వర్క్ నిబంధనల ప్రకారం వారంలో కనీసం 3రోజులు ఆయన సంస్థ ప్రధాన కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. మిగిలిన రోజులు ఇంటి నుంచి పని చేయవచ్చు. ఇంతకీ బ్రియాన్ నికోల్ జీతం ఎంతో తెలుసా.. ఏడాదికి సుమారు రూ.13.50 కోట్లు. ప్రస్తుతం చిపోటెల్ అనే ఫాస్ట్‌ఫుడ్ వ్యాపార సంస్థ సీఈవోగా పని చేస్తున్న బ్రియాన్ నికోల్ సెప్టెంబరు 9న స్టార్‌బక్స్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. నికోల్ హయాంలో చిపోటెల్ గతంలో ఆ సంస్థ ఎన్నడూ చూడనంతగా లాభాల బాట పట్టింది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

జెరూసలెం, ఆగస్టు 21: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల వల్ల కనీసం 50 మంది పాలస్తీనియన్లు మరణించారని, 124 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే సెంట్రల్ గాజాలోని డీర్ ఎల్-బాలా నుంచి ప్రజలు తరలిపోవాలని ఇజ్రాయెల్ ఆర్మీ తాజాగా ఆదేశించింది. మరోవైపు లెబనాన్ బెకా ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హెజ్‌బొల్లా ప్రతిదాడులకు దిగింది. నార్తర్న్ ఇజ్రాయెల్‌లోని మిలిటరీ పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు చేసినట్టు బుధవారం పేర్కొంది. అయితే ఈ ఘటనను ఇజ్రాయెల్ ఆర్మీ ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు.

కత్తెర్లు కనిపించక.. జపాన్‌లో 36 విమానాలు రద్దు

టోక్యో, ఆగస్టు 21: రెండు కత్తెర్లు కనిపించకపోవడంతో జపాన్‌లోని న్యూ చిటోస్ విమానాశ్రయం నుంచి 36 విమానాలు రద్దయ్యాయి. 201 విమానాలు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. కత్తెరలను ఉగ్రవాదులు విమానాల్లోకి తీసుకెళ్లారనే అనుమానంతో అధికారులు క్షుణ్ణమైన తనిఖీలు మొదలుపెట్టారు. ఈ సమయంలో ఒక్క విమానాన్నీ ఎగరనివ్వలేదు. ఈ ఘటన ఈ నెల 17న జరగ్గా.. అదే రోజు ఆ కత్తెర్లు దొరికాయి. వాటిని ఎవరూ కొట్టేయలేదు.. విమానాశ్రయంలోని దుకాణంలోనే ఓ మూల కనిపించాయి. కానీ అధికారులు కత్తెర్లు దొరికిన విషయాన్ని తర్వాతిరోజు బయటపెట్టారు.

పునరుత్పాదక ఇంధన రంగం పరుగు

▸▸ రూ.50 వేల కోట్ల భారీ పెట్టుబడికి బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ సంస్థలు ఓకే

▸▸ సీఎం బాబు, మంత్రి రవితో చర్చలు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగం పరుగులు పెట్టనుంది. ఈ రంగంలో రూ.50 వేల కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ సంస్థలు ముందుకు వచ్చాయి. వెలగపూడి సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు, ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో క్లీన్ ఎనర్జీ ప్లాట్‌ఫాం 'ఎవ్రెన్' తమ ప్రతిపాదనలు తెలియజేసింది. రాష్ట్రంలో దశలవారీగా 3,500 మెగావాట్ల సౌర, 5,500 మెగావాట్ల విండ్ ఎనర్జీ ప్రాజెక్టులను స్థాపిస్తామని బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ బృందం వెల్లడించాయి. వీటిలో ఇప్పటికే 3,000 మెగావాట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని తెలిపాయి. 2026 చివరినాటికి ప్రారంభమవుతాయని పేర్కొన్నాయి. పునరుత్పాదక ఇంధన పెట్టుబడుల ద్వారా.. తయారీ, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, ఈ-మొబిలిటీ, గ్రీన్ అమ్మోనియా వంటి వాటిలో అదనపు అవకాశాలను ఎవ్రెన్ అన్వేషిస్తోందని వెల్లడించాయి. సీఎంతో సమావేశమైన వారిలో బ్రూక్‌ఫీల్డ్ ఎండీ నావల్ షైనీ, ముర్డాస్ మనీక్షణ, ఎవ్రెన్ సంస్థ ఎండీ రవికుమార్‌రెడ్డి, సీఈవో సుమన్ కుమార్, యాక్సిస్ సీఈవో మురళి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డీవీవీ సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

భారత్ బంద్ పాక్షికం.. బిహార్‌లో బస్సుకు నిప్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దేశవ్యాప్తంగా బుధవారం బంద్ జరిగింది. ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి, ఇతర ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు నిరసనకారులు బంద్‌లో పాల్గొన్నారు. పలు చోట్ల ఆందోళనకారులు రాస్తారోకో నిర్వహించారు. వాహనరాకపోకలను, పలు రైళ్లను అడ్డుకున్నారు. అయితే బంద్ ప్రభావం దేశంలో పెద్దగా కనిపించలేదు. బిహార్ రాజధాని పాట్నాలో లోక్‌సభ ఎంపీ పప్పు యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ క్రమంలో నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. బంద్‌కు ఆర్జేడీ, ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు తెలిపాయి. గోపాల్‌గంజ్‌లో 35 మంది పిల్లలతో వెళ్తున్న బస్సుకు కొందరు నిరసనకారులు నిప్పుపెట్టారు. అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అటు రాజస్థాన్‌లో బంద్ దృష్ట్యా ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది.ఢిల్లీలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు.

రాష్ట్రంలో ప్రశాంతంగా..

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



మాజీ ఎంపీ హర్ష కుమార్‌ను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆలిండియా దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కొవ్వూరు, అనపర్తి, నిడదవోలుతో పాటు ముఖ్యమైన మండల కేంద్రాల్లో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బీఎస్పీ, దళిత సంఘాలు, మాల సంఘాలు, ఎస్సీ సంఘాలు నిరసన ర్యాలీలు చేశాయి. విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. జాతీయ రహదారిపై ధర్నాలు జరిగాయి. మాలమహానాడు జేఏసీ సభ్యులు కాకినాడలో ఉదయాన్నే బస్టాండ్లకు వచ్చి బస్సులను అడ్డుకున్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించిన దళిత సంఘాల నేతలను పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కృష్ణాజిల్లాలో బంద్ పాక్షికంగా జరిగింది. నెల్లూరు నగరంలో మాలమహానాడు, మాలల జేఏసీ, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ వద్ద రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఆర్టీసీ బస్సులు బయటకు రాకుండా అన్ని డిపోల్లో నిరసనకారులు అడ్డుకున్నారు. విద్యాసంస్థలు మూతపడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, తణుకుల్లో దుకాణాలను మూయించారు.

ముత్తుకూరు పామాయిల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు



పామాయిల్ ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలు

ముత్తుకూరు, ఆగస్టు 21: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మాసెజ్‌లో అగ్ని ప్రమాద ఘటన బుధవారం రాష్ట్రంలో పెను సంచలనమైంది. ఈ దుర్ఘటన జరిగిన కొద్దిసేపటికే నెల్లూరు జిల్లాలోని పామాయిల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం కలకలం రేపింది. ముత్తుకూరు మండలం పంటపాలెం గ్రామ సమీపంలోని ట్రిబుల్ ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి బాయిలర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కార్మికులు ప్రాణభయంలో బయటకు పరుగులు తీశారు. ఉవ్వెత్తున ఎగసి పడుతున్న మంటలు, దట్టంగా కమ్ముకున్న పొగతో ప్లాంటు నిండిపోయింది. కృష్ణపట్నం పోర్టు, నెల్లూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దీంతో బుధవారం అర్ధరాత్రి సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. రాత్రి సమయం కావడంతో బాయిలర్ల వద్ద ఎవరూ లేరని, దీంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని డీఎస్పీ జీ శ్రీనివాసరావు తెలిపారు. అగ్ని ప్రమాదం వల్ల రూ.10 కోట్ల వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా.

వెంకటరామిరెడ్డిపై అభియోగాలు

▸▸ 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా వైసీపీకి అనుకూల ప్రచారం చేసి సస్పెండ్ అయిన సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డిపై ప్రభుత్వం బుధవారం అభియోగాలు నమోదు చేసింది. 15 రోజుల్లో దీనిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది. సీసీఏ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఈ అభియోగాలు నమోదు చేసింది. అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తి సంజాయిషీ ఇచ్చాక క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుంది. 2024 మార్చి 31న కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరులో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకుడు చంద్రయ్యతో కలిసి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసి ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. దీనిపై టీడీపీ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేశారు. చంద్రయ్య, మరో 11 మందిని ఏప్రిల్ 4న సస్పెండ్ చేశారు. వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్‌ను అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి ఆపారు. ఈ విషయం మీడియాలో రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సస్పెండ్ చేస్తూ జీవో జారీ చేశారు. వెంకట్రామిరెడ్డి పంచాయతీరాజ్ శాఖలో సెక్షన్ అధికారి. సస్పెండ్ అయ్యేనాటికి ఇన్‌చార్జి అసిస్టెంట్ పోస్టులో ఉన్నారు. ఒక పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు రోసా నిబంధనల ప్రకారం అసోసియేషన్‌లో వెంకట్రామిరెడ్డి సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణ విషయంలో గత ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది.

చంద్రయాన్-3కి రేపటితో ఏడాది

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా కాలుపెట్టి ఈ నెల 23వ తేదీకి ఏడాది పూర్తవుతుంది. ఈ విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు తొలి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారం కూడా లభించింది. ఈ ఏడాది అదే రోజున తొలిసారిగా జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. 2019లో ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2 చివరి నిమిషంలో చంద్రుడిపై కూలిపోయింది. ఈ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. మరో నాలుగేళ్లలోనే చంద్రయాన్-3తో అద్భుత విజయాన్ని అందుకొంది. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా చంద్రుడిపై కాలుపెట్టింది. అలా ల్యాండర్ దిగిన ప్రాంతానికి ఇస్రో శివ శక్తి పాయింట్‌గా నామకరణం చేసింది. కాగా, నాసా-ఇస్రో సంయుక్త మిషన్‌లో భాగంగా భారత్‌కు చెందిన వ్యోమగామి వచ్చే ఏప్రిల్ నాటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్తారని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. యాక్సియోమ్ స్పేస్ ఏఎక్స్-4 మిషన్ కోసం ఎంపిక చేసిన ఇద్దరు భారత వ్యోమగాములు గ్రూప్ కెప్టెన్లు శుభాన్షు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ అమెరికాలో శిక్షణ పొందుతున్నారు.

శాంతి సందేశంతో యుద్ధభూమికి!

▸▸ ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ప్రపంచదేశాల చూపు

▸▸ పుతిన్‌ను కలిసిన నెలన్నరలోపే జెలెన్‌స్కీతో చర్చలపై ఆసక్తి

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా 78 విదేశీ పర్యటనలు చేశారు! ఒక దేశ ప్రధాని ఇలా విదేశీ పర్యటనలు చేయడం సాధారణమైన విషయమే కాబట్టి ఎవరూ ఆ పర్యటనల గురించి అంతగా పట్టించుకోలేదు! కానీ.. ఇప్పుడు ప్రపంచం చూపంతా మోదీపైన, ఆయన ఉక్రెయిన్ పర్యటనపైనే ఉందంటే అతిశయోక్తి కాదు! అమెరికా, యూకే, చైనాలాంటి దేశాల్లాగా.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ ఎటూ మొగ్గు చూపకుండా వ్యవహరించడమే ఈ ఆసక్తికి కారణం!! ఆ కారణంతోనే అమెరికా, యూకే, యూరప్ దేశాలు.. యుద్ధాన్ని ఆపేలా పుతిన్‌ను ఒప్పించాలని ప్రధాని మోదీని ఇన్నాళ్లుగా కోరుతున్నాయి. రెండు దేశాలనూ శాంతిచర్చలకు తేవాలని అప్పీలు చేస్తున్నాయి. "ఇది యుద్ధాల శకం కాదు" అని గతంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను.. ఎలాంటి సమస్యనైనా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలన్న ఇండియా వైఖరిని.. అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు ఇటీవలే గుర్తుచేశారు. పుతిన్‌తో తనకున్న ప్రత్యేక భాగస్వామ్యాన్ని ఉపయోగించి యుద్ధ విరమణకు ఒత్తిడి తేవాలని మోదీని ఆమె కోరారు. అయినా భారత్ ఆయా దేశాల విజ్ఞప్తులను పెద్దగా పట్టించుకోలేదు. పైగా.. వ్యూహాత్మకంగా రష్యా నుంచి చౌకగా చమురు దిగుమతి చేసుకుంటోంది. ఆ దేశం నుంచి ఆయుధాలను కొనుగోలు చేస్తూనే ఉంది. అదే సమయంలో మానవతా సాయం కింద.. అత్యవసర ఔషధాలు, జనరేటర్లు వంటివాటిని ఉక్రెయిన్‌కు ఈ రెండేన్నరేళ్లుగా పంపిస్తూ తటస్థంగా వ్యవహరిస్తోంది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. మోదీ ఉక్రెయిన్ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు.. యుద్ధం మొదలయ్యాక రెండు దేశాల్లోనూ (రష్యా, ఉక్రెయిన్) పర్యటించిన పెద్ద దేశాధినేత ఇప్పటిదాకా ఎవరూ లేరు. ఇంతటి కీలకమైన పర్యటనలో మోదీ.. ఇరు దేశాలనూ శాంతి చర్చల టేబుల్ వద్దకు తీసుకురాగలరా? లేక.. ఉక్రెయిన్‌కు సాయంతోనే సరిపెడతారా? లేక రష్యాతో మాట్లాడి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నిస్తానని జెలెన్‌స్కీకి చెబుతారా? అంటే.. వేచి చూడాల్సి ఉందని రాజకీయ నిపుణులు అంటున్నారు. ఉక్రెయిన్ మాత్రం.. మోదీ పర్యటనపై అత్యంత ఆశావహంగా ఉంది. యుద్ధంతో దెబ్బతిన్న తమ ఆర్థికవ్యవస్థను పునర్నిర్మించుకోవడంలో భారత్ సాయాన్ని ఆశిస్తోంది. ఈ క్రమంలోనే.. నెలరోజుల కిత్రం జెలెన్ స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అంద్రేయ్ యెర్మాక్ మన జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్‌కు ఫోన్ చేసి ఉక్రెయిన్ శాంతి సాధనలో మోదీ కీలకపాత్ర పోషిస్తారన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. ఉక్రెయిన్ నుంచి రష్యా సైన్యాన్ని పుతిన్ ఉపసంహరించుకుంటేనే.. ఆయనతో చర్చలు సాధ్యమని జెలెన్‌స్కీ ఇన్నాళ్లూ పట్టుపట్టి కూర్చున్నారు. కానీ, రెండున్నరేళ్లుగా ఉక్రెయిన్‌కు జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలు చేస్తున్న సాయం క్రమంగా తగ్గుతోంది. మరోవైపు అమెరికా 'అధ్యక్ష' ఎన్నికల హడావుడిలో ఉంది. దీంతో ఇటీవలే జెలెన్‌స్కీ ఒకింత తగ్గి.. ఎలాంటి షరతులూ పెట్టకుండా తాను చర్చలకు సిద్ధమనే సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో.. ఇన్నాళ్లుగా తమ భూభాగంలో మాత్రమే జరుగుతున్న యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళ్లారు.



వార్సాలో మోదీకి చిన్నారుల స్వాగతం

పోలండ్ చేరుకున్న ప్రధాని

కీవ్, ఆగస్టు 21: ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనే అంశంపై ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో విస్తృత చర్చలు జరపనున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. ఉక్రెయిన్ భారత్‌కు మిత్ర దేశమని బుధవారం ఆయన పోలండ్, ఉక్రెయిన్ పర్యటనకు బయల్దేరేముందు ఓ ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో వీలైనంత త్వరగా శాంతి స్థాపన జరగాలని కోరుకుంటున్నామన్నారు. పోలండ్, ఉక్రెయిన్ దేశాలతో భారత్ బంధాలు మరింత బలోపేతమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. రెండో రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ప్రధాని పోలండ్ చేరుకున్నారు. భారత్, పోలండ్‌ల మధ్య దౌత్యసంబంధాలకు 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా మోదీ పోలండ్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. 45 ఏళ్ల తర్వాత భారత ప్రధాని పోలండ్ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. కాగా, వార్సాలో ఆయనకు ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు.

ఉక్రెయిన్‌లో మోదీ ప్రయాణించే లగ్జరీ రైలు విశేషాలివే..

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఉక్రెయిన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'ట్రైన్‌ఫోర్స్ వన్' అనే విలాసవంతమైన రైలులో ప్రయాణించనున్నారు. రష్యాతో యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోయింది. రోడ్డు మార్గాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయన రైల్లో కీవ్‌కు వెళ్తున్నారు. పోలెండ్ నుంచి 10 గంటల పాటు ట్రైన్ ఫోర్స్ వన్ రైల్లో ప్రయాణించి ఆయన కీవ్‌కు చేరుకుంటారు. ఈ రైలు ఎంతో ప్రత్యేకమైంది. ఇందులో విలాసవంతమైన సౌకర్యాలతో పాటు అధునాతన భద్రత ఏర్పాట్లు ఉంటాయి. ఎప్పటికప్పుడు బయటి పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రత్యేక భద్రతా సిబ్బంది కూడా ఉంటారు. అయితే యుద్ధం జరుగుతున్న ప్రాంతాల మీదుగా ఈ రైలును నడపడం అంత తేలికేమి కాదు. అందుకే పకడ్బందీ ఏర్పాట్ల మధ్య దీన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్, జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ వంటి ప్రపంచ నేతలు ఇందులోనే ప్రయాణించారు.

సెప్టెంబరు నుంచి జనగణన?

▸▸ 2026 మార్చిలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఆలస్యం అయిన దేశ జనాభా గణన సెప్టెంబరు నెలలో మొదలయ్యే అవకాశం ఉంది. జనాభా గణన ఆలస్యంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటోంది. దేశంలో పదేళ్లకోసారి నిర్వహించే ఈ కార్యక్రమం 2021లో పూర్తిచేయాల్సి ఉంది. కాని కోవిడ్ కారణంగా ఆలస్యం అయ్యింది. వచ్చే నెలలో మొదలయ్యే ఈ కార్యక్రమం పూర్తిచేయడానికి 18 నెలలు పడుతుందని ప్రభుత్వ వర్గాల సమాచారం.

మహిళలపై నేరాల్లో 151 మంది ప్రజాప్రతినిధులు!

న్యూఢిల్లీ, ఆగస్టు 21: మహిళలపై నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు దేశవ్యాప్తంగా 151 మంది ఉన్నారు. వీరిలో 16 మంది ఎంపీలు కాగా.. 135 మంది ఎమ్మెల్యేలు. బెంగాల్లో అత్యధికంగా 25 మంది సిటింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఈ కేసులు ఉన్నట్లు ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఏపీలో 21 మంది, ఒడిసాలో 17 మంది ప్రజాప్రతినిధులపై ఈ కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య ఎన్నికల కమిషన్‌కు 4,809 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్లు సమర్పించగా.. వాటిలో 4,693 అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది.

విచారణకు సహకరించని జోగి రమేశ్

▸▸ సెల్‌ఫోన్, సిమ్ కార్డు ఇచ్చేందుకు నిరాకరణ

మంగళగిరి సిటీ, ఆగస్టు 21: ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంపై దాడి కేసులో విచారణకు మాజీ మంత్రి జోగి రమేశ్ సహకరించడం లేదని దర్యాప్తు అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మంగళగిరి రూరల్ పోలీసుల ఎదుట జోగి రమేశ్ విచారణకు హాజరయ్యారు. పోలీసులు పలు ప్రశ్నలు వేయగా, వాటికి జోగి రమేశ్ నుంచి సరైన సమాధానాలు రాలేదు. విచారణ అనంతరం దర్యాప్తు అధికారి, డీఎస్పీ మురళీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ విచారణకు రమేశ్ సహకరించడం లేదన్నారు. కేసు విచారణలో భాగంగా అవసరమైన డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అడిగి తీసుకునే హక్కు పోలీసులకు ఉంటుందని, అయితే, జోగి రమేశ్ తరపు న్యాయవాదులు పాత సెక్షన్లను చూపుతూ సెల్‌ఫోన్, సిమ్ కార్డు ఇచ్చేందుకు నిరాకరించారని తెలిపారు.

జోగి రాజీవ్ కేసులో తీర్పు వాయిదా: విజయవాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయించుకున్న మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ కేసులో వాదనలు ముగిశాయి. న్యాయాధికారి హిమబిందు తీర్పును ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు.

కేంద్ర బలగాల అధీనంలోకి ఆర్జీ కర్!

వైద్య కళాశాల వద్దకు సీఐఎస్ఎఫ్ బృందం.. సీబీఐ అధికారుల ఎదుటకు ఆరోసారి మాజీ ప్రిన్సిపాల్

▸▸ ఆస్పత్రిలో విధ్వంసం ఘటనలో ముగ్గురు ఉన్నతాధికారులపై మమత సర్కారు వేటు

కోల్‌కతా, ఆగస్టు 21: కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల, ఆస్పత్రిని కేంద్రబలగాలు తమ అధీనంలోకి తీసుకోనున్నాయి. విమానాశ్రయాలు, పార్లమెంటు వద్ద భద్రతను పర్యవేక్షించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) బలగాల బృందం బుధవారం ఉదయం ఆస్పత్రిని సందర్శించింది. అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది. అనంతరం ఆస్పత్రి అధికారులు, పోలీసులతో సీఐఎస్ఎఫ్‌కు చెందిన సీనియర్ అధికారి ప్రతాప్‌సింగ్ మాట్లాడారు. ఆయన్ను మీడియా ప్రశ్నించగా.. 'మాకు అప్పగించిన పని కోసం మేం ఇక్కడికి వచ్చాం. మమ్మల్ని మా పని చేసుకోనివ్వండి. ఆ తర్వాత దీనిపై మీతో ఉన్నతాధికారులు మాట్లాడతారు' అని చెప్పారు. హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. ఆగస్టు 14 అర్ధరాత్రి తర్వాత ఆర్జీకర్ ఆస్పత్రిలో దుండగులు చొచ్చుకెళ్లి పెను విధ్వంసం సృష్టిస్తే కోల్‌కతా పోలీసులు ఏం చేస్తున్నట్లు? అని నిలదీసిన నేపథ్యంలో ఆస్పత్రి భద్రత ఏర్పాట్లను కేంద్రబలగాలు పరిశీలించడం గమనార్హం. ఇక ఆస్పత్రిలో గూండాల విధ్వంసంపై సుప్రీంకోర్టు నిలదీయడంతో బెంగాల్ సర్కారు వెంటనే చర్యలకు దిగింది. ఆస్పత్రిలో విధ్వంస ఘటనకు సంబంధించి ఇద్దరు ఏసీపీలు సహా ముగ్గురు ఉన్నతాధికారులను సస్పెండ్ చేసింది. ఆర్జీకర్ వైద్యకళాశాలకు చెందిన వివాదాస్పద మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ బుధవారం మరోసారి సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. హత్యాచార ఘటనకు సంబంధించి సీబీఐ ఆయన్ను విచారించడం ఇది ఆరోసారి. ఐదుసార్లు విచారణలో భాగంగా ఆయన్ను సీబీఐ అధికారులు 64 గంటలపాటు ప్రశ్నించారు.



ఆర్జీ కర్ ఆవరణలో సీఐఎస్ఎఫ్ బృందం

ఆస్పత్రుల్లో వైద్యులకు భద్రత కల్పించాలనే డిమాండ్‌తో వరుసగా పదోరోజూ ఢిల్లీలోని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆర్డీయే) ఆందోళనలు నిర్వహించింది. కాగా, సందీప్ ఘోష్‌కు సీబీఐ పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించనుంది. ట్రైనీ డాక్టర్ హత్యాచారం వ్యవహారంలో ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఆయనను సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

గిరిజన మహిళపై గ్యాంగ్ రేప్

రాయ్‌గఢ్, ఆగస్టు 21: రక్షాబంధన్ రోజున గ్రామంలో నిర్వహించిన జాతర చూసి ఇంటికి వెళ్తున్న ఓ గిరిజన మహిళపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లో జరిగింది. సోమవారం 27 ఏళ్ల గిరిజన మహిళ తన గ్రామంలో నిర్వహించిన జాతరకు ఓ వ్యక్తితో కలిసి వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆ వ్యక్తితో పాటు అతని స్నేహితులు మొత్తం 8మంది తనపై గ్యాంగ్ రేప్ చేశారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని సీఎం బఘేల్ పోలీసులను ఆదేశించారు.

అనాథ శవాలను వదల్లేదు



సందీప్ ఘోష్

కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 21: ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు సంబంధించి సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. ఆయన శవాలను సైతం వదలకుండా అమ్ముకుని సొమ్ము చేసుకునే వారని ఆర్జీ కర్ కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అఖ్తర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఘోష్ అనాథ శవాలను అమ్మడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాలను అక్రమంగా బంగ్లాదేశ్‌కు రవాణా చేసేవాడని ఆయన ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆస్పత్రి, కళాశాలకు సంబంధించిన ఏ పని చేయడానికైనా డబ్బులు వసూలు చేసేవారన్నారు. పరీక్షల్లో పాస్ చేసేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకొనేవారని చెప్పారు. కాలేజీ ఆస్తులను అనుమతులు లేకుండా లీజ్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. ఘోష్ అక్రమాల మీద రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌ను అప్పట్లో తాను అప్రమత్తం చేశానని, ఆయనపై వేసిన విచారణ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని, దర్యాప్తులో ఆయన తప్పు చేసినట్లు తేలినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఘోష్ అక్రమాలపై తాను నివేదిక ఇస్తే అదే రోజు తనను ఆ కాలేజీ నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారని అలీ ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.300 కోట్ల సిమెంట్ హాంఫట్!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో సచివాలయాలకు 25 శాతం సిమెంట్ మాత్రమే వినియోగించారు. మరో 25 శాతం సిమెంట్‌ను వర్షాకాలంలో చెడిపోకుండా ఉండేందుకు ఇతర పనులకు ఇంజనీర్లు వినియోగించారు. మిగిలిన 50 శాతం సిమెంట్‌ను ఆయా సచివాలయాల పరిధిలో వైసీపీ నేతలు అమ్ముకున్నారని తేలింది. సిమెంట్ దోపిడీలో ఇంజనీర్లను బలి చేసే ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి సిమెంట్ విక్రయాల్లో ఇంజనీర్ల ప్రమేయం లేదు. సిమెంట్ కంపెనీలు సరఫరా చేసిన సిమెంట్ ఇంజనీర్ల అధీనంలో ఉండటంతో వారిపై బాధ్యత నెట్టారు. దీంతో సచివాలయ భవనాల సిమెంట్ స్కాంలో పలువురు ఇంజనీర్లు బలయ్యారని తెలుస్తోంది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. వైసీపీ సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ భవనాల కోసం అప్పట్లో భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టింది. సుమారు 10,919 సచివాలయాల భవనాలు, 10,263 ఆర్బీకే భవనాలు, 8,361 వైఎస్ఆర్ హెల్త్‌సెంటర్లు, 1252 బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, 3488 డిజిటల్ లైబ్రరీలు వెరసి.. మొత్తం 34,283 భవనాల నిర్మాణాల కోసం పనులు మంజూరు చేశారు. ఈ పనులన్నీ ఉపాధి మెటీరియల్ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. చివరకు 12 వేల భవనాలను మాత్రమే పూర్తి చేయగలిగారు. ఇతర భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఒక రోజు సమీక్ష నిర్వహించి ఈ పనులు జరగకపోవడానికి కారణమేంటని ఆరా తీశారు. చాలా చోట్ల సచివాలయాల భవనాలకు బిల్లులు ఇవ్వకపోవడం వల్లనే పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉండేలా సిమెంట్‌ను ప్రభుత్వమే సరఫరా చేస్తే పనులు వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు. దీంతో జగన్ సొంత కంపెనీతో పాటు 19 కంపెనీల ద్వారా సిమెంట్ సరఫరా చేయాలని నిర్ణయించారు. సాధారణంగా పంచాయతీరాజ్ ఇతర ఇంజనీరింగ్ శాఖలు సిమెంట్ సరఫరా చేసేటప్పుడు కొన్ని నిబంధనలు పాటిస్తారు. ఆయా శాఖల ఇంజనీర్లు ఎంత మేర సిమెంట్ అవసరమో కంపెనీలకు ఇండెంట్లు పెడతారు. ఆ మేరకు కంపెనీలు సరఫరా చేయాలి. సరఫరా చేశాక స్థానిక ఏఈలు ఎంబుక్‌లో రికార్డు చేసి బిల్లులు పెట్టాలి. ఆ తర్వాత కంపెనీలకు బిల్లులు చెల్లింపులు చేస్తారు. అయితే సచివాలయాల భవనాల నిర్మాణాల్లో నాటి ప్రభుత్వం అత్యుత్సాహం చూపించి సిమెంట్ కంపెనీలకు ప్రయోజనం కలిగించేలా వ్యవహరించింది. ఇండెంట్ తీసుకున్న కంపెనీలు ఆయా సచివాలయాల వద్దకు మాత్రమే సిమెంట్ సరఫరా చేయాలి. అయితే కంపెనీలు అవసరమైన వాటికి మాత్రమే కాకుండా మొత్తం మంజూరైన సచివాలయాలన్నింటికీ సిమెంట్‌ను సరఫరా చేశాయి. అందులో కొన్ని భవనాలు మంజూరైనప్పటికీ స్థలాలు కేటాయించలేదు. కొన్ని చోట్ల స్థలాలు వివాదాల్లో ఉన్నాయి. కొన్ని చోట్ల పనులు ప్రారంభించినా బిల్లులివ్వలేదన్న కారణంతో నిలిపేశారు. ఇలాంటి వాటన్నిటికీ గంపగుత్తగా సిమెంట్ కంపెనీలు సరఫరా చేశాయి. ఆయా గ్రామాల్లో వైసీపీ నేతలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో సిమెంట్‌ను దించేశారు. జగన్ సొంత కంపెనీ భారతి సిమెంట్ రూ.83.43 కోట్లు విలువైన సిమెంట్ సరఫరా చేసినట్టు రికార్డులో ఉంది. అలాగే భవ్య సిమెంట్స్ రూ.17.90 కోట్లు, చెట్టినాడ్ రూ.14.62 కోట్లు, దాల్మియా రూ.31.27 కోట్లు, జేఎస్‌డబ్ల్యూ రూ.15.77 కోట్లు, మైహోం ఇండస్ట్రీస్ రూ.41.18 కోట్లు, పెన్నా సిమెంట్ రూ.46.23 కోట్లు, ది ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ రూ.66.06 కోట్లు... ఇలా 19 కంపెనీలు సుమారు రూ.650 కోట్ల మేర సిమెంట్ సరఫరా చేసి, ఆ మేరకు బిల్లులు కూడా తీసేసుకున్నాయి. అయితే ఈ కంపెనీలు నిజంగా అంత సిమెంట్ సరఫరా చేశాయా? లేదా రికార్డుల్లో సరఫరా చేసినట్లు చూపి బిల్లులు తీసుకున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ఎవరికీ పట్టని స్కాం

గ్రామాలకు సిమెంట్ వచ్చినట్లు ఎంబుక్‌లు రికార్డులు చేసి పంపాలని ప్రభుత్వ పెద్దలు ఈఎన్‌సీ ద్వారా ఇంజనీర్లపై ఒత్తిడి చేశారు. సత్వరమే స్పందించని ఇంజనీర్లకు మెమోలు ఇచ్చారు. కొన్ని చోట్ల వేటు కూడా వేశారు. దీంతో బెంబేలెత్తిపోయిన ఇంజనీర్లు ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు రికార్డు చేశారు. దీనిపై విచారణ జరిగితే ఎవరు బాధ్యత వహించాలో అర్థం కావడం లేదని వారు అంటున్నారు. కొన్ని చోట్ల అప్పటి ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు సిమెంట్ అమ్ముకున్నారు. గ్రామ సచివాలయాల నిర్మాణాల కోసం సరఫరా చేసిన రూ.650 కోట్ల విలువైన సిమెంట్‌లో సుమారు 300 కోట్ల సిమెంట్‌ను వైసీపీ నేతలు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. సిమెంట్ దోపిడీపై విచారణ జరిగితే విజిలెన్స్ అధికారులు తమను బాధ్యుల్ని చేస్తారని ఇంజనీర్లు భయపడిపోతున్నారు. కంపెనీలకు ముందుగానే బిల్లులు చెల్లించిన గ్రామీణాభివృద్ధిశాఖ ఎన్నికల ముందు వైసీపీ నేతలకు కూడా దాదాపుగా చెల్లించింది. మరో రూ.339 కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.



అమరావతి నిర్మాణానికి, అన్న క్యాంటీన్ల నిర్వహణకు సీఎం చంద్రబాబుకు రూ.2 కోట్ల చెక్కు అందజేస్తున్న పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్

అమరావతి, అన్న క్యాంటీన్లకు విరాళాలు

- సీఎంకు చెక్కులు అందజేసిన పారిశ్రామికవేత్తలు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి, అన్న క్యాంటీన్లకు బుధవారం పలువురు విరాళాలు అందించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి చెక్కులు అందజేశారు. విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త, డీఆర్ఎన్ ఠాగూర్ గ్రూప్ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ అమరావతి, అన్న క్యాంటీన్లకు రూ.కోటి చొప్పున రూ.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. కడప జిల్లా పాయసంపల్లెకు చెందిన ఎన్వీ నారాయణరెడ్డి రాజధానికి రూ.10,00,116లను విరాళంగా అందించారు.

హైకోర్టుకు ఇద్దరు శాశ్వత న్యాయమూర్తులు



జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ గోపాలకృష్ణారావు

న్యూఢిల్లీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో ప్రస్తుతం అదనపు న్యాయమూర్తులుగా సేవలందిస్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వేణుతురుమల్లి గోపాలకృష్ణారావులు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గుంటూరు జిల్లా తెనాలిలో బాల త్రిపురసుందరి, పీవీకే శాస్త్రి దంపతులకు జన్మించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. 2008లో నేరుగా జిల్లా జడ్జి కేడర్‌లో ఎంపికయ్యారు. పలు జిల్లాల్లో ప్రధాన న్యాయాధికారిగా పనిచేశారు. అనంతరం హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు కృష్ణాజిల్లా చల్లపల్లిలో కోటేశ్వరమ్మ, సోమయ్య దంపతులకు జన్మించారు. తండ్రి సోమయ్య రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్. జస్టిస్ గోపాలకృష్ణారావు అవనిగడ్డ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1994లో జూనియర్ సివిల్ జడ్జిగా, 2007లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తాజాగా హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

ఆ ఆఫీసులపై స్పష్టత ఇవ్వండి

- రాజధానికి తరలిస్తారా? కర్నూలులోనే కొనసాగిస్తారా?
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ వక్ఫ్ ట్రిబ్యునల్, ఏపీఎస్‌హెచ్ఆర్సీ, ఏపీ లోకాయుక్త కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాది సలీం పాషా వాదనలు వినిపించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ రాజధాని ప్రాంతంలో ఏర్పాటుకు 2016లో అప్పటి ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. అది అమల్లో ఉండగానే వక్ఫ్ ట్రిబ్యునల్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ 2021లో ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. రాజధాని ప్రాంతంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. ఆ మూడు కార్యాలయాలు ఇప్పటికే కర్నూలులో ఏర్పాటయ్యాయని, అక్కడ పనిచేస్తున్నాయని వివరించారు. వాటిని తిరిగి అమరావతిలో నెలకొల్పాలని పిటిషనర్లు కోరుతున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ... కార్యాలయాలను అక్కడే కొనసాగిస్తారా? లేక రాజధాని ప్రాంతానికి తరలిస్తారా? అనే దానిపై స్పష్టంగా చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని కోరింది. ప్రభుత్వం నుంచి సమాచారం తీసుకొని వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఏపీ లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ప్రధాన కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేశారు. మానవ హక్కుల కమిషన్‌లో సిబ్బంది నియామకంతో పాటు ఫిర్యాదుల స్వీకరణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ మరో పిల్ వేసింది. అలాగే విజయవాడలో వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి విరుద్ధంగా కర్నూలులో ఏర్పాటు చేసేందుకు 2021లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవో 16ను సవాల్ చేస్తూ మొహ్మద్ ఫరూక్ సిబ్లి మరో పిల్ వేశారు.

కోలుకుంటున్న చిన్నారులు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన చిన్నారులు విశాఖ కేజీహెచ్‌లో క్రమంగా కోలుకుంటున్నారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో 38 మంది, మరో నలుగురు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్ పీడియాట్రిక్ విభాగం జనరల్ వార్డులో 25 మంది చిన్నారులు పూర్తిగా కోలుకున్నారు. పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో 13 మంది ఉన్నారు. అనారోగ్యానికి గురైన చిన్నారుల్లో నలుగురిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు.

కాటేసిన కేబుల్ తీగ

- వేలాడుతున్న వైరు తగిలి విద్యుత్ షాక్
- బాలుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన తంజూరు రెహ్మాన్



గాయపడిన షేక్ అదనన్ ఆలీ

కడప(క్రైం), ఆగస్టు 21: కడప నగరంలో బుధవారం మధ్యాహ్నం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సైకిల్‌పై బడికి వెళుతున్న ఇద్దరు విద్యార్థులకు రోడ్డుమధ్యలో వేలాడుతున్న కేబుల్ తగిలి విద్యుత్ షాక్‌తో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. కడప నగరంలోని బెల్లంమండీ వీధికి చెందిన అబ్దుల్ రెహ్మాన్ మటన్ షాపులో పనిచేస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు కాగా తంజూరు రెహ్మాన్(11) రెండో కుమారుడు. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవరు అజ్మత్ ఆలీకి నలుగురు పిల్లలు కాగా పెద్దవాడు షేక్ అదనన్ ఆలీ(11). వీరిద్దరూ సమీపంలోని ప్రైవేటు స్కూలులో ఐదో తరగతి చదువుతున్నారు. రోజూ మాదిరే బుధవారం స్కూలుకు వెళ్లి మధ్యాహ్నం ఇళ్లకు వచ్చారు. భోజనం చేసిన తరువాత తిరిగి సైకిల్‌పై స్కూలుకు బయలుదేరారు. మార్గమధ్యంలో టైటాన్ బిల్డింగ్ వద్దకు రాగానే వేలాడుతున్న కేబుల్ తంజూరు రెహ్మాన్‌కు తగలడంతో ఒక్కసారిగా ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయారు. సైకిల్‌లో మంటలు చెలరేగాయి. స్పందించిన స్థానికులు గాయపడిన చిన్నారులను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో శరీరమంతా కాలిపోయి తంజూరు రెహ్మాన్(11) మృతిచెందాడు. మరో విద్యార్థి షేక్ అదనన్ తీవ్రంగా గాయపడ్డాడు. పిల్లల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆసుపత్రికి చేరుకుని గాయపడ్డ విద్యార్థిని పరామర్శించారు. కాగా, ఈ ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న టైటాన్ అనే భవనానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనివద్దే కేబుల్ ఉంది. ఇక్కడి నుంచి వేలాడుతున్న కేబుల్ విద్యార్థికి తగలగానే ఎర్త్ కావడంతో షాక్‌కు గురయ్యారని చెబుతున్నారు.

చిన్నారి మరణం ఆవేదన కలిగించింది: మంత్రి లోకేశ్

వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి చిన్నారి తంజూరు రెహ్మాన్(11) మృతిచెందిన ఘటనపై మంత్రి లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని తెలిపారు. విద్యుదాఘాతంతో గాయపడిన మరో విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మృతిచెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బుధవారం ఎక్స్‌లో లోకేశ్ పేర్కొన్నారు.

ఇసుక ఇక.. సులభం!

ప్రత్యేక బుకింగ్ కేంద్రాలు.. అనుమతి ఉన్న వాహనాలకే స్టాక్ యార్డ్‌ల్లోకి ప్రవేశం

- సెప్టెంబరులో సమగ్ర పాలసీ
- అత్యవసరంగా సమీక్షించిన సీఎం
- లోపాలపై అధికారులకు ప్రశ్నలు
- ఇకపై రోజూ సమీక్ష: చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక బుకింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని గనుల శాఖను ఆదేశించింది. అనుమతి ఉన్న లారీలకే స్టాక్ యార్డుల్లో ప్రవేశం కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. సమగ్ర ఇసుక పాలసీ వచ్చేలోగా పంపిణీలో సమస్యలు రాకుండా కొత్త విధానం అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఉచిత ఇసుక పంపిణీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు బుధవారం సాయంత్రం అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, గనులశాఖ ముఖ్య కార్యదర్శి మీనా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇసుక పంపిణీలో నెలకొన్న సమస్యలపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. "ప్రజల మేలుకోరి ఉచిత ఇసుక విధానం తీసుకొస్తే ఈ గందరగోళం ఏవిటి? ఉచిత ఇసుక విధానం కన్నా గతంలోనే ధరలు బాగున్నాయన్న ప్రచారం ఏమిటి? ఈ సమస్యలు ఎందుకొస్తున్నాయి? పరిష్కారానికి ఇంకా ఎంతకాలం వేచిచూడాలి? తక్షణమే ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాలి" అని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఉచిత ఇసుకపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం, వస్తున్న ఆరోపణలు, విమర్శలు, ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదులపై చంద్రబాబు తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

యార్డుల వద్ద బుకింగ్ లేదు

ఇసుక స్టాక్‌యార్డ్‌ల వద్ద బుకింగ్ చేయడానికి వీల్లేదని, దీనికి ప్రత్యేకంగా కౌంటర్లు, ఆఫీసులు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనివల్ల గందరగోళం తగ్గుతుందని అధికారులు కూడా పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు బుకింగ్ ఆఫీసులను ఏర్పాటు చేసి ప్రజలకు తెలిసేలా ప్రచారం కల్పిస్తారు. ఉచిత ఇసుక కావాల్సిన వారు బుకింగ్ ఆఫీసులలో బుక్ చేసుకుని రశీదు తీసుకోవాలి. బుకింగ్ సమయంలోనే స్టాక్‌యార్డ్‌కు వాహనాన్ని ఎప్పుడు తీసుకువెళ్లాలో, లోడ్ ఎప్పుడు చేయించుకోవాలో తెలిపే టైమ్‌స్లాట్ కూడా రశీదులోనే పేర్కొంటారు. అందులో ఎన్ని టన్నుల ఇసుక కావాలి? వాహనం ఏమిటి? దాని నెంబరు ఇలా పలు వివరాలు నమోదు చేయించుకోవాలి. సదరు రశీదు తీసుకుని నిర్దేశిత సమయానికి స్టాక్‌యార్డ్‌కు వెళ్లాలి.

రవాణాలోనూ మార్పులు

ఇసుక రవాణాకు సంబంధించి కూడా మార్పులు చేయనున్నారు. రవాణా వాహనాలను రిజిస్టర్ చేయడంతోపాటు కిలోమీటరుకు ఎంత చార్జీ తీసుకోవాలో జిల్లా కలెక్టర్లే నిర్ణయించనున్నారు. దీని ప్రకారం వినియోగదారుడికి ఇచ్చే రశీదులోనే రవాణా చార్జీల వివరాలను కూడా పేర్కొంటారు. స్టాక్‌యార్డ్ దగ్గర పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడ రశీదు చూపాలి. దానిలో వివరాల మేరకే వాహనాన్ని అనుమతిస్తారు. దీనివల్ల పర్మిట్ ఉన్న వాహనాలు, అందులోను టైమ్‌స్లాట్ ప్రకారం లోడింగ్‌కు అవకాశం ఉన్నవే యార్డుకు చేరుకుంటాయి. ఫలితంగా భారీ వాహనాల క్యూ ఇకపై ఉండదు. గంటల తరబడి, రోజుల కొద్దీ లైన్‌లో వాహనాలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండదు. పర్మిట్ లేని వాహనం ఎవరైనా స్టాక్‌యార్డ్‌కు తీసుకొచ్చి లైన్‌లో ఉంచాలంటే ఇకపై కొనసాగదు. కాగా, భూ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు నుంచి ప్రారంభించే గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ఇసుక అంశాన్ని చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ సమస్యలపై చర్చ ముగిసిన తర్వాత ఉచిత ఇసుక విధానం అమలు, ప్రజల స్పందనపై ప్రత్యేకంగా చర్చించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. అదేవిధంగా ఇసుక స్టాక్ యార్డ్‌ల వద్ద ఇకపై పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు.

వచ్చేనెలలో సమగ్ర పాలసీ

ఇసుక విధానంపై సెప్టెంబరులో సమగ్ర పాలసీ తీసుకురానున్నారు. విధివిధానాలను రూపొందిస్తున్నట్టు గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా సీఎంకు నివేదించారు. త్వరలో పూర్తిస్థాయి ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ విధానం తీసుకొస్తామని తెలిపారు. సెప్టెంబరు 6వ తేదీ నాటికి కాల్‌సెంటర్లు, పరిష్కార వేదికలను ఏర్పాటు చేస్తామన్నారు. కాగా, ఇకపై ప్రతి రోజూ ఉచిత ఇసుక అమలు తీరుపై సమీక్షిస్తానని సీఎం చెప్పినట్లు సమాచారం.

రవాణా చార్జీలు నిర్ణయించండి

- రీచ్‌లలో ఇసుక తవ్వకంపై నిరంతరం పర్యవేక్షించండి
- కలెక్టర్లకు సీఎస్ నీరబ్ ఆదేశం
- రేపటి గ్రామసభలను జయవంతం చేయాలని సూచన
- వాహనాలకు యూనిక్ నెంబర్: మీనా

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాజాగా తీసుకువచ్చిన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్‌లను ఆదేశించారు. మార్గదర్శకాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. సమస్యలు, లోపాలు లేని పంపిణీ విధానం కొనసాగాలని దిశానిర్దేశం చేశారు. నిర్ణీత ధరలకు మించి ఎక్కువ ధరకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. పెద్దఎత్తున లారీలు, ట్రక్కులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితులు లేకుండా చూడాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. కాగా, రాష్ట్రంలో శుక్రవారం నిర్వహించే గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని, ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, రహదారుల నిర్మాణం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

లోపాలు సరిదిద్దండి: మీనా

గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఇసుక రీచ్‌ల నిర్వహణ, రవాణా ధరల నిర్ధారణ అంశాలకు సంబంధించి కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లాల్లో ట్రాన్స్‌పోర్టర్లను పిలిచి ఇసుక రవాణాకు వినియోగించే వాహనాలను రిజిస్టర్ చేసి ఒక ప్రత్యేక యూనిక్ నంబరును కేటాయించాలన్నారు. ఆ నంబరున్న వాహనాలను మాత్రమే ఇసుక రవాణాకు ఉపయోగించాలని స్పష్టం చేశారు. ప్రతి రీచ్ వద్ద పోలీసు చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని డీజీపీ ద్వారకా తిరుమల రావు జిల్లాల ఎస్పీలను ఆదేశించారు.

ఆర్టీసీకి 1,489 కొత్త బస్సులు

- కొనుగోలు చేసేందుకు సర్కారు పచ్చజెండా
- ఎలక్ట్రికల్ బస్సుల వినియోగాన్ని పెంచండి
- మహిళలకు పకడ్బందీగా ఉచిత బస్సు ప్రయాణం
- రవాణా శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయని ఏపీఎస్‌ఆర్టీసీలో డొక్కు బస్సులు తీసేసి వాటి స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఇప్పటికే ప్రతిపాదించిన 1,489 బస్సులు కొనుగోలు చేసుకోవాలంటూ పచ్చజెండా ఊపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న తరుణంలో ఆర్టీసీలోనూ వాటి వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీజిల్, ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుతో పాటు నిర్వహణ వ్యయం, మైలేజీ వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని సముచిత నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు కేంద్రం సబ్సిడీ ఇస్తున్నందున మన రాష్ట్ర వాటా కింద 1,253 బస్సులు వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దె బస్సులు, సొంత బస్సుల కొనుగోలు, నిర్వహణపై లాభనష్టాలు, ఉపయోగాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేయకపోవడం వల్ల 15 లక్షల కి.మీ. పైగా తిరిగిన బస్సులు ఎక్కడి కక్కడ ఆగిపోతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సులు తగ్గించిందని, పల్లె ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు పెంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు అన్నారు. ఆన్‌లైన్ విధానాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవడంతో పాటు కార్గో సేవల్ని విస్తరించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప గత ప్రభుత్వం ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని పెదవి విరిచారు. రోడ్ సేఫ్టీ కమిటీ క్రమం తప్పకుండా సమావేశమై ప్రతి ప్రమాదాన్ని విశ్లేషించుకుని బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించి ఉమ్మడి నిర్ణయం తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పదిహేనేళ్లు దాటిన వాహనాలను తొలగించాలని, వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అధ్యయనంతో కూడిన నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ అధికారులను సీఎం ఆదేశించారు. దేశంలో ఈ పథకం అమలు చేస్తున్న ఢిల్లీ, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో నిపుణులతో కూడిన అధికారుల బృందం పర్యటించి అధ్యయనం చేయాలని ఆదేశించారు.

ఎవరూ హెల్మెట్ ధరించడం లేదు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తామిచ్చిన ఆదేశాలను అధికారులు అమలు చేస్తున్నట్లు లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటికీ 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండానే వాహనాలు నడుపుతుండడాన్ని తాము గమనించామని పేర్కొంది. చట్టనిబంధనలు అమలు చేయడంలో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసింది. హెల్మెట్ ధరించనివారికి వారు జరిమానా విధిస్తున్నట్లు తాము ఎక్కడా గమనించలేదని తెలిపింది. తాము ఆదేశాలు ఇచ్చిన నాటినుంచి హెల్మెట్ ధరించనివారికి ఎన్ని చలాన్లు విధించారు? చలాన్ల రూపంలో ఎంత సొమ్ము వసూలు చేశారు? ఎంతమంది లైసెన్స్‌లు రద్దు చేశారు? ఇప్పటివరకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎంతమంది చనిపోయారు? తదితర వివరాలను కోర్టు ముందు ఉంచాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది తాండవ యోగేశ్ దాఖలు చేసిన పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా యోగేశ్, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి తమ వాదనలను వినిపించారు.

26 మంది డీఎస్పీల బదిలీ

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 26 మంది డీఎస్పీలను బుధవారం పోలీసు శాఖ బదిలీ చేసింది. వీరిలో పదిమందికి డీజీపీ తిరుమల రావు సబ్ డివిజన్లు కేటాయించారు. మరో 13 మందిని ప్రాధాన్యం లేని ఇతర విభాగాలకు బదిలీ చేయగా, ముగ్గురికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఇటీవలే రాజంపేట సబ్ డివిజన్ అధికారిగా నియమితులైన ప్రకాశ్ బాబు వ్యక్తిగత కారణాలతో విధుల్లో చేరలేదు. దీంతో తాజా బదిలీల్లో ఎస్.సుధాకర్‌కు రాజంపేట పోస్టింగ్ ఇచ్చారు. విజయనగరం డీఎస్పీగా చిట్టిబాబు, గుంటూరు పశ్చిమకు జయరామ్ ప్రసాద్, నరసరావుపేట సబ్ డివిజన్‌కు నాగేశ్వరరావు, శ్రీకాళహస్తికి నరసింహమూర్తి, పలమనేరుకు టి.ప్రభాకర్, అమలాపురంకు టీఎస్ఆర్‌కే ప్రసాద్, కాకినాడకు రఘువీర్ విష్ణు, చిత్తూరుకు సాయినాథ్, పత్తికొండకు డి.వెంకట్రామయ్యను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం డీఎస్పీ గోవిందరావు, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, విజిలెన్స్ డీఎస్పీ కిరణ్ కుమార్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు. హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు





ఆలయ వీధిలో ధ్వంసమైన రహదారి, జలాశయం ఘాట్‌రోడ్డుపై పడ్డ బండరాళ్లు

శ్రీశైలం, ఆగస్టు 21: శ్రీశైలం జలాశయం ఘాట్ రోడ్డులో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. కుడిగట్టు విద్యుత్ కేంద్రం పైభాగంలోని ఘాట్ రోడ్డులో పెద్ద బండరాళ్లు రోడ్డుమీదకు వచ్చిపడ్డాయి. దీంతో తెలంగాణ ప్రాంతం నుంచి శ్రీశైలానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే భారీ వర్షం కారణంగా జలాశయానికి వెళ్లే రోడ్డు, శ్రీశైలం ఘాట్ రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇదిలా ఉండగా మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీశైలంలో పలు వీధులు జలమయమయ్యాయి. క్షేత్ర పరిధిలోని ఆలయ మాడవీధులు, లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్, ఎస్సీ కాలనీ, కొత్తపేట, శ్రీగిరి కాలనీ, క్షేత్ర వీధుల్లో వర్షపు నీరు చేరింది. కొత్తపేటలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్లలోకి నాలుగు అడుగుల మేర నీరు చేరి భారీగా ఆస్తి నష్టం సంభవించింది. పాతాళగంగ మెట్ల మార్గంలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. ఆలయ ఈఓ డి.పెద్దిరాజు బుధవారం వర్షంతో దెబ్బతిన్న ప్రదేశాలను పరిశీలించారు. ఇళ్లలోకి నీరు చేరిన వారు ఆలయ వసతిగృహాల్లో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఇసుకపై త్వరలోనే పూర్తిస్థాయి పాలసీ

- హైకోర్టుకు ప్రభుత్వం నివేదన.. లోడింగ్ పాయింట్ వద్దే టార్పాలిన్ కప్పాలి
- ఇసుక వాహనాల వేగాన్ని నియంత్రించాలి.. ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక విషయంలో త్వరలో పూర్తిస్థాయి విధానాన్ని తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రస్తుతం తాత్కాలిక విధానం అమలు చేస్తున్నామని బుధవారం అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వివరించారు. నదుల్లో ప్రవాహాలు ఎక్కువగా ఉండడం వల్ల ఇసుక తవ్వకాలు జరగడం లేదన్నారు. ఇసుక తవ్వకాలు, నివాస ప్రాంతాల మీదుగా ఇసుక రవాణా, ఆ వాహనాలపై టార్పాలిన్ (పట్టా)ను తప్పనిసరి చేయడం, వీటి అన్నింటినీ పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు, యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి సూచనలను పూర్తిస్థాయి విధానంలో పొందుపరుస్తామని వివరించారు. పూర్తి స్థాయి ఇసుక విధానాన్ని తీసుకొచ్చేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం..లోడింగ్ పాయింట్ వద్ద వాహనంలో ఇసుక నింపిన వెంటనే టార్పాలిన్ కప్పే విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. టార్పాలిన్ కప్పకుండా ఇసుకను తరలించే వాహనాలపై ఏ చర్యలు తీసుకుంటారు? ఇసుక వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా? ఇందుకోసం ఏమైనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నారా? తదితర వివరాలను తదుపరి విచారణలో కోర్టు ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగినప్పుడు ప్రభుత్వం వైపు నుంచి బాధ్యత తీసుకొనేవారు ఉండాలని పేర్కొంది. పూర్తి స్థాయి ఇసుక విధానాన్ని తీసుకొచ్చేందుకు కొంత సమయం పడుతుందని ఏజీ చెబుతున్న నేపథ్యంలో విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం ముత్తాయపాలెం గ్రామం పరిధిలో జయప్రకాశ్ వెంచర్స్ సంస్థ ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తోందని, నదికి అడ్డంగా ర్యాంపులు ఏర్పాటు చేసి భారీ వాహనాలతో ఇసుకను తరలిస్తున్నారని జీవీఎస్ఎస్ ప్రసాద్ మరో ఐదుగురు గత ఏడాది ఏప్రిల్‌లో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌తో పాటు ఇదే వ్యవహారంపై దాఖలైన మరికొన్ని వ్యాజ్యాలను ధర్మాసనం కలిపి విచారిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే సీనియర్ న్యాయవాది కే శ్రీనివాసమూర్తి కోర్టుకు సహాయకారిగా వ్యవహరిస్తున్నారు. వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం ఇసుక రవాణా చేసేందుకు వినియోగించే ట్రక్కులపై పట్టా కప్పే విధంగా రాష్ట్రంలో ఇసుక మైనింగ్‌కు అనుమతులు పొందిన కాంట్రాక్ట్ సంస్థలు జీసీకేసీ ప్రాజెక్ట్స్, ప్రతిమ ఇన్‌ఫ్రాకు ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... ఇసుక రవాణా చేసే వాహనాలపై టార్పాలిన్ కప్పడాన్ని తప్పనిసరి చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని మైనింగ్ శాఖ డైరెక్టర్ ఈ ఏడాది మే 21న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వాహనాలపై టార్పాలిన్ కప్పారా? లేదా అనేదానిపై పర్యవేక్షణ బాధ్యతను రెవెన్యూ వ్యవస్థకు అప్పగించారన్నారు. నివాస ప్రాంతాల నుంచి ఇసుక రవాణా వాహనాలను అనుమతించాలా? లేదా అనేది ఇసుక ర్యాంపులపై ఆధారపడి ఉంటుందన్నారు. కోర్టు చేసిన సూచనలను పూర్తిస్థాయి ఇసుక విధానంలో పొందుపరుస్తామని తెలిపారు. అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ... ఇసుక వాహనాల రవాణా విషయంలో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అవి అమలు కావడం లేదన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బద్లాపూర్ ఘాతుకం

మహారాష్ట్రలోని థానేజిల్లా బద్లాపూర్‌లో కిండర్‌గార్టెన్ స్కూల్లో ఇద్దరు చిన్నారులపై అటెండర్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. మూడేళ్ళు, నాలుగేళ్ల వయసున్న ఈ పిల్లలపై లైంగికదాడి జరగడం దేశాన్ని నిర్ఘాంతపరచింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు ఏమాత్రం భద్రత లేదని, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నవీరు, రక్షణకరువై నిస్సహాయంగా అత్యాచారాలకు, హత్యలకు గురికావాల్సి వస్తున్నదని పశ్చిమబెంగాల్ ఘటన చెబుతోంది. అభంశుభం తెలియని పిల్లలు చివరకు అక్షరాలు దిద్దేచోటకూడా రాక్షసుల చేతికిచిక్కి బలైపోతున్నారని బద్లాపూర్ ఘటన హెచ్చరిస్తోంది.

ఈ ఘటనను విపక్షాలు రాజకీయం చేయకూడదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌శిండే అంటున్నారు. పశ్చిమబెంగాల్‌లో అదే జరుగుతున్నదని తృణమూల్ వాదిస్తోంది. వైద్యురాలిమీద అత్యాచారం కంటే పసికందుల మీద అఘాయిత్యం మరింత ఘోరమైనదని కొందరు తూకాలు వేస్తున్నారు. బద్లాపూర్ ఘోరం వెలుగుచూసిన తరువాత కూడా జాతీయ మీడియా తన దృష్టిని బెంగాల్ నుంచి మళ్ళించకపోవడంలో ఏదో దురుద్దేశం ఉన్నదని మరికొందరి వాదన. ఈ విమర్శలను, వ్యాఖ్యలను అటుంచితే, ఈ దేశంలో రాజకీయం కానిదేదీ లేదు. ఆయా పార్టీలు, అవి మోహరించివున్న కూటములు ఈ ఘటనల్లో తమతమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడం కనిపిస్తూనే ఉంది. బద్లాపూర్ ఉదంతం స్థానికులను తీవ్రంగా కుదిపేసింది. వందలాదిమంది వీధుల్లోకి వచ్చి ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. పసికందులకు పాఠశాలల్లో సైతం రక్షణలేదన్న చేదునిజం వారిని నిలవనివ్వలేదు. రైళ్ళరాకపోకలను నిలిపివేశారు, స్కూలుమీద దాడులుచేశారు, విధ్వంసకాండకు పాల్పడ్డారు. తల్లిదండ్రులనుంచి ఫిర్యాదు స్వీకరించేందుకు పోలీసులు మొదట నిరాకరించారనీ, కేసు నమోదులో తీవ్రజాప్యంచేశారనీ, ఒక తల్లి పదిగంటలపాటు పోలీసు స్టేషన్‌లోనే నిరీక్షించవలసి వచ్చిందనీ వార్తలు వచ్చాయి. పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై పోలీసులు ఈ ఘటనను తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారని స్థానికుల వాదన. బాధిత చిన్నారులనుంచి సమాచారం సేకరించడం కష్టమైన పని కనుక కేసునమోదు ఆలస్యమైందనీ, తరువాత కొద్దిగంటల్లోనే స్కూల్ అటెండర్‌ను అరెస్టుచేశామని పోలీసులు సమర్థించుకుంటున్నారు. ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు తక్షణ అరెస్టులు, సస్పెన్షన్లు, సిట్ ఏర్పాటు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ ఇత్యాదివి ప్రభుత్వం చేపట్టింది. ప్రజలకు మరింత నమ్మకం కలగడానికి సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రంగంలోకి దించింది. బీజేపీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా నిలబడిన ఈయనా, సదరు స్కూల్ యాజమాన్యం ఒకే పార్టీకి చెందిన విషయాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. న్యాయం చేయడం కంటే, ఘాతుకాలను కప్పిపుచ్చేందుకు రాష్ట్రంలో విశేషప్రయత్నం జరుగుతున్నదని ఆరోపిస్తున్న మహావికాస్ ఆగాడీ ఆగస్టు 24న రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న మహారాష్ట్రలో ఈ ఘటన ప్రభావం చూపకపోదు.

స్కూలు సిబ్బంది ఎంపిక, సీసీకెమెరాలతో సహా పిల్లల భద్రతకు సంబంధించిన సమస్త ఏర్పాట్ల విషయంలో యాజమాన్యాలు ఎంతో శ్రద్ధగా ఉండాలని బద్లాపూర్ ఘటన గుర్తుచేస్తోంది. చాలా స్కూళ్ళలో మూత్రశాలలు దూరంగా ఉండటం, పిల్లలను స్కూలుకు తీసుకువచ్చేవారు సైతం వాటిని వినియోగిస్తూండటం ప్రమాదాలకు ఎక్కువ అవకాశాన్నిస్తాయి. మరో రేప్, హత్య జరగనిదే మేలుకోమా? అని కోల్‌కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు చక్కని ప్రశ్న వేసింది. ఎఫ్ఐఆర్ దాఖలులో జాప్యంనుంచి ఈ దారుణాన్ని ఆత్మహత్యగా చిత్రించేందుకు చూసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌వరకూ ప్రతీవారినీ, ప్రతీదశనూ తప్పుబడుతూ, మమత సర్కారుకు తలంటుతూ సుప్రీంకోర్టు ప్రశంసనీయమైన చొరవ ప్రదర్శించింది. వ్యవస్థలోని లోపాలను ఈ ఘటన తెరమీదకు తెచ్చిందనీ, వైద్యుల భద్రతకు దేశవ్యాప్త ప్రోటోకాల్ ఉండాలనీ అంటూ నివేదికల తయారీకోసం టాస్క్‌ఫోర్స్ ప్రకటించింది. అరుణా శాన్‌బాగ్ ఉదంతం జరిగిన యాభైఒక్క సంవత్సరాల తరువాత కూడా ఈ దేశంలోని మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ దక్కడం లేదని కోల్‌కతా ఘటన నిరూపించింది. మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో, వారికి ప్రతీచోటా భద్రత కల్పించే ప్రయత్నం విశేషంగా జరగాలి, నిర్దిష్టమైన విధివిధానాల రూపకల్పనకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాలి.

అవే తప్పులు మళ్లీ మళ్లీ చేస్తే, అదే ఫలితం!

ఓటమితో ఉన్న సమస్య ఏమిటంటే, అందులో జరిగే నష్టం కంటె అవమానం ఎక్కువ బాధిస్తుంది. ఓడిపోయినవారు తొందరగా సమాధానపడలేరు. నవీన్ పట్నాయక్ లాంటి గంభీరులు అరుదు. తమ తప్పేమీ లేదని, ప్రజలను ప్రత్యర్థులు మభ్యపెట్టారని కొందరు బుకాయిస్తారు. అంతా మంచే చేసినా ఇట్లా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదని మరి కొందరు అమాయకత్వాన్ని అభినయిస్తారు. సగం ఓటములతో మరో సమస్య. చావు తప్పి కన్ను లొట్టపోయిన తీరులో గెలుపులు దక్కుతాయి కొందరికి. తామేదో ఘనవిజయం సాధించినట్టు వారు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుంటారు.

నష్టమో కష్టమో ఓటమో జరిగిపోయినప్పుడు, ఆ తరువాత అయినా వెనక్కి తిరిగి చూసుకోవాలి. అద్దం ముందు నిలబడి అంతరాత్మతో మాట్లాడాలి. పారిన నీటికి కరకట్ట కట్టలేము కానీ, రేపటి తప్పును నివారించుకోవచ్చు. గుణపాఠం అంటే అదే. అనుభవజ్ఞులు తక్కువ తప్పులు చేయడం, ఎదురుదెబ్బలను నిబ్బరంగా కాచుకోవడం అందువల్లనే.

కొందరు పాఠాలు నేర్చుకోవడంలోనూ తప్పులు చేస్తారు. ప్రజలను బాగా కష్టపెట్టి ఒక నాయకుడు పదవి పోగొట్టుకున్నాడనుకోండి. తగినంత కష్టపెట్టలేదు కాబట్టే, అలుసు తీసుకుని ఓడించారనీ, ఈ సారి అధికారం వస్తే, జనం అసలే కిక్కురుమనలేకుండా తొక్కిపెట్టాలనీ పాఠం నేర్చుకుంటే ఎట్లా ఉంటుంది? బొటాబొటి విజయంతో, అరువు బలంతో మూడోసారి కేంద్రంలో అధికారం దక్కించుకున్న జాతీయపార్టీ, పాపం, పాఠాలు నేర్చుకుందామనే చూస్తోందట, కానీ, ఆ పార్టీకి ఆశీస్సులు అందించే పీఠాధిపతులు, మతపెద్దలు కొందరు విలోమ పాఠాలు నేర్పుతున్నారట. "మునుపు మెత్తగా ఉన్నావు కాబట్టే, నిన్ను జనం మొత్తారు, ఇప్పుడు కఠినంగా ఉండు, జనం దారికి వస్తారు" అంటూ నాయకుడికి చెబుతున్నారట. ఆయన వింటాడో లేదో తెలియదు.

వాళ్లు చెప్పిన విలువలేమిటో తెలియదు కానీ, పోయిన రెండు దఫాలుగా అనుసరిస్తూ వస్తున్న కొన్ని పద్ధతులను మాత్రం జాతీయ అధికారపార్టీ మరింత ఉధృతంగా ముందుకు తీసుకువెడుతోంది. రెండు ప్రాంతీయ పార్టీల భుజాల మీద తాను నిలబడ్డానని మరచిపోయి, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీల రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆయుధాలు ఎక్కుపెడుతూ ఉన్నది. ప్రజల వాస్తవ, దైనందిన సమస్యలను పట్టించుకుని, ఆ దిశగా ఏవైనా దిద్దుబాటు చర్యలు తీసుకోవలసింది పోయి, పాత బాణీలోనే చాణక్య రాజకీయాలు నడుపుతోంది.

ముందున్న గండం, లేదా, అవకాశం, మహారాష్ట్ర ఎన్నికలు. వాటి తేదీలు ప్రకటించలేదు కానీ, ఈలోగా, హర్యానా, కశ్మీర్ ఎన్నికల ప్రక్రియ మొదలయింది. వీటిలో గణనీయమైన విజయాలు సాధిస్తే, ఎన్‌డీఏలో బీజేపీ వాటా పెరుగుతుంది. ఇతరుల మీద ఆధారపడే అవసరం తగ్గుతుంది. ఆ మేరకు, మద్దతు ఇస్తూ సాయపడుతున్న పార్టీల పలుకుబడి కూడా తగ్గుతుంది. అది బీజేపీకి చాలా అవసరం. పార్లమెంటు ఎన్నికలలో మహారాష్ట్రలో బాగా ఎదురు దెబ్బ తగిలింది. హర్యానాలో బాగానే బలహీన పడింది. పాఠం నేర్చుకుని పురోగమించాలనుకునే పార్టీ ఏమిచేయాలి? ప్రజల అసంతృప్తులను ఉద్దేశించి పని చేయాలి. కానీ, వెనుకటి గుణం ప్రకారం, ఉద్వేగాలను ప్రయోగించడమనే అడ్డదారినే ఎంచుకుంటోంది.

ఆవేశరాజకీయాలను ఆశ్రయించాలన్నా అవకాశాలు రావాలి కదా, వస్తాయి, వచ్చాయి కూడా. ఒకటి, బంగ్లాదేశ్ పరిణామాలు. అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం మీద వ్యతిరేకత తీవ్రమై, విద్యార్థుల ఆందోళనలు ఉధృతమై, కీలక రాజకీయ పరిణామాలు సంభవించాయి. షేక్ హసీనా భారత్‌కు పారిపోయి వచ్చిన తరువాత, జరిగిన సంఘటనలలో ఉద్యమకారులు, వారిపేరిట అరాచక



> ఏ తప్పులు, ప్రగల్భాలు, అహంకారాలు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను గద్దె దించాయో, అవే అవలక్షణాలను కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పుణికి పుచ్చుకుంటే, ఇక ప్రజలకు దొరికిన 'మార్పు' ఏమిటి? ఊరూరా న్యూయార్క్‌ను, సింగపూర్‌ను, డల్లాస్‌ను ఏర్పాటు చేస్తామని గొప్పలు పోయిన కేసీఆర్ మాటలను కొందరు నిజమనుకున్నారు, చాలామంది హేళన చేశారు. మరి ఇప్పుడు, ఆ నగరాల నామస్మరణ కొత్తగా తిరిగి వినిపిస్తున్నది! చినుకు పడితే ఊరుచెరువయ్యే మహానగరానికి మోక్షం లేదు కానీ, నాలుగో నగరం పేరిట, గాలిమేడలు లేస్తున్నాయి! 30వేల కోట్ల రుణమాఫీయే ముక్కుతూ మూల్గుతూ చేస్తున్నప్పుడు, లక్షల కోట్ల ప్రాజెక్టులతో భారీ ప్రాజెక్టులు ఎట్లా సాధ్యం?

శక్తులు విధ్వంసాలకు పాల్పడ్డారు. బంగ్లాదేశ్‌లోని మైనారిటీలైన హిందువుల మీద, వారి ఆస్తుల మీద, దైవస్థలాల మీద దాడులు జరిగాయి. వాటిలో అవామీలీగ్ మద్దతుదారులుగా జరిగిన దాడులు, మతపరమైన దాడులు కూడా ఉన్నాయి. సహజంగానే, అది భారత సమాజానికి ఆందోళన కలిగిస్తుంది. దౌత్యపరంగా ఒత్తిడి తేవడం, విజ్ఞప్తులు చేయడం మినహా భారత ప్రభుత్వం కూడా ఏమీ చేయలేక పోయింది. కానీ, తొందరలోనే బంగ్లాలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. వెంటనే శాంతి భద్రతలు చక్కబడలేదు కానీ, భయపడినంత దీర్ఘకాలం పట్టలేదు. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో జాతీయ అధికార పార్టీ, దానికి పూర్తి మద్దతు ప్రకటించే ఆంగ్ల, హిందీ మీడియా, బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు. భారత దేశంలోని హిందువులు బంగ్లాదేశ్‌లోని సాటి మతస్థుల భద్రత విషయంలో తీవ్ర భయాందోళనలకు గురిఅయ్యేట్టు మితిమీరిన ప్రచారం చేశాయి. వారి ప్రసారాల్లో వాస్తవం అసలే లేదని కాదు, కానీ, విపరీత వ్యాఖ్యానాలే ఎక్కువ. పోనీ, బంగ్లాలో రాజకీయ అస్థిరతను చక్కబరవడంలో భారత్‌కు ఏదైనా అవకాశం దొరికిందా, బంగ్లా హిందువులకు భద్రత కల్పించడంలో ఏదైనా సొంత చొరవ సాధ్యపడిందా అంటే అదీ లేదు. జాతీయ మీడియా ప్రచారం చేసినట్టు, అమెరికా ప్రాబల్యమో, చైనా తెర వెనుక మంత్రాంగమో పనిచేశాయి, సాధారణ స్థితివైపు బంగ్లాదేశ్ నెమ్మదిగా నడుస్తున్నది.

బంగ్లాదేశ్ గిట్టుబాటు కాకపోయినా, బెంగాల్ ద్వారా రాజకీయ లాభం బాగానే సాధ్యపడేట్టు ఉంది. మహిళా డాక్టర్, ఆస్పత్రి ఆవరణలోనే ఎదుర్కొన్న చిత్రహింస దారుణమైనది, అమానుషమైనది. ఆ దుర్మార్గాన్ని చెప్పడానికి భాష సరిపోదు. నిర్భయ సంఘటన తరువాత మగోన్మాదం తగ్గిందీ లేదు, స్త్రీల భద్రత విషయంలో యంత్రాంగాల సున్నితత్వం పెరిగిందీ లేదు. కోల్‌కతా సంఘటన తరువాత దేశవ్యాప్తంగా వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు భయభ్రాంతులయ్యారు. మహిళాసంఘాలతో సహా పౌరసమాజం అంతా ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. హైకోర్టు కల్పించుకుని కేసును సీబీఐకి ఇచ్చింది. సుప్రీంకోర్టు సొంతంగా ఈ దురంతం మీద విచారణ జరుపుతోంది. నేరాన్ని కప్పిపుచ్చడానికి, నేరం మీద నిరసనను అణచివేయడానికి మమతాబెనర్జీ ఎందుకంత క్రూరమైన చర్యలు చేపట్టారో తెలియదు. సందేశ్ కాళీ ఘోరాలను క్షమించి గెలిపించారు కానీ, ఈ నేరపూరిత నిర్లక్ష్యానికి మమత మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. అయితే, బీజేపీ, దాని అనుచర సమాచార సాధనాలు కోల్‌కతా సంఘటన మీద మోగిస్తున్న రణభేరిలో నిజాయితీ ఉన్నదా అన్న సందేహం కలిగితీరుతుంది. ప్రతిపక్ష రాష్ట్రం కాకపోతే, ఇంత గగ్గోలు చేసేవారా? కట్టెదుట నేరాలు జరుగుతుంటే కళ్లు మూసుకోవడం బీజేపీకి మాత్రం కొత్తదా? మణిపూర్ విషయంలో ఏమి జరిగింది? వినేశ్ ఫోగాట్ విషయంలో ఏమి చేశారు? మరి మహారాష్ట్రలో థానే జిల్లా బద్లాపూర్‌లో చిన్నారులపై జరిగిన లైంగిక హింస మీద కవరేజ్ ఎక్కడ? దాని మీద కేంద్రప్రభుత్వం కలవరపడదేమి? అక్కడ అస్మదీయ ప్రభుత్వం ఉన్నందుకే గొంతు లేవడం లేదా?

సిద్దరామయ్య మీద కేసు సంధించారు. గవర్నర్లను ఎడాపెడా వాడుకోవడంలో కేంద్రప్రభుత్వం ఆరితేరిపోయింది. కర్ణాటక ముఖ్యమంత్రి కడిగిన ముత్యమనీ, సుద్దపూసని అనుకోనక్కరలేదు, కానీ, దేశంలోని బీజేపీ ముఖ్యమంత్రులనేకుల కంటె మెరుగైన నాయకుడే. రాజకీయ నేతల మీద కేసులు పెట్టడానికి అవినీతి తీవ్రతో, విస్తృతో కారణం కానక్కరలేదు, ప్రతిపక్ష రాష్ట్రం అయితే చాలు. కేరళలో కూడా 2015 నాటి ఒక పాత కేసు ప్రాణం పోసుకుంటున్నది. రాష్ట్రాలను వేటాడే ఈ ధోరణి విషయంలో చంద్రబాబు, నితిశ్ కుమార్ నిరసన తెలిపినా తెలపకున్నా, తమ జాగ్రత్తలలో తాముండడం మాత్రం అవసరం. అవసరార్థం ఇప్పుడు అణకువ చూపిస్తున్నా, బలం పుంజుకున్నాక, బీజేపీ పెద్దన్న హాజం చూపించదని ఏమీ లేదు. తన బలహీన విజయం గురించి పొరపాటు పాఠాలు తీసుకుంటే దాని ఫలితం బీజేపీయే అనుభవిస్తుంది. తమ ఘన విజయంలో ఇమిడి ఉన్న బాధ్యతను, అవకాశాలను, ప్రమాదాలను చంద్రబాబు గ్రహించి, మెళకువతో ఉండాలి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

గెలిచిన పార్టీ కూడా ఓడిన పార్టీ అనుభవం నుంచి నేర్చుకోవాలి. తెలంగాణలో బీఆర్ఎస్ స్వయంకృతాపరాధాన్ని తెలుసుకోకుండా, ప్రజలదే తప్పు అని హుంకరిస్తున్నది. మరి బీఆర్ఎస్ ఓటమి నుంచి కాంగ్రెస్ ఏమి నేర్చుకున్నది? ఏ తప్పులు, ప్రగల్భాలు, అహంకారాలు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను గద్దె దించాయో, అవే అవలక్షణాలను కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పుణికి పుచ్చుకుంటే, ఇక ప్రజలకు దొరికిన 'మార్పు' ఏమిటి? ఊరూరా న్యూయార్క్‌ను, సింగపూర్‌ను, డల్లాస్‌ను ఏర్పాటు చేస్తామని గొప్పలు పోయిన కేసీఆర్ మాటలను కొందరు నిజమనుకున్నారు, చాలామంది హేళన చేశారు. మరి ఇప్పుడు, ఆ నగరాల నామస్మరణ కొత్తగా తిరిగి వినిపిస్తున్నది! చినుకు పడితే ఊరుచెరువయ్యే మహానగరానికి మోక్షం లేదు కానీ, నాలుగో నగరం పేరిట, గాలిమేడలు లేస్తున్నాయి! 30వేల కోట్ల రుణమాఫీయే ముక్కుతూ మూల్గుతూ చేస్తున్నప్పుడు, లక్షల కోట్ల ప్రాజెక్టులతో భారీ ప్రాజెక్టులు ఎట్లా సాధ్యం?

> అవసరార్థం ఇప్పుడు అణకువ చూపిస్తున్నా, బలం పుంజుకున్నాక, బీజేపీ పెద్దన్న హాజం చూపించదని ఏమీ లేదు. తమ ఘన విజయంలో ఇమిడి ఉన్న బాధ్యతను, అవకాశాలను, ప్రమాదాలను చంద్రబాబు గ్రహించి, మెళకువతో ఉండాలి.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంకా మూడు నెలలు కూడా కాలేదు. ఎన్నికల వాగ్దానాలకు సంబంధించి, అక్కడ కూడా ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉన్నాయి కానీ, ప్రజలు వేచి చూసే ధోరణిలోనే ఉన్నారు. కొత్త ప్రభుత్వాల మీద ప్రజలకు ఎంతకాలానికి అసంతృప్తి మొదలవుతుంది అంటే ఒకే సమాధానం రావడం కష్టం. ఎటువంటి పాలన మీద విరక్తి చెంది కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు అన్నదాని మీద కొంత, కొత్త పాలనలో కనిపించే సానుకూల సూచనల మీద మరికొంత ప్రజలు పెట్టే గడువు ఆధారపడి ఉంటుంది. జగన్ ప్రభుత్వమంత కాకపోయినా, రెండు దఫాల పాలనలో కేసీఆర్ ఏలుబడి కూడా తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. దాన్ని తొలగించాక వచ్చిన కొత్త పాలనకు ప్రజలు గడువు ఇస్తున్నారు కానీ, తొమ్మిదినెలలు దాటింది కదా, కొంత పెదవి విరుపు మొదలయింది. కరెంటు పోయి వచ్చినప్పుడల్లా కేసీఆర్‌ను జనం తలచుకుంటున్నారని చెబుతున్నారు! ఆ సందర్భాలు రోజుకు పది పదిహేను సార్లు వస్తున్నట్టున్నాయి! అవినీతి అనో, అక్రమాలనో ఆరోపణలు పెద్ద ఎత్తున రావడం లేదు, కాకపోతే, పాలన మీద ఇంకా పట్టురాలేదని మాత్రం జనం బాగానే చెప్పుకుంటున్నారు!

బీజేపీతో కలిసి బీఆర్ఎస్‌ను చెడుగుడు ఆడుకోవాలని కాంగ్రెస్ అనుకోవడం బాగానే ఉంది. కానీ, ఒకవేళ, బీఆర్ఎస్ అణగారిపోయిందా, తరువాతి కబళం తానేనని, బీజేపీ తలచుకుంటే కాలం చెల్లిన కేసులు కూడా నిద్ర లేస్తాయని రేవంత్‌రెడ్డి గుర్తించి, జాగ్రత్తపడాలి.

> నిజామాబాద్ పల్లెలో జన్మించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మేధో పొదుల్లో పెరిగి, ఉత్తర భారతావనిలోని ప్రతిష్ఠాత్మక బెనారస్ వర్శిటీలో ఉత్తరాంధ్ర అరుణోదయం– చరిత్రాత్మక శ్రీకాకుళ గిరిజనుల తిరుగుబాటు– ప్రభావాలు తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన తీరుతెన్నులను తరచి చూచిన తెలంగాణీయుడు డాక్టర్ కె. ముత్యం (1958–2024). ఉత్తరాంధ్ర ప్రజా పోరాటాలు, సాహిత్య సంస్కృతులపై ఆయన మొత్తం 11 పుస్తకాలు వెలువరించారు. ఆయన పరిశోధక కృషికి మరో ప్రగాఢ ప్రేరణ ఉత్తర తెలంగాణ.

పరిశోధక ఔత్తరాహికుడు

ప్రజా ఉద్యమాలు సృష్టించుకున్న, ప్రజలు మెచ్చిన సాహిత్య చరిత్రకారుడు డాక్టర్ కె.ముత్యం. నిజామాబాదు జిల్లాలోని బాచినపల్లిలో పుట్టి మధ్యలో ఉస్మానియా యూనివర్సిటీలో మెరిసి, ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ఉత్తరాంధ్రలోని బారువా వరకు ప్రయాణించి నిరంతర సాహిత్య పరిశోధనతో భావితరాలకు ఎంతో మేధో సంపదను సమకూర్చిపెట్టిన అక్షర కృషీవలుడు ముత్యం. తనదైన సిద్ధాంత నిబద్ధత ఆయన్ను ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ తెలుగు పూర్తి చేసుకొని, పిహెచ్‌డి కోసం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వైపు నడిపించింది. అక్కడ ఆయన 'శ్రీకాకుళం ఉద్యమం–తెలుగు సాహిత్యంపై దాని ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేసి 1990లో 'బెస్ట్ థీసిస్' అవార్డుతో పిహెచ్‌డి పట్టాను పొందారు. శాతవాహన యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకులుగా చేరిన ముత్యం జీవిత పర్యంతం ఒక అవిరామ పరిశోధనా తపస్వి. ముత్యం పరిశోధనలు, రచనలు రెండు భాగాలుగా మనం చూడవచ్చును. 1) ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధనా–రచనలు; 2) తెలంగాణ ప్రాంత రచనలు, సేకరణలు, సంపాదకత్వ కృషి. ఈ కృషిలో తెలుగునాట ఆయన వెళ్లని గ్రంథాలయం లేదు అనడంలో అతిశయోక్తి లేదు. 'శ్రీకాకుళ ఉద్యమానికి మూలమైన ఉద్యమాలు, ప్రభావశీలుర జీవిత కథలు, గాథలు తవ్వి తీసే పరిశోధనలో సుదీర్ఘకాలం నిమగ్నమైనారు. ముఖ్యంగా ఆ ఉద్యమానికి పునాది వేసిన రైతు ఉద్యమకారులు మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి, జెండాలు గవరయ్య జీవితాల్లోకి వెళ్ళి 'ఈ ముగ్గురు ఒక్కరే' పేరుతో పుస్తకం రాశారు. అంతే కాదు, స్వాతంత్ర్య ఉద్యమంలో 'మాకొద్దీ తెల్ల దొరతనం' అంటూ గర్జించిన స్వాతంత్ర్య ఉద్యమ కవి గరిమెళ్ళ సత్యనారాయణ అముద్రిత రచనలు సైతం ఎంతో కష్టపడి సాధించి పుస్తకం రూపంలో వెలుగులోకితెచ్చారు. శ్రీకాకుళం ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన ఉత్తరాంధ్ర ప్రజా నాయకుల మరుగున పడ్డ చరిత్రలు వెలికితీయడానికి ఆయన పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు. ఆ క్రమంలోనే జాతీయోద్యమనేత, శ్రీకాకుళం దళిత కవి 'సిల్లా రాజులురెడ్డి' జీవితం, కవిత్వం పుస్తకం తెచ్చారు. శ్రీకాకుళ ఉద్యమం సృష్టించిన సాహితీవేత్త, పాటకు ప్రాణం పోసిన త్యాగజీవి సుబ్బారావు పాణిగ్రాహి కుటుంబసభ్యులను వెతికి పట్టుకొని, ఇంటర్వ్యూలు చేసి ఆ విప్లవ కవి జీవిత కథ, సాహిత్య చరిత్రను అందించిన ఘనత ముత్యందే! అదే కోవలో శ్రీకాకుళం ఉద్యమానికి ముందు ప్రజా ఉద్యమ కెరటంగా వెలుగొందిన కళింగాంధ్ర తేజం 'పుల్లెల శ్యామసుందర్‌రావు జీవిత చరిత్రనూ రాశారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి జీవిత గాథనూ రాశారు. 28 ఏళ్ళకే గొప్ప ప్రజానాయకుడుగా, రైతు ఉద్యమ నేతగా ఎదిగిన ఆదర్శ కమ్యూనిస్టు గంటి రాజేశ్వరరావు జీవితాన్ని శోధించి 'ప్రవహిస్తున్న జ్ఞాపకం' అనే ఒక గొప్ప గ్రంథాన్ని మనకు అందించారు. ఆయన తవ్వి తీసిన జీవిత గాథలు అన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన వారివే కావడం విశేషం! మందస రైతాంగ పోరాటచరిత్రను 'సునాముది జీవధారగా మనకందించారు. ఉత్తరాంధ్ర ప్రజా ఉద్యమాలపై ముత్యం మేధో కృషి 11 విలువైన గ్రంథాలుగా ఫలించి, సార్థకమయింది.



ముత్యం పరిశోధనా కృషిలో మరో కోణానికి ఆలంబన తెలంగాణ. శాతవాహన యూనివర్సిటీ ప్రచురించిన ఉత్తర తెలంగాణ చరిత్ర–సంస్కృతి, 'ఉత్తర తెలంగాణ పల్లె, సంస్కృతి', 'తెలంగాణ అలభ్య శాసనాలు, గ్రంథాలు' అనే పుస్తకాలు ముత్యం సంపాదకత్వంలో వెలువడ్డాయి. తెలంగాణ కళాకారిణి చిందుల ఎల్లమ్మను ఇంటర్వ్యూ చేసి ఆమె జీవిత వివరాలను 'నేను చిందు ఎల్లమ్మను', 'చిందుల ఎల్లమ్మ యాది'గా గ్రంథస్థం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో ఆయన రాసిన 'చిందుల ఎల్లమ్మ'ను తెలుగు అకాడమీ ప్రచురించింది. ఈ గ్రంథానికి 2007లో తెలుగు యూనివర్సిటీ పురస్కారం లభించింది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కష్టాల కొలిమిలో, త్యాగాలు చాళ్ళు పోసిన చిత్రకారుడు ఫణిహారం రంగాచారి జీవిత చరిత్రను 'మట్టి రంగును ఎంచుకొన్న కుంచె' పేరుతో వెలువరించారు. ఇక సొంత జిల్లా నిజామాబాదుపై స్వతస్సిద్ధ మమకారంతో ముత్యం జిల్లా అంతా తిరిగి పల్లె ప్రజల్లో నానుడిగా ఉన్న సామెతలను సేకరించి 'తెలంగాణ శాస్త్రాలు' అనే పేరుతో ఓ పుస్తకం ప్రచురించారు. స్వగ్రామానికి చెందిన రచయిత 'అగ్ని పూలు' పత్రికా సంపాదకులు స్వయం ప్రకాష్‌తో కలిసి 'బాచినపల్లి' పేరుతో తన కన్న ఊరు ఇతిహాసాన్ని వెలుగులోకి తెచ్చారు. చరిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి, దానికి ఆయువుపట్టు అయిన ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించిన సర్వదేవభట్ల రామనాథం (ఈయన వందల ఎకరాల భూస్వామి. అయినప్పటికీ దున్నేవానికే భూమి అన్న కమ్యూనిస్టు పార్టీ పిలుపునకు స్పందించి తన భూమి ఆసాంతం సబ్బండ వర్గాలకు పంచిపెట్టిన త్యాగశీలి) చరిత్రను కమ్యూనిస్టు పార్టీలు సైతం విస్మరించినా ఎంతో శ్రమకోర్చి మిత్రుడు శివలింగంతో కలిసి 'కష్టాల కొలిమి, త్యాగాల పునాది, సర్వదేవభట్ల రామనాథం చరిత్ర'గా ఈ తరం వారికి ప్రజలకు అందించగలిగారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని పిండిప్రోలు గ్రామం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఒక ప్రధాన స్థావరంగా ఉండేది. ఎందరో యోధులు ఆ గ్రామం కేంద్రంగా రజాకార్ల, యూనియన్ సైన్యంపై పోరాడి అసువులు బాసారు. ఆ గ్రామ చరిత్రను సైతం శోధించి రాయడం ముత్యం మాత్రమే చేయగలిగిన పని. అలాగే గిరిజన యోధుడు సోయం గంగులు జీవితాన్ని నవలీకరించారు. ముత్యం రచనా శైలి విశిష్టమైనది, విలక్షణమైనది. సరళతరంగా ఉండి సామాన్యుడికి సైతం చదవాలనే ఆసక్తి కలిగించేలా ఉంటుంది. వందేళ్ళ క్రితం జీవించిన ఓ వ్యక్తి జీవితం చిత్రించాలన్నా, లేక నాటి పోరాట గాథలు రాయాలన్నా చాలా పరిశోధన చేయవలసి ఉంటుంది. ముత్యం తన జీవిత కాలాన్ని ప్రజా ఉద్యమాల పరిశోధనకు, రచనా వ్యాసంగం కోసమే వినియోగించాడు.

ముత్యం తన నాలుగు దశాబ్దాల పరిశోధనా కృషిలో వందలాది వ్యక్తులతో నిర్వహించిన ఇంటర్వ్యూలు ఉన్నాయి. చరితార్థుల కుటుంబాలతో ఆయనకు ఏర్పడిన అనుబంధం చాలా గొప్పది. ఆయన పడ్డ శ్రమలో శ్రమైక జీవన సౌందర్యం నిండి ఉంది. మట్టిపరిమళం గుబాళిస్తుంది. ఒళ్ళు గగుర్పొడిచే చారిత్రక సన్నివేశాలకు ఆయన కల్పించిన అక్షర చిత్రాలు అద్భుతమైనవి. ఆ రచనా విధానం అనితరసాధ్యమైనది. ముత్యం సేకరించిన చారిత్రిక ఆనవాళ్లను, నిక్షిప్తం చేసిన జ్ఞాపకాలు ఛిద్రమైపోకుండా భద్రం చేసి భవిష్యత్తు తరాలకు అందించవలసిన బృహత్తర బాధ్యత విశ్వ విద్యాలయాలపై ఉన్నది. ఆ అసమాన పరిశోధనా కృషి వల్లే, డాక్టర్ కె. ముత్యం ఆగస్టు 20న మనకు శాశ్వతంగా దూరమయినా ఆయన పరిశోధనలు, పుస్తకాలు తెలుగు సమాజాలకు కలకాలం చైతన్య దివిటీలుగా వెలుగొందుతాయి.

• యన్. తిర్మల్

జానపద కళారూపాలను కాపాడుకుందాం

మానవ జాతికి ఎంతటి ప్రాచీనత ఉందో జానపద కళలకు అంతే ప్రాచీనత ఉంది. శతాబ్దాలకు పూర్వం నుంచి నేటికీ భారతదేశం వ్యవసాయక దేశంగా కొనసాగుతుండటంలో జానపద కళలు సజీవంగా మనగలుతున్నాయి. శ్రమ నుంచి పుట్టిన శ్రామిక ప్రజాకళ జానపదకళ. సినిమా, టీవీ లాంటి ఆధునిక మాధ్యమాలు అందుబాటులో లేని రోజులలో జానపదకళలు ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించాయి. నిరక్షరాస్యులైన ప్రజలకు భారతం, భాగవతం, రామాయణం వంటి పురాణ కథలు జీవితంలో భాగాలుగా మారిపోయాయి. నేడు మన కళ్ళముందు కనిపిస్తున్న అనేక కళారూపాలు ఇంతటి శాస్త్రీయతను సంతరించుకోవడానికి కూడా జానపద కళలే మూలాధారాలు.

సినిమాలు, వామపక్ష ఉద్యమాలు జానపద బాణీలనే తమ పాటలకు ఆధారం చేసుకున్నాయి. అమెరికా, ఇంగ్లాండ్, ఆఫ్రికా వంటి దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా ఈ జానపద కళలు వాడుకలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో తోలుబొమ్మలాట, గంగిరెద్దులు, జముకులకథ, ఒగ్గుకథ, కోలాటం, చెక్కభజనలు, తప్పెటగుళ్ళు, చిందు భాగవతం, యక్షగానాలు, బుర్రకథలు, హరికథలు, గరగలు, హరిదాసులు, దాసర్లు, జంగాలు, ఎరుకలు, బుట్టబొమ్మలు, డప్పు నృత్యాలు, చెంచులు, థింసా, కొమ్ము నృత్యాలు వంటి వందలాది కళారూపాలున్నాయి. వీటితోపాటు లాలిపాటలు, జోల పాటలు, పెళ్ళిపాటలు, బతుకమ్మ పాటలు, గౌరమ్మ పాటలు వంటి ఎన్నో జానపద సాహిత్య కళారూపాలు తెలుగు సంస్కృతిలో విడదీయరాని భాగాలుగా పెనవేసుకున్నాయి. ఇంతటి చారిత్రక ప్రాముఖ్యం కలిగిన కళలు సరైన ఆలనా, పాలనా కరువై నానాటికీ వికృతరూపం దాలుస్తున్న టీవీ, సినిమా మాధ్యమాల ధాటికి తట్టుకోలేక విలవిలలాడుతున్నాయి. ఇంకా అభ్యంతరకమైన విషయం. టీవీ, సినిమాల్లో జానపద కళారూపాలకు అశ్లీలతను జోడించి, జుగుప్సాకరంగా ప్రదర్శిస్తూ అవే జానపద రూపాలని ఈ తరం పిల్లలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇందులో కొన్ని కళలు కనుమరుగై పోగా మరికొన్ని కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ కళలనే నమ్ముకున్న కళాకారులు కొందరు నిరాశ్రయులు కాగా, మరికొందరు వేరే దారులు వెతుక్కుంటున్నారు.

అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాలు జానపద కళారూపాలను తమ సంస్కృతికి చెందిన సంపదగా భావించి గ్రంథస్తం చేశాయి. సి.పి. బ్రౌన్ లాంటి ఆంగ్లేయులు తెలుగు భాష, సంస్కృతుల్లో దాగిన గొప్పదనాన్ని వేనోళ్ళ పొగిడితే, నేటి తరం తెలుగు యువత పాశ్చాత్య పోకడలతో, ఆంగ్ల మాధ్యమంపై మోజుతో తెలుగును చిన్నచూపు చూడటం విచారకరం. తెలుగు భాషను, సాంస్కృతిక కళారూపాల కాపాడుకుంటూ ముందు తరాలకు వాటిని అందించాల్సిన బాధ్యత ప్రజలపై, ప్రభుత్వంపై ఉంది. సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కొన్ని కళలను దత్తత తీసుకొని కళల పరిరక్షణకు పాటుపడాలి. తిరుమల తిరుపతి దేవస్థానం కూడా ఈ కళలను కాపాడాలి. పాఠశాల స్థాయిలో జానపద కళారూపాల ప్రదర్శనను తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ తగిన ప్రణాళికతో ముందుకు రావాలి. జానపద కళాకారుల్ని గుర్తించి రాష్ట్రవ్యాప్త ప్రదర్శనలకు వారిని వినియోగించుకోవాలి. విద్యాబోధనలో తెలుగుకు ప్రాధాన్యత కల్పించాలి.

– బద్రి కూర్మారావు
వ్యవస్థాపక అధ్యక్షులు, గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం

(నేడు ప్రపంచ జానపద కళాదినోత్సవం)

రైతుల పట్ల జగన్ కపట ప్రేమ

> రైతుల జీవితాలను నాశనం చేసి, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన జగన్‌రెడ్డి ఉన్న పళంగా రైతుల పట్ల దయామయుడిగా మొసలికన్నీరు కార్చగానే జగన్‌రెడ్డి వెంట రైతులు పరుగులు తీస్తారు అనుకోవడం అత్యాశే! 2019లో కూడా ఇంతే. రైతు సమస్యలపై కడవలకొద్దీ కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చి జగన్‌రెడ్డి పాలనలో ఏం జరిగిందో రైతులు అనుభవించారు.



అధికారం పోయిన రెండు నెలలకే జగన్‌రెడ్డి అలమటించిపోతున్నారు. రైతుల పట్ల దయామయుడిగా ప్రేమ ఒలకపోస్తున్నారు. ఆయన దిగిపోగానే రైతులకు కష్టాలు వచ్చినట్లు అభినయాలు ప్రదర్శిస్తూ, కర్షక విన్యాసాలు చేస్తున్నారు. రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనీ, 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించలేదనీ, దీనివల్ల రైతులకు ఉచిత పంటల బీమా చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందనీ 'ఎక్స్' ద్వారా జగన్ ట్వీట్ చేశారు. తమ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను ప్రతి ఏటా ఏప్రిల్–మే నెలల్లో చెల్లించి నష్టపోయిన రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. ఖరీఫ్ పంట వేసే సమయానికి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థవంతంగా అమలు చేశామంటూ అలవాటైయిన అబద్ధాలు వల్లే వేశారు జగన్‌రెడ్డి.

రైతుల జీవితాలను నాశనం చేసి, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన జగన్‌రెడ్డి ఉన్న పళంగా రైతుల పట్ల దయామయుడిగా మొసలికన్నీరు కార్చగానే జగన్‌రెడ్డి వెంట రైతులు పరుగులు తీస్తారు అనుకోవడం అత్యాశే! 2019లో కూడా ఇంతే. రైతు సమస్యలపై కడవలకొద్దీ కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చి జగన్‌రెడ్డి పాలనలో ఏం జరిగిందో రైతులు అనుభవించారు. రైతుల ఉసురు తగిలే మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదన్నది వాస్తవం. ఐదేళ్ల జగన్‌రెడ్డి పరిపాలన వ్యవసాయ రంగం వెన్ను విరిచింది.

జగన్ తన పాలనలో రైతులకు పంటల బీమా, రాయితీపై విత్తనాలు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, బిందు సేద్య పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు అందించలేదు. కేవలం ఒక్క ఖరీఫ్‌లో మాత్రమే పంటల బీమా ఇచ్చి, రబీ సీజన్‌కు ఒక్క రూపాయి చెల్లించకుండా రైతులను వంచించారు. జగన్ హయాంలో పెట్టిన బీమా బకాయిలు, బిందు సేద్య బకాయిలను ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లించింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ.2,384 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు. వ్యవసాయానికి తోడ్పాటు అందించే బిందు సేద్యాన్ని అమలు చేయకుండా, కంపెనీలకు రూ.1,167 కోట్లు, ధాన్యం రైతులకు రూ.1,600 కోట్లు బకాయిపెట్టారు. కౌలు రైతులను, మత్స్యకారులను నిర్లక్ష్యం చేసి, పనికిమాలిన చట్టాలు తెచ్చారు. గత ప్రభుత్వం లక్ష లోపు సున్నా వడ్డీ రుణాలు, రూ.3లక్షల వరకు పావలా వడ్డీ రుణాలిస్తే.. పావలా వడ్డీకి మంగళం పాడి, రూ.లక్ష రుణానికి వడ్డీతో సహా వసూలు చేశారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ అందిస్తే, జగన్ అధికారంలోకి వచ్చాక అటకెక్కించారు. ఉచితంగా అందించే సూక్ష్మ పోషకాలు మైక్రో న్యూట్రియంట్స్ ఎరువులు పంపిణీ నిలిపివేసారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతు ఋణమాఫీ కింద 58.29 లక్షల మంది రైతులకు రూ.15,279 కోట్లు రుణమాఫీ చేసి, చెల్లించాల్సిన, 4–5 విడతల రైతు ఋణమాఫీ పథకాన్ని రద్దు చేసి రైతుల ప్రయోజనాలను దెబ్బతీసారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3000కోట్లు, ప్రకృతి విపత్తుల సహాయ నిధి కింద రూ.4000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇవ్వకుండా మోసం చేశారు. ప్రభుత్వం వ్యక్తిగత పనిముట్లు, కేంద్ర ప్రయోజిత పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో సన్న చిన్నకారు రైతులకు రాయితీలు అందలేదు. జగన్ జమానాలో రైతులకు చేసిన సాయం కంటే చేసిన మోసాలే ఎక్కువని చెప్పాలి.

మాది రైతు ప్రభుత్వం అని స్వోత్కర్ష వినిపించారు తప్ప నిజంగా రైతులకు చేసింది ఏమీ లేదు? పండించిన పంటలకు గిట్టుబాటు ధర కాదు, మద్దతు ధర కూడా దక్కడం లేదు. సాగుకు పెట్టుబడి విపరీతంగా పెరిగింది. ఎరువుల ధరలు, పురుగు మందుల ధరలు, పెట్రోలు, డీజిలు, ట్రాక్టర్ కిరాయిలు, కూలీల ధరలు... సమస్త ధరలు పెరిగాయి. ఎన్నో అష్ట కష్టాలు పడి ఆరుగాలం శ్రమించి సాగుచేసినా వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదని రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి సాగుకు దూరం అయ్యారు. చీడ, పీడలు, తెగుళ్ల బారిన పడినా, తుఫానులు వణికించినా, అకాల వర్షాలు, వరదలకు పంటలు నీటమునిగినా రైతుల కడగండ్లను ఏ మాత్రం పట్టించుకోకుండా తూతూమంత్ర చర్యలతో సరిపుచ్చి కర్షకుల బతుకులకు చితి పేర్చిన పాలన జగన్‌రెడ్డిదే. అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాత అప్పులు ఊబిలో కూరుకుపోయ్యాడు. పకృతి పగ, ప్రభుత్వ దగా రెండూ కలిసి రైతు లోకాన్ని నిర్వీర్యం చేశాయి. జగన్‌రెడ్డి అయిదేళ్ల పాలనలో ఇన్పుట్ సబ్సిడీ కింద రైతులకు ఇచ్చింది కేవలం రూ.1911 కోట్లు మాత్రమే. రైతులు దాదాపు రూ.20వేల కోట్ల పంట ఉత్పత్తులు నష్టపోయారు.

గత తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,759,51కోట్లు చెల్లించింది. ఒక్క 2016–17లోనే రూ.1820 కోట్లు చెల్లించింది. జగన్ ప్రభుత్వంలో ఈ–క్రాప్ నమోదుతో పాటు అనేక కొర్రీలతో రైతులకు పరిహారంలో కోతపెట్టారు. 33 శాతం పంట నష్టపోతేనే పంట పరిహారం చెల్లించారు. అసంబద్ధ విధానాలతో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారు. జగన్ పాలనలో రైతు లోగిళ్ళలో చీకట్లు అలుముకొన్నాయి. రైతుల గురించి జగన్‌రెడ్డి చెప్పింది కొండంత, చేసింది గోరంత. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు అత్యాధునిక వ్యవసాయం ఆవిష్కరణకు చంద్రబాబు ప్రభుత్వం కృషి చేసింది. వ్యవసాయానికి, రైతులకు వెన్నుదన్నుగా నిలవడం కోసం చంద్రబాబు ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డింది. రైతులు పట్ల కపట ప్రేమ చూపిస్తున్న జగన్‌రెడ్డి పట్ల రైతు సోదరులు అప్రమత్తంగా ఉండాలి.

■ నీరుకొండ ప్రసాద్


● వారం కిందట విజయవాడ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఓ మహిళకు పాప జన్మించింది. రెండు రోజుల్లో వైద్యులు ఇంటికి పంపుతారనుకున్న సమయంలో పాపకు జ్వరం వచ్చింది. పరీక్షలు చేయగా, ఆ చిన్నారికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చింది.

● జి.కొండూరుకు చెందిన కోట మంగమ్మ కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతోంది. తొలుత గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లింది. ఎంతకీ తగ్గకపోవడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. రూ.3,500 పెట్టి ప్లేట్‌లెట్లు కొని తీసుకొస్తే ఎక్కిస్తామని వైద్యులు తెలిపారు.

● విజయవాడకు చెందిన ఓ డ్రైవర్ తన బావమరిది వివాహ కార్యక్రమానికి ఒంగోలు వెళ్లాడు. అక్కడ రెండు రోజులు ఉన్నాడు. అతడి బంధువుల ద్వారా ఇతనికీ జ్వరం సోకింది. ఆ మర్నాడే అతడి ఇద్దరు పిల్లలకు కూడా జ్వరం వచ్చింది.

రెండు నెలలుగా రెండు జిల్లాలను కొత్త వైరస్ పట్టిపీడిస్తోంది. ఇంట్లో ఒకరికి జ్వరమొస్తే మిగిలిన వారంతా మంచాన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా జ్వరాలు రెండు, మూడు రోజులకు తగ్గిపోతాయి. కానీ, ప్రస్తుతం వస్తున్న జ్వరాలు వారం నుంచి రెండు వారాలు ఉండటంతో రోగులు అల్లాడిపోతున్నారు. ఏ వైరస్ వల్ల ఈ జ్వరాలు సోకుతున్నాయో తెలియక వైద్యులు తలలుపట్టుకుంటున్నారు.


జీజీహెచ్‌లో ఓపీ వద్ద బారులు తీరిన రోగులు


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

జ్వర జాగ్రత్త

రెండు జిల్లాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు

కొత్తగా నమోదవుతున్న స్రైబ్‌టైపస్ జ్వరాలు

వారం నుంచి రెండు వారాల పాటు ప్రభావం

- ఇంట్లో ఒకరి తర్వాత మరొకరికి వ్యాప్తి
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిట
- డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ కూడా..
- రికార్డుస్థాయిలో జీజీహెచ్‌కు జ్వరపీడితులు
- తలలు పట్టుకుంటున్న వైద్యులు
- పనిలోపనిగా ప్రైవేట్ ల్యాబ్‌లు, వైద్యుల దోపిడీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/మచిలీపట్నం/ప్రభుత్వాసుపత్రి) : శరీరంలో వ్యాధి నిరోధకశక్తి తగ్గడం వల్లే జ్వరాలు వస్తాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలు సీజనల్‌గా వస్తుంటాయి. ఇవికాకుండా ప్రస్తుతం స్రైబ్‌టైపస్ జ్వరాలు వస్తున్నాయని వైద్యులు గుర్తించారు. ఈ కారణంగానే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. అన్ని ఆసుపత్రిల్లోను పడకలు ఫుల్ అయిపోతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు రోజుకు 35-40 వరకు కేసులు వస్తుండగా, ఐసీయూల్లో 70-80 మంది పిల్లలు ఉంటున్నారు. ఎడినో, రెస్పిరేటర్ సిన్స్‌లియల్ వైరస్, పారా ఇంఫ్లూయింజా వైరస్ వల్ల ఈ స్రైబ్‌టైపస్ జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా జ్వరం అంటువ్యాధి కాదు. అయినప్పటికీ ఒక కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే మిగిలిన కుటుంబ సభ్యులు రోజుల వ్యవధిలోనే జ్వరపీడితులవుతున్నారు. సాధారణంగా వచ్చే జ్వరాలు రెండు, మూడు రోజులకు తగ్గిపోతాయి. కొత్తకొత్త వైరస్‌ల వల్ల వస్తున్న జ్వరాలు కావడంతో రెండు వారాల పాటు ఉంటున్నాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని కేసుల్లో వైరస్ నిర్ధారణ కావడం లేదంటున్నారు. ఆరేళ్లలోపు చిన్నారుల్లో న్యూమోనియా, బ్రాంకియాలైటిస్, చెస్ట్ ఇన్ఫెక్షన్ ఎక్కువగా వస్తున్నట్టు వైద్యులు గుర్తిస్తున్నారు.

'కృష్ణా'లో కలవరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈనెల 18వ తేదీ వరకు కృష్ణాజిల్లాలో 5,826 మంది జ్వరంబారిన పడినట్లు వైద్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లో 1,012 మంది, మేలో 1,123 మంది, జూన్‌లో 1,194 మంది, జూలైలో 1,293 మంది, ఆగస్టులో ఇప్పటివరకు 1,204 మంది జ్వరం బారినపడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవికాకుండా టైఫాయిడ్ లక్షణాలున్న 636 మందికి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించగా, 109 మందికి నిర్ధారణైంది. మేలో 560 మందికి పరీక్షలు నిర్వహించగా, 58 మందికి నిర్ధారణైంది. జూన్‌లో 624 మందికి పరీక్షలు చేయగా 82 మందికి, జూలైలో 1,024 మందికి పరీక్షలు నిర్వహించగా 151 మందికి, ఈనెలలో ఇప్పటివరకు 952 మందికి పరీక్షలు నిర్వహించగా 202 మంది టైఫాయిడ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఇవి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో నమోదైన లెక్కలు మాత్రమే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కేసులు వేలల్లోనే ఉంటున్నాయి. అలాగే, కొందరికి మలేరియా టెస్టులు చేయగా, కేవలం ముగ్గురికి మాత్రమే నిర్ధారణైంది. కోడూరు, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు తదితర ప్రాంతాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. గత జనవరి నుంచి ఇప్పటివరకు కృష్ణాజిల్లాలో 47 డెంగీ కేసులు నమోదయ్యాయి. రెండు నెలల వ్యవధిలో అధికశాతం మంది డెంగ్యూ బారినపడి మచిలీపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్లేట్‌లెట్లు ఎక్కించేందుకు, చికిత్స కోసం వేలాది రూపాయలు ఖర్చు

- మిగతా 6లో

'ఎన్టీఆర్'లో డెంగ్యూ డేంజర్ బెల్స్

విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి డెంగ్యూ ఫీవర్‌తో జీజీహెచ్‌కు భారీగా వస్తున్నారు. జూలైలో 61 వేల మందికి పైగా అవుట్ పేషెంట్లు ఫీవర్ చికిత్స నిమిత్తం రాగా, ఈ నెలలో ఇప్పటి వరకు సుమారు 41 వేల మందికి పైగా వచ్చారు. ఆసుపత్రి ప్రారంభమైనప్పటి నుంచి ఇంతమంది అవుట్ పేషెంట్లు డెంగ్యూ లక్షణాలతో రావటం రికార్డుగా చెప్పవచ్చు. పొరుగు జిల్లాల్లోని ప్రాథమిక కేంద్రాల వైద్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రోగులను రిఫర్ చేస్తున్నారు. కానీ, జీజీహెచ్‌లో సత్వరం చికిత్స అందని పరిస్థితి ఏర్పడింది. ఫీవర్ విభాగంలో కొద్దిమంది వైద్యులు మాత్రమే షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో జూనియర్ డాక్టర్లు అత్యవసర సర్వీసులు మినహా మిగతా సేవలన్నింటినీ నిలిపివేశారు. ఇంజక్షన్లు, మందులు ఇవ్వటం, పరీక్షలు చేయించటం వంటి పనులకు బ్రేక్ పడుతోంది. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ వచ్చిన కొందరి శరీరంలో ప్లేట్‌లెట్లు పడిపోతున్న పరిస్థితి ఉంది. దీనిపై అవగాహన లేకపోవటంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. పల్లెల నుంచి వచ్చిన రోగుల దగ్గర నుంచి లేబొరేటరీలు, ప్రైవేట్ వైద్యులు అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బదిలీలకు బీ రెడీ



- ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో దరఖాస్తులు
- కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు భారీగా పైరవీలు
- ఆచితూచి వ్యవహరిస్తున్న కూటమి నాయకులు
- వెబ్ కౌన్సెలింగ్ ద్వారా చేయాలని ఉద్యోగుల డిమాండ్

జిల్లాలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తమకు తెలిసిన, పరిచయం ఉన్న టీడీపీ కూటమి నాయకుల ద్వారా సిఫారసు లేఖలు తెచ్చుకుని మరీ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ఆచితూచి వ్యవహరిస్తుండగా, ఎలాగైనా కోరుకున్న చోటకు బదిలీ కల్పిస్తామంటూ పైరవీలు భారీగానే జరుగుతున్నాయి.

జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ షురూ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వివాదాస్పదంగా వ్యవహరించే ఉద్యోగులను కొత్త ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల నుంచి సాగనంపుతారనే చర్చలు జోరందుకున్నాయి. దీంతో కొందరు ఉద్యోగులు ముందుచూపుతో వేరే ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. రెండు, మూడు రోజులుగా ఆయా విభాగాల జిల్లా అధికారుల కార్యాలయాల్లో ఉద్యోగులు బదిలీల దరఖాస్తులను అందజేస్తున్నారు. తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయాలని తెచ్చుకున్న సిఫారసు లేఖలను కూడా ఇస్తున్నారు. దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ఉద్యోగుల సీనియారిటీని బట్టి జాబితాలను తయారుచేసే పనిలో ఉన్నారు. ఉద్యోగులు ప్రస్తుతం ఎక్కడ, ఎంతకాలంగా పనిచేస్తున్నారు, ఎవరి నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు.. వంటి అంశాలతో జాబితాలను తయారుచేసి, తుది నిర్ణయం కోసం కలెక్టర్‌కు పంపిస్తామని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. ఈనెల 25, 26 తేదీల నాటికి బదిలీలకు సంబంధించిన జాబితాలను పూర్తిచేస్తామని పేర్కొంటున్నారు.


పైరవీల పర్వం

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పైరవీరాయుళ్లు తమదైనశైలిలో తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. గతంలో వివిధ కారణాలతో బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులను గుర్తించి, మీరు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయిస్తామంటూ తెరవెనుక కథ నడిపిస్తున్నారు. మచిలీపట్నం మండల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేసే ఒక కాంట్రాక్టు ఉద్యోగి గత కొన్నిరోజులుగా రోజూ సాయంత్రమయ్యేసరికి మచిలీపట్నం టీడీపీ కార్యాలయం పరిసరాల్లో తిరుగుతూ కూటమి నాయకులతో తనకు పరిచయాలున్నాయని, వారితో మాట్లాడి మీరు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయిస్తానంటూ ఉద్యోగుల నుంచి పెద్దమొత్తంలో నగదు వసూలు చేస్తున్నాడని కూటమి నాయకులే చెబుతున్నారు. తాను పార్టీ నాయకుల వద్దే ఉన్నానని, మీ పని అయిపోతుందంటూ ఈ కాంట్రాక్టు ఉద్యోగి హడావిడి చేస్తుండటం గమనార్హం. పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఒక రెవెన్యూ అధికారి గతంలో వైసీపీ నాయకులతో అంటకాగి, అడ్డగోలు పనులన్నింటిలోనూ తలదూర్చి వివాదాలకు కేంద్రబిందువుగా మారాడు. ప్రస్తుతం ఈ ఉద్యోగి కూటమి నాయకులతో మాట్లాడుకుని తాను పామర్రు నుంచి బదిలీ కానని, ఇక్కడే కొనసాగేలా సిఫారసు లేఖను తెచ్చుకున్నానని బాహాటంగానే చెబుతుండటం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయంలో అన్నీతానై పై అధికారులు సైతం తాను చెప్పినట్టే చేయాలనే ధోరణితో వ్యవహరించే ఈ ఉద్యోగిని ఇక్కడ ఎలా కొనసాగిస్తారని కొందరు కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూ విభాగంలో తీవ్రపోటీ

రెండు జిల్లాల్లో రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లేవారు అక్కడి శాసనసభ్యులతో సిఫారసు లేఖలు తెచ్చుకుని, పోటీ పడుతున్నారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలు తదితర కారణాలు చూపిస్తున్నారు. సిఫారసు లేఖలు తెచ్చుకోలేనివారు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంకొందరు రెవెన్యూ అసోసియేషన్ నాయకుల చుట్టూ తిరుగుతూ తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయించాలని వేడుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పోస్టింగ్ రాకుంటే విజయవాడ పరిసర మండలాల్లకైనా బదిలీ చేయించుకునేందుకు రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులు తెగ ప్రయత్నిస్తున్నారు.

చెంగున ఎగిరి.. చేపను పోలి..


అంతెత్తు నుంచి ఎగురుతూ.. ఒక్కసారిగా పల్టీ కొడుతూ.. గిరగిరా తిరుగుతూ.. వేగంగా దూకుతూ.. గుణదలలోని పడవలరేవు సెంటర్‌లో ఉన్న ఏలూరు కాల్వలో చిన్నారులు చేసిన విన్యాసాలు అటుగా వెళ్లినవారిని ఆకట్టుకున్నాయి. గజ ఈతగాళ్ల మాదిరిగా వారు చేసిన సాహసాలను చూసి కొందరు ముచ్చటపడగా, కాల్వలకు నీళ్లు వదిలిన ఈ సమయంలో ఇలాంటి పనులు ప్రమాదమని ఇంకొందరు హెచ్చరించారు.

రెవెన్యూ ప్రక్షాళన అవసరం

ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారెందరో..

- తాజా బదిలీల్లో పక్కకు తప్పించాలనే సూచన
- మూడేళ్లు దాటిన వారిని బదిలీ చేయడమే ఉత్తమం
- అంతర్ డివిజన్ల బదిలీల వల్ల ఉపయోగం శూన్యం
- ఒకేచోట పాతుకుపోవటం వల్ల విచ్చలవిడి అవినీతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూలో బదిలీలకు తెరలేచింది. తహసీల్దార్ల దిగువన పనిచేసే డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు దశాబ్దకాలంగా ఒకేచోట పాతుకుపోయారు. వీరందరినీ పక్కకు తప్పించి, రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేయటానికి ఇదే మంచి తరుణం. అలాగే, ఇప్పటి వరకు జరిగిన బదిలీలు పారదర్శకంగా లేవు. తప్పనిసరి బదిలీ అయినా పక్క గ్రామాలకో, మండలాలకో వెళ్తున్నారు. ఇలాంటి వారంతా దశాబ్దకాలంగా పాతుకుపోవటం వల్ల అవినీతి పెచ్చుమీరుతోంది. ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వానికి అంటకాగి పనిచేయటం తప్ప మరొకటి లేదు. కాబట్టి ఈ దఫా అయినా.. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలను ఇవ్వాల్సిన అవసరం ఉంది.

నిబంధనల్లో మార్పు అవసరం

ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికే బదిలీలు అనే నిబంధన కాకుండా, మూడేళ్లు పూర్తి చేసుకున్న వారినే బదిలీలకు ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వారిని కదిపే విషయంలో భిన్నమైన మార్గదర్శకాలను ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలుగా మూడేళ్లు దాటిన వారికి డివిజనేతర బదిలీలు నిర్వహిస్తేనే ప్రస్తుత రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరిగే అవకాశం ఉంటుంది. ఐదేళ్లు పూర్తయ్యాయి కాబట్టి, పక్కనే ఉన్న మండలంలోనో, పక్కనే ఉన్న గ్రామంలోనో పోస్టింగ్ ఇస్తే ఫలితం ఉండదు. పదేళ్లుగా జరుగుతున్నది ఈ తరహా బదిలీలే. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో బదిలీలు దారుణంగా జరిగాయి. ఈ పేరుతో పెద్ద వ్యాపారమే నడిచింది. అధికార పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఇది కాసుల పండుగగా మారింది. ఒకే డివిజన్ పరిధిలో అంతర బదిలీలు నిర్వహించటం వల్ల అవినీతి పెచ్చుమీరింది. బదిలీలు జరిగినా కూడా డిప్యుటేషన్ల పేరుతో మళ్లీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. ఇలాంటి చర్యలను కూడా నియంత్రించాల్సిన అవసరం ఉంది. కాబట్టి బదిలీల జాబితాలో ఉన్నవారికి డిప్యుటేషన్ అమలు చేయకుండా ఆదేశాలు జారీ చేయాలి.

దేవినేని అవినాశ్‌కు నోటీసులు

టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిలో పాల్గొన్నందుకే..



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ఘటనలో దేవినేని అవినాశ్‌కు పోలీసులు బుధవారం నోటీసులు ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం అవినాశ్ దుబాయి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆయనపై అప్పటికే లుక్ ఔట్ నోటీసు ఉండటంతో శంషాబాద్ విమానాశ్రయ ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని వెనక్కి పంపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిలో పాల్గొన్న వారందరిపైనా పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దాడిలో అవినాశ్‌కు అత్యంత సన్నిహితులైన విజయవాడ నగరపాలక సంస్థ 18వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అరవ వెంకట సత్యనారాయణ అలియాస్ అరవ సత్యంతో పాటు జోగరాజు (ఈయన గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తొలగించారు), బచ్చు మాధవి (దుర్గగుడి పాలకమండలి సభ్యురాలు), పలువురు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కేసులో అందరినీ విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

పంచదారను పంచుతారా..!

ఉమ్మడి జిల్లా గోడౌన్లలో 250 టన్నుల నిల్వలు

- గొల్లపూడి గోడౌన్‌లో మంత్రి నాదెండ్ల తనిఖీల్లో తూకంలో తేడాలు
- పంచదారను వెనక్కి పంపేయాలని ఆదేశాలు
- తూకంలో తేడాలుంటే.. బిల్లు తగ్గింపే సరైన మార్గం
- పంచదారను అలాగే వదిలేస్తే చెడిపోయే ప్రమాదం
- ఇప్పటికైనా పాత పంచదారను పంపిణీ చేయడమే ఉత్తమం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వచ్చే నెల నుంచి రేషన్‌లో పంచదార అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రొక్యూర్‌మెంట్ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో సివిల్ సప్లయిస్ గోడౌన్లలో నిల్వ ఉన్న పాత పంచదారను పంపిణీ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతనెలలో సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్.. గొల్లపూడి గోడౌన్‌లో పంచదార ప్యాకెట్లను పరిశీలించారు. తూకం తక్కువగా ఉందని గుర్తించారు. ఈ కారణంగా ఆ సరుకును వెనక్కి పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ నెలలో పంచదారను పంపిణీ చేయటం కుదరలేదు. వెనక్కి కూడా పంపలేదు. ఈ పంచదారను వెనక్కి తీసుకెళ్తే.. తమకు నష్టం వస్తుందన్న ఉద్దేశంతో సప్లయిదారులు కూడా గోడౌన్లలోనే ఉంచేశారు. వాస్తవానికి ఒక బస్తాలో 100 పంచదార ప్యాకెట్లు ఉండాలి. ఈ బస్తా ప్రామాణికంగా లెక్క తీసుకుంటే తూకం కచ్చితంగానే ఉంటోంది. ఒక ప్యాకెట్‌లో 510 గ్రాములు ఉంటే, మరో ప్యాకెట్‌లో 490 గ్రాములు ఉంటుంది. ఈ ప్యాకింగ్ విధానం అస్తవ్యస్తంగా ఉండటం వల్ల విడివిడిగా చూడటంతో తూకంలో తేడా వచ్చింది. మంత్రి వెళ్లాక బస్తా ప్రాతిపదికన కాటా వేస్తే కచ్చితమైన తూకం ఉన్నట్టుగా తెలిసింది. ఒకవేళ తూకం తక్కువగానే ఉన్నా.. ఆ మేరకు సప్లయిదారుడికి బిల్లు తగ్గిస్తే సరిపోయేది.

నష్టాన్ని నివారించవచ్చు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాత పంచదార 250 టన్నుల మేర ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీపీఎల్ కార్డుదారులకు అరకేజీ చొప్పున, అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డుదారులకు కేజీ చొప్పున పంచదార ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 53,099 ఏఏవై కార్డులు ఉన్నాయి. ఈ మొత్తం కార్డులకు కేజీ ప్రాతిపదికన చూస్తే 53,009 కేజీల ప్యాకెట్లను పంపిణీ చేయాల్సి ఉంది. అలాగే, ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 10,78,004 బీపీఎల్ కార్డులు ఉన్నాయి. వీరికి అరకేజీ చొప్పున 5,59,002 పంచదార ప్యాకెట్లను పంపిణీ చేయాల్సి ఉంది. గోడౌన్లలో 250 మెట్రిక్ టన్నుల మేర పంచదార ప్యాకెట్లు ఉన్న నేపథ్యంలో పాత సరుకును పంపిణీ చేస్తే నష్టనివారణ జరుగుతుంది.

ముమ్మరంగా..

చకచకా సాగుతున్న సురక్షిత జల ప్రాజెక్టు పనులు



కుదపలో కొండపై నిర్మిస్తున్న ఓవర్ హెడ్ రిజర్వాయర్

కిడ్నీ వ్యాధుల ప్రభావిత ఏ కొండూరు మండలంలోని గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తలపెట్టిన ప్రాజెక్టు పనులు మహాయజ్ఞంలా సాగుతున్నాయి. ఏ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన 2025 జూన్ 30 నాటికి కృష్ణా సురక్షిత మంచినీటిని అందించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యం పెట్టుకుంది. అంటే మరో 10 నెలల్లో ఏ కొండూరు మండల కిడ్నీ ప్రభావిత గ్రామాలకు సురక్షిత మంచినీటి సమస్య పరిష్కారం కాబోతోంది. జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పరిధిలో సురక్షిత జలాల ప్రాజెక్టును ఇంకా తక్కువ సమయంలో పూర్తి చేసేందుకు యాక్షన్ ప్లాన్‌కు రూపకల్పన చేసింది.

- కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలు
- రూ.49.94 కోట్ల వ్యయంతో మెగా ప్రాజెక్టుకు శ్రీకారం
- కుదపలో కొండపై ఓహెచ్ఆర్ నిర్మాణం
- మైలవరం పంపింగ్ స్కీమ్ నుంచి కుదపకు కృష్ణా జలాలు
- కుదప నుంచి 38 గ్రామాలకు సురక్షిత మంచినీటి సరఫరా
- శాశ్వత ప్రాతిపదికన 200 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనులు
- 14 నూతన ఓవర్ హెడ్ రిజర్వాయర్ల నిర్మాణానికి అడుగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రూ.49.94 కోట్లతో కృష్ణా జలాల ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం సీపీడబ్ల్యూసీ స్కీమ్ వరకు కృష్ణా జలాలు వస్తున్నాయి. ఇక్కడి నుంచి కుదపలో నిర్మించిన సంప్ దగ్గరకు తీసుకు వెళుతున్నారు. ఈ సంప్ నుంచి ప్రస్తుతం తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాలను ఏ కొండూరు మండలంలో 15 గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన కృష్ణా జలాల ప్రాజెక్టు పూర్తయ్యే వరకు వచ్చే ఏడాది జూన్ వరకు ట్యాంకర్ల ద్వారా అందించేందుకు ఇటీవలే కలెక్టర్ సృజన రూ.1.60 కోట్ల డీఎంఎఫ్‌టీ గ్రాంట్‌ను కూడా అందించారు.

200 కిలోమీటర్ల పైపులైన్ పనులు



రూ.49.94 కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రాజక్టు పనుల్లో భాగంగా కుదపలోని సంప్ దగ్గర కొండ మీద ఓవర్ హెడ్ రిజర్వాయర్ (ఓహెచ్ఆర్)ను నిర్మిస్తున్నారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధిచేసి ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడి నుంచి ఏ కొండూరు మండలానికి, ఆయా మండల పరిధిలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు పైపులైన్లు 200 కిలోమీటర్ల మేర చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటికే 30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో 70 కిలోమీటర్ల పనులు పూర్తి కావటానికి చివరి దశలో ఉన్నాయి.

14 ఓవర్‌హెడ్ రిజర్వాయర్ల నిర్మాణం

ఏ కొండూరులోని 38 గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఓవర్ హెడ్ రిజర్వాయర్లు కాకుండా మరో 14 ఓవర్ హెడ్ రిజర్వాయర్లను కూడా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పనులపై ఇటీవలే కలెక్టర్ సృజన సమీక్ష నిర్వహించారు. ఏడాదిలో పనులు పూర్తి కావాలని నిర్దేశించారు. ఏడాది కంటే తక్కువ సమయంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కృష్ణా జలాల ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



విద్యార్థుల ఆరోగ్య విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి సవిత

విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా ఆంధ్ర

- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

మోపిదేవి, ఆగస్టు 21 : గడిచిన ఐదేళ్లలో విధ్వంసానికి గురైన రాష్ట్రం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధివైపు అడుగులు వేస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవారం ఉదయం మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, డైనింగ్ హాలును మంత్రి స్వయంగా పరిశీలించారు. డిజిటల్ తరగతుల నిర్వహణ తీరును విద్యార్థులతో కలిసి కూర్చుని స్వయంగా తిలకించారు. డైనింగ్ హాలుకు వెళ్లి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ప్రతీరోజూ మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే స్వయంగా నా దృష్టికి తీసుకురావాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, 12 అదనపు తరగతి గదులు, డైనింగ్ హాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆడిటోరియం నిర్వహించాల్సి ఉందని, ఇందుకు ప్రత్యేకమైన నిధులు కేటాయించాలని పాఠశాల ఉపాధ్యాయ బృందం మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్... పాఠశాలలు, హాస్టల్స్‌ను స్వయంగా సందర్శించి సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించిన మీదటే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆమెతోపాటు నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఉన్నారు.

- మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం ఉదయం దర్శించుకున్నారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి సత్కరించారు.
- గురుకుల పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న నిరుద్యోగులను రెగ్యులర్ చేసేలా చూడాలని మంత్రి సవితకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

రికార్డులతో వస్తా!

- దమ్ముంటే అవినీతిని నిరూపించండి
- గుల్జార్ చౌక్ మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం



మాట్లాడుతున్న షేక్ ఇబ్రహీం

గుడివాడ : రికార్డులతో సహా తాను మసీదుకు వస్తానని, ఆరోపణలు చేసిన వారు అవినీతి జరిగినట్టు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైన సిద్ధమని గుల్జార్ చౌక్ మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం సవాల్ విసిరారు. బుధవారం స్థానిక నైజాంపేటలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిం మసీదు కమిటీ వ్యవహారాల్లో బయటి వ్యక్తుల ప్రమేయం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. కనీసం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయకుండా గత డిశంబర్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వం దొంగచాటుగా కమిటీ వేసిందన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా నిద్రపోయిన కమిటీ సభ్యులు నేడు ఏదో జరిగిపోయినట్టు ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే కమిటీ అధ్యక్షుడు కరీంబేగ్, అతని కుమారులు నేడు తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో నూర్ మసీదుకు వచ్చిన నిధులను గుల్జార్‌చౌక్ మసీదు అభివృద్ధికి వినియోగించామని, ప్రస్తుతం గుల్జార్‌చౌక్ దుకాణాల నిర్మాణ విషయం కోర్టు పరిధిలో ఉందని అన్నారు. మసీదు ఖాతాలో ఉన్న రూ.12లక్షలతో రేకుల షెడ్డుగా ఉన్న నూర్ మసీదుకు భవనాన్ని వక్ఫ్ బోర్డు అనుమతులతో నిర్మించామన్నారు. మసీదుకు చెందిన ఒక్కో దుకాణదారుడు రూ.25 వేలు రెండు విడతలుగా చెల్లించారని, నిధుల వివరాలు పూర్తి రికార్డులు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ నెల 23వ తేదీ శుక్రవారం తాను మసీదుకు వచ్చి రికార్డులను అందరి ముందుంచుతానని, ఎవరైనా రికార్డులను తనిఖీ చేసుకోవచ్చునని ఇబ్రహీం సవాల్ విసిరారు.



నిహారికకు పాండురంగస్వామి ప్రతిమనిచ్చి ఆహ్వానిస్తున్న రామకృష్ణ

మంచి కథ దొరికితే చిరంజీవితో సినిమా

- కమిటీ కుర్రోళ్లు విజయోత్సవ సభలో నిర్మాత నిహారిక

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 : మంచి కథ దొరికితే మెగాస్టార్ చిరంజీవితో సినిమా తీస్తానని సినీ నిర్మాత కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక అన్నారు. మచిలీపట్నంలో కమిటీ కుర్రోళ్లు సినిమా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా నిహారిక, సినీ నటుడు మణికంఠ సినీ బృందం సందడి చేశారు. తొలుత పాండురంగస్వామి దేవాలయంలో స్వామివారిని సందర్శించారు. ఆ తరువాత వరం మాల్‌లోని పీవీఆర్ థియేటర్‌లో సినిమా విజయోత్సవంలో నిహారిక పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాండురంగస్వామి ప్రతిమనిచ్చి తన ఇంటికి ఆహ్వానించారు. పవన్‌కల్యాణ్‌కు తన ఇంట్లో ఐదు రోజులు పాటు ఆతిథ్యం ఇచ్చామన్నారు. నీహారిక బృందానికి మచిలీపట్నంలో టీడీపీ నాయకుడు వాలిశెట్టి తిరుమలరావుతోపాటు పలువురు చిరంజీవి అభిమానులు స్వాగతం పలికారు. నిహారిక మీడియాతో మాట్లాడారు. కమిటీ కుర్రోళ్లు సినిమాలో మచిలీపట్నం నటుడు మణికంఠ నటించారన్నారు. తన పాత్రను ఎంతో చలాకీగా పోషించారన్నారు. మచిలీపట్నం మంగినపూడి బీచ్ షూటింగ్‌కు అనుకూలంగా ఉందన్నారు మచిలీపట్నంలో ఏ సినిమా అయినా సక్సెస్ అయితే రాష్ట్రమంతటా సక్సెస్ అవుతుందన్నారు.



సీఎం చంద్రబాబుతో డాక్టర్ విజయచైతన్య, పరుచూరి సాయికుమార్

క్యాథ్‌ల్యాబ్ సేవలను విస్తరించండి

- జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్ నిర్వాహకులకు సీఎం సూచన
- చంద్రబాబును కలిసిన డాక్టర్ విజయచైతన్య, సాయికుమార్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీపీపీ పద్ధతిలో క్యాథ్‌ల్యాబ్స్ నిర్వహిస్తున్న లక్ష్మీ ఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ విజయ చైతన్య, డైరెక్టర్ పరుచూరి సాయికుమార్ బుధవారం సీఎం చంద్రబాబును సచివాలయంలో కలిశారు. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీపీపీ పద్ధతిలో క్యాథ్‌ల్యాబ్స్‌ను లక్ష్మీ ఆరుష్ హెల్త్‌కేర్ నిర్వహిస్తోంది. ఈ విధానంలో స్టంట్స్, యాంజియోగ్రామ్ వంటి సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. ఈ క్యాథ్‌ల్యాబ్ సేవలను రాష్ట్రంలోని మరిన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు విస్తరించే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. తద్వారా మరింత మంది పేదలకు కార్డియోవ్యాస్కులర్ సేవలను అందించే అవకాశం ఉంటుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.



చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రాజేంద్ర దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛ కార్యకర్తలు

చల్లపల్లికి జాతీయస్థాయి గుర్తింపు

- ప్రశంసలు పొందిన సర్పంచ్ కృష్ణకుమారికి సన్మానం

చల్లపల్లి, ఆగస్టు 21 : చల్లపల్లి గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో గుర్తింపు రావటం, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనటం చల్లపల్లివాసులందరికీ గర్వకారణమనీ, గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల సమిష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందని స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు అన్నారు. ఢిల్లీలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనటంతోపాటు జాతీయ సెమినార్‌లో పాల్గొని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ చేతులమీదుగా గుర్తింపు, ప్రశంసలు అందుకున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సన్మానం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డీఆర్కే దంపతులు మాట్లాడారు. సన్మానగ్రహీత సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో కీలక భాగస్వామ్యం వహిస్తున్న డీఆర్కే దంపతులకు చల్లపల్లి గ్రామం నిత్యం రుణపడి ఉంటుందన్నారు. ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.

భారత్ బంద్ పాక్షికం

- యథాతథంగా తిరిగిన బస్సులు
- కొద్దిసేపు దుకాణాలు మూత

మచిలీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ సామాజిక వర్గీకరణను ఉపసంహరించుకోవాలని దళిత సంఘాల్లోని ఒక వర్గం బుధవారం తలపెట్టిన భారత్ బంద్ జిల్లాలో పాక్షికంగా జరిగింది. విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో మూసివేశారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. వ్యాపార సంస్థలు ఉదయం కాసేపు మూసి ఉంచి ఆ తరువాత తెరిచారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుధవారం ఉదయం 5 గంటల నుంచే మచిలీపట్నంలో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ గంగాధరరావు పర్యవేక్షించారు. మాలమహానాడు సంఘాల ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో పర్యటించి వ్యాపారస్తులను బంద్‌కు సహకరించాలని కోరారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మధ్యాహ్నం వరకు దుకాణాలను మూసివేశారు. అవనిగడ్డ బస్టాండ్ వద్ద బస్సులు తిరగకుండా కొంతసేపు దళిత సంఘాల నాయకులు అడ్డుకున్నా పోలీసులు సర్దిచెప్పడంతో కొంతసేటికి బస్సులను నడిపారు. గుడివాడలో దళిత సంఘాల నాయకులు తిరుగుతూ వ్యాపార సంస్థలను మూసివేయించారు. పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. పెడన, పామర్రు, పెనమలూరు తదితర నియోజకవర్గాల్లో బంద్ పాక్షికంగా జరిగింది.

కేడీసీసీబీ ద్వారా మరిన్ని సేవలు

కేడీసీసీబీ మహాజన సభలో పర్సన్ ఇన్‌చార్జి గీతాంజలి శర్మ



పీఏసీఎస్ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పర్సన్ ఇన్‌చార్జి గీతాంజలి శర్మ

మచిలీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ) ద్వారా రైతులకు, డ్వాక్రా మహిళలకు మరిన్ని సేవలు అందుబాలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు జేసీ, కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి గీతాంజలి శర్మ అన్నారు. కేడీసీసీబీ మహాజన సభ బుధవారం జెడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఆమె మాట్లాడుతూ కేడీసీసీబీ వంద సంవత్సరాలుగా రైతులకు సేవలు అందిస్తోందన్నారు. డీసీవో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేడీసీసీబీ పరిధిలోని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించడం గొప్ప సంస్కరణ అన్నారు. ఈ ఏడాది అక్టోబరు 2వతేదీ నాటికి కంప్యూటరీకరణ పనులు పూర్తిచేసి ప్రజలకు సేవలను మరింత చేరువ చేయనున్నట్లు తెలిపారు. కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్ బ్యాంక్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా డీసీవో శ్రీనివాసరెడ్డి, మచిలీపట్నం డివిజన్ కో-ఆపరేటివ్ విభాగం అధికారి పీవీ ఫణికుమార్, కేడీసీసీబీ జీఎం చంద్రశేఖర్, డీజీఎం ప్రభాకర్, కేడీసీసీబీ వివిధ బ్రాంచ్‌ల మేనేజర్‌లు, సభ్యులు, పీఏసీఎస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నివేదన సమయంలో వచ్చే ప్రముఖులు అధికారులకు సహకరించాలి : ఈవో రామారావు

వన్‌టౌన్, ఆగస్టు 21 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మవారికి నివేదన సమర్పించే సమయంలో అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రముఖులు ఆలయ అధికారులకు సహకరించాలని ఈవో రామారావు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉదయం 11.30 నుంచి 12.15 గంటల వరకు అమ్మవారి దర్శనాన్ని నిలిపివేస్తారని చెప్పారు. ఈ సమయంలో క్యూలలో పెద్ద సంఖ్యలో భక్తులు నిలబడతారని, ఇదే సమయంలో రద్దీ ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంలో వీఐపీలు వచ్చినట్లయితే ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆయన వివరించారు. మరోవైపు దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా మరికొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. కనకదుర్గానగర్‌లో ప్రస్తుతం పార్కింగ్ సౌకర్యం లేకపోవటంతో ఘాట్ రోడ్‌లోకి పరిమితంగానే కొండపైకి వాహనాలను అనుమతిస్తున్నామని తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో సాధరణ రోజుల కంటే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని వివరించారు. అమ్మవారికి నివేదన సమయం తరువాత సుమారు గంటా, గంటన్నర సమయం వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో ప్రోటోకాల్ దర్శనాలకు విచ్చేసే ప్రముఖులు మధ్యాహ్నం 2 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి విచ్చేసి, దేవస్థానం అధికారులకు సహకరించాలని కోరారు.



తనికెళ్ల భరణికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సన్నిధిలో తనికెళ్ల భరణి

వన్‌టౌన్, ఆగస్టు 21 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని ప్రముఖ సినీనటుడు, రచయిత, తనికెళ్ల భరణి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలు అందచేశారు. అమ్మవారి దర్శన అనంతరం ఆయనకు ఈవో రామారావు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందచేశారు. పండితులు వేద ఆశీర్వచనం అందచేశారు.

- తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని మామిళ్లగూడెంకు చెందిన జి.కొటేశ్వరరావు, నిర్మలలు బుధవారం ఆలయానికి వచ్చేసి ఆలయ గోపుర స్వర్ణతాపడం నిమిత్తం రూ.1,75,000, నిత్యాన్నదానానికి రూ1,50,000 విరాళాలను చెక్కు రూపంలో ఏఈఓ చంద్రశేఖర్‌కు అందచేశారు.

ఎంబీపీ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎంపీ కేశినేని చిన్ని



ఎమ్మెల్యే బొండా ఉమాతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 21 : మాకినేని బసవపున్నయ్య నగరపాలక సంస్థ స్టేడియాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీ, ఆంధ్ర క్రికెటర్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబీపీ స్టేడియాన్ని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు స్టేడియంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వర్షం పడినప్పుడల్లా గ్రౌండ్‌లో వర్షపు నీరు నిలిచిపోతున్న విషయాన్ని వివరించారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ క్రీడల నిర్వాహణకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని, స్టేడియంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సౌర విద్యుత్ పథకం ప్రారంభం

పాయకాపురం, ఆగస్టు 21 : ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ పీఎం సూర్య ఘర్ పేరుతో సౌర విద్యుత్ పథకం ప్రారంభించినట్టు సంస్థ ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దిగువ, మధ్య తరగతి నివాస విద్యుత్ వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌కు సబ్సిడీ కూడా అందిస్తున్నట్టు చెప్పారు. 1 కెడబ్ల్యూ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్... నెలకు సుమారు 125 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, దీని ద్వారా విద్యుత్ వినియోగదారుడు డిస్కమ్ నుంచి కనీస విద్యుత్ బిల్లు పొందుతారని ఆయన అన్నారు. ఈ సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ వినియోగదారుడు 5 నుంచి 6 సంవత్సరాలలోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారన్నారు.

జ్వర జాగ్రత్త (5వ పేజీ తరువాయి)

చేయాల్సి వస్తోంది. మచిలీపట్నంలోని సర్వజన ఆసుపత్రిలో డెంగీ టెస్టులు చేస్తున్నారు. డెంగీ భయంతో చాలామంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మచిలీపట్నం, విజయవాడలోని ప్రైవేట్ ల్యాబ్‌ల నుంచి ప్లేట్‌లెట్లు తెచ్చుకుని ఎక్కించుకుంటున్నారు. డెంగ్యూ ర్యాపిడ్ కిట్ పరీక్షకు ప్రైవేట్ ల్యాబ్‌ల వారు రూ.1,500-రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు.

ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయి...



మా వద్దకు వచ్చే రోగుల్లో కొంతమందికి ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయి. లోబీపీ కూడా వస్తోంది. లోబీపీకి మందులు ఇస్తూ నియంత్రిస్తున్నాం. ప్లేట్‌లెట్లు ఏ పరిమాణంలో ఉన్నాయో చూసి సూచనలు చేస్తున్నాం. ప్రతి మనిషికీ ప్లేట్‌లెట్లు 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ఉంటాయి. ఇవి పూర్తిగా పడిపోతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

- బి.శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, విజయవాడ ప్రభుత్వాసుపత్రి

వైరస్ వ్యాపిస్తోంది



జ్వరం ఒకరి నుంచి ఒకరికి సోకదు. ప్రస్తుతం ఆసుపత్రులకు వస్తున్న రోగులను పరీక్షిస్తుంటే వైరస్ 6-12 గంటల్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోంది. జ్వరంతో పాటు కొంతమందికి శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి. కడుపునొప్పితో కొంతమంది బాధపడుతున్నారు. సాధారణంగా రెండు నెలలపాటు జ్వరాల సీజన్ ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే, నవంబరు వరకూ కొనసాగేలా ఉంది. ఈ జ్వరాలతో యాంటీబయాటిక్స్ ఇవ్వడం కంటే సపోర్టింగ్ వైద్యం ద్వారా నయం చేయవచ్చు. బీపీ తగ్గిపోకుండా మందులు ఇవ్వడం, ఆహారం తీసుకోలేని వారికి ఫ్లూయిడ్స్ ఇవ్వడం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్నవారికి సీపాప్ (ఒత్తిడితో ఆక్సిజన్ ఇవ్వడం) చేస్తే జ్వరపీడితులకు ఉపశమనం కలిగించవచ్చు.

- డాక్టర్ పీవీ రామారావు, డైరెక్టర్ ఆఫ్ ఆంధ్రా ఆసుపత్రి

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- గొర్రెపాటి గోపీచంద్



మచిలీపట్నం టౌన్ : ఓటుకు నోటు కేసులో చంద్రబాబుపై సుప్రీం కోర్టుకు వెళ్లి జగన్‌మోహనరెడ్డి బొక్కబోర్లా పడ్డారని, అయినా ఇంకా లేనిపోని వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ అన్నారు. బుధవారం శిడింబి అగ్రహారంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరకట్ట కమల్‌హాసన్, జగన్‌మోహనరెడ్డి ఏదో చేద్దామని నవ్వుల పాలయ్యారన్నారు.

అడ్మిన్ ఏడీసీపీకి ఎస్పీగా పదోన్నతి

విజయవాడ - ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో అడ్మిన్ ఏడీసీపీగా ఉన్న ఎం.కృష్ణమూర్తి నాయుడికి నాన్ క్యాడర్ ఎస్పీ పదోన్నతి లభించింది. ఆయన బుధవారం పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

గిరిజన యువతకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో బీఈడీ, డీఈడీ, టెట్ పాసైన గిరిజన కులానికి చెందిన నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వడంతో పాటుగా వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు అర్హతలు

డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్‌లలో పాస్ అయిన వారి మార్కుల ప్రకారంగా మెరిట్ జాబితా ఆధారంగా ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషన్ ఉంటుంది. ఇతర వివరాలకు 96663 92500ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ : సెప్టెంబర్ 5వ గురు పూజోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డీఈఓ యు.వి.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేసే 15 సంవత్సరాల సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవటానికి అర్హులన్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు అందచేయాలన్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

సెమీస్ దశకు మేరీ బాస్కెట్‌బాల్ టోర్నీ



విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 21 : నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఆవరణలో జరుగుతున్న మేరీ మెమోరియల్ సిటి లెవెల్ బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. నగరంలోని కళాశాలల జట్లు తలపడుతున్న విషయం తెల్సిందే. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌ల్లో భాగంగా బుధవారం క్వార్టర్స్‌లో స్టెల్లా-ఏ, స్టెల్లా- బి, కేఎల్‌యూ జట్లు ప్రత్యర్థి జట్లపై విజయం సాధించి సెమీస్‌కు చేరాయి. పోటీలు ముగింపు కార్యక్రమం గురువారం జరగనుంది.



రాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న ఎన్ఆర్ఐ నీలాంజని, కుటుంబసభ్యులు

రాగూర్ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గవర్నర్‌పేట, ఆగస్టు 21: నగరానికి చెందిన అన్నే శ్రీనాథ్ పిల్లలు అమెరికా కాలిఫోర్నియాలో ఎంఎస్ చేస్తున్న అన్నే నీలాంజని, దిగ్విజయ్ బుధవారం ఎంజీ రోడ్డులోని రాగూర్ స్మారక గ్రంథాలయానికి విలువైన స్టోరీ బుక్స్, ఇంగ్లీషు నవలలు అందజేశారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవికి పుస్తకాలు అందజేసిన నీలాంజని భవిష్యత్తులో గ్రంథాలయానికి ఏ అవసరాలు ఉన్నా సాయం అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. పుస్తకాలు వితరణ చేసిన అన్నే శ్రీనాథ్, కుటుంబ సభ్యులకు గ్రంథాలయాధికారిణి ధన్యవాదాలు తెలిపారు.





రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

కోల్‌కతా సంఘటనకు నిరసనగా ఐద్వా ర్యాలీ

వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా ర్యాలీ

విద్యాధరపురం, ఆగస్టు 21: కోల్‌కతా ఆర్జికల్ ఆసుపత్రిలో జరిగిన సంఘటనకు నిరసనగా బుధవారం భవానీపురంలోని నేతాజీ స్కూల్ విద్యార్థులతో కలిసి ఐద్వా పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. భవానీపురంలోని పలు ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలు కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులపై ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె. శ్రీదేవి మాట్లాడుతూ రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువవుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కట్టడి చేయాలని, దేశవ్యాప్తంగా అమలయ్యే విధంగా కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. కుందనాల శేషమణి, గాదె ఆదిలక్ష్మి, కె.వెంకట రత్నం, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ కె. తిరుపతి రెడ్డి, ప్రిన్సిపల్ కె. అరుణ, బి. శిరీష, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలి

రైల్వేస్టేషన్: జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ సెక్రటరీ లీలా డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా బుధవారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కె.ఎస్.ఎన్. మూర్తి భవన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై అకృత్యాలను అరికట్టే చట్టాలను తేవాలని కోరారు. డివిజనల్ మహిళా కో-ఆర్డినేటర్ హారిక, కోశాధికారిణి ఆర్.ఎన్.లక్ష్మి, డివిజనల్ ప్రెసిడెంట్ రామ్‌గుప్తా, పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జై సంతోషిమాత ఉత్సవాలు

పాయకాపురం, ఆగస్టు 21 : పాయకాపురంలో ఉన్న జై సంతోషిమాత అమ్మవారి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 19న రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదినోత్సవంతో ప్రారంభమైన ఉత్సవాలు 21వరకు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున మహా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించగా 5000 మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.



భక్తులకు భోజనం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకంగా అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠాపన, జయంతి ఉత్సవాలు ఒకే నెలలో విజయవంతంగా జరిగినట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, మార్కండేయులు, నాని, చిన్నిలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 21: బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ కింద రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకునే స్ట్రీట్ వెండర్ల సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు.

బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ కింద కార్పొరేషన్ వారు చిరువ్యాపారాలను తీసి వేయించిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గద్దె బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ అధికారులు బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ కింద ఉన్న బడ్డీకొట్లు, తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లను తొలగించారని, వీరంతా పేదవారని, వారికి ఈ వ్యాపారం తప్ప మరో జీవనోపాధి మార్గాలు లేవన్నారు. ఈ ప్రాంతంలో ఆటో కార్మికుల స్టాండ్‌ను కూడా కొనసాగించాలని అధికారులు కోరతామని అన్నారు. ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆటో కార్మికులు, చిరువ్యాపారులు వారి పనులు నిర్వహించుకునేలా తాను కమిషనర్‌ను కలిసి వివరించి చిరువ్యాపారులకు అండగా ఉంటామని తెలిపారు. చెన్నుపాటి గాంధీ, యలమంచలి దేవేంద్ర, గద్దె రమేష్, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.



బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ కింద వ్యాపారాలను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్ ధ్యానచంద్రకు వినతి

చిట్టినగర్, ఆగస్టు 21: వీఎంసీలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా వీఎంసీ యూనిట్ కార్యవర్గ సభ్యులు బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రను కలసి వినతి పత్రం అందజేశారు. ఎలక్షన్-2024లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరగా కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని యూనిట్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా వీఎంసీ యూనిట్ అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ సలీం అహ్మద్, కార్యవర్గ సభ్యులు గుర్రం ప్రకాష్, కె.శారదరాణి, కె.సురేంద్రకుమార్, టీఎస్ఎస్ శర్మ, పీ. సుభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఎంసీ యూనిట్ కార్యవర్గ సభ్యులు

కమిషనర్ పర్యటన

అజిత్‌సింగ్‌నగర్: ప్రజలకు భద్రత కల్పించే విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మహిళల ఆర్థిక స్థితి పెంచేందుకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బొండా ఉమా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

గవర్నర్‌పేట, ఆగస్టు 21: సమాజంలో మహిళల ఆర్థిక పరిస్థితి వృద్ధి చెందేలా తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గోపాల్‌రెడ్డి రోడ్డులోని ఐవీ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో బుధవారం శ్రీ శక్తి మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం ద్వారా డ్వాక్రా సంఘాలకు మంచి రోజులు వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర రుణాలు తక్కువ వడ్డీకి అందించడం ద్వారా మహిళలకు అండగా ఉండాలని స్థానిక నేతలకు సూచించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, నేతలు కోటి, ఆలపాటి రాము, చింతా దుర్గారావు, వీఎంసీ సిబ్బంది జగదీశ్వరి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

పాయకాపురం: రాష్ట్రంలో విద్యారంగంలోని పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు ఎమ్మెల్యే బొండా ఉమాకు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం బొండా ఉమా నివాసానికి వెళ్లిన ఫెడరేషన్ సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత వైసీపీ పాలనలో ఉపాధ్యాయులపై మోయలేని పని భారానికి కారణమైన జీవో నెం 117, 128 రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన బొండా ఉమా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, కె. భానుమూర్తి ఉన్నారు.

రూ. 8.84 లక్షలతో పంప్‌హౌస్ బూస్టర్ మరమ్మతు పనులు

చిట్టినగర్, ఆగస్టు 21: 49వ డివిజన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు రూ 8.84లక్షలతో చిట్టినగర్ మట్టా లాజరస్ స్కూల్ పంప్‌హౌస్ బూస్టర్ మరమ్మతుల పనులను బుధవారం కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ పలువురు స్థానికులతో కలసి ప్రారంభించారు. వీఎంసీ ఏఈ రాజేష్, కాంట్రాక్టర్ చినబాబు, బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొమర కిరణ్ పలువురు కూటమి స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

భవానీపురం, ఆగస్టు 21 : 44వ డివిజన్ జనసేన యువ నాయకుడు నామన కార్తీక్ చంద్ర పుట్టినరోజు సందర్భంగా బుధవారం పేదలకు పండ్లు పంపిణీ జరిగింది. నాలుగుస్థంభాల సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమలో ముఖ్య అతిథిగా అజయ్‌వర్మ ఠాకూర్, నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్‌లు హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు.

నగరాలకు సముచిత స్థానం కల్పించాలి

అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీ రావు

చిట్టినగర్, ఆగస్టు 21: నగరాల సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీరావు కోరారు. బుధవారం కేఎల్ రావు నగర్ సంఘం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల సామాజిక వర్గానికి న్యాయం చేసేలా నామినేటెడ్ పోస్టుల్లో పదవులు కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తమ సామాజిక వర్గానికి న్యాయం చేసేలా నామినేటెడ్ పోస్టులలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాయన శేఖర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని సూర్యారావు, ఉపాధ్యక్షులు శీరం వెంకట్రావ్, మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు(పీసీ), నగరాల సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డూరి రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్వీ రావు

ముగిసిన గూగుల్ ఏఐ ఎంఎల్ వర్క్‌షాపు

లబ్బీపేట, ఆగస్టు 21: నలంద డిగ్రీ కళాశాలలో ఎడ్యూస్కిల్స్ టెక్‌క్యాంప్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఫైనల్ ఇయర్ బీఎస్సీ విద్యార్థులకు మూడు రోజుల పాటు జరిగిన గూగుల్ ఏఐ ఎంఎల్ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎడ్యూస్కిల్స్ అసోసియేట్ మేనేజర్ లెర్నింగ్ అండ్ డవలప్‌మెంట్ ట్రైనర్ ఎస్.వి.రవికుమార్ విద్యార్థులకు ఆధునిక సాంకేతికత గురించి, మెషిన్ లెర్నింగ్‌లో వివిధ టెక్నిక్స్‌ని సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. కార్పొరేట్ సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ప్రాముఖ్యత, ఇన్‌స్టిట్యూషన్స్‌కు, ఇండస్ట్రీస్‌కి మధ్య బ్రిడ్జిగ్యాప్‌కి అవసరమైన కోర్సులను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ పి.దుర్గభవాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



చిర్రావూరులో మొక్కలు నాటే కార్యక్రమం

వన్‌టౌన్, ఆగస్టు 21: పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ - డేటా సైన్స్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం సర్వీసు స్పెక్ట్రమ్ క్లబ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా చిర్రావూరు గ్రామంలో మొక్కలను నాటారు. చిర్రావూరు గ్రామాన్ని పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ దత్తత తీసుకున్నది. చిట్టా అమర సుధీర్, ప్రిన్సిపాల్ పతంజలి శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



దిశ డాన్‌బాస్కో మెగా జాబ్‌మేళా రేపు

గవర్నర్‌పేట, ఆగస్టు 21: దిశ డాన్‌బాస్కో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న పెజ్జోనిపేటలోని ఆర్‌సీఎం చర్చి వద్ద మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. జీవన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాకు 15 పేరెన్నిక గల కంపెనీలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఇతర డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుని హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు 82972 42547, 80730 31426 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.

సిద్ధు కోసం శ్రీనిధి



సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. • Must have passed Class 12 with a minimum of 60% marks. • The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

• Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/LAnmSITలో చదవండి.

కౌన్సెలింగ్

డాక్టర్! నా వయసు 20 ఏళ్లు! ప్రతి నెలసరిలో విపరీతమైన కడుపు నొప్పి, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. ఎన్నో మందులు వాడాను. కానీ నొప్పి అదుపులోకి రావడం లేదు. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందే సులువైన చికిత్సను సూచించగలరు?

- ఓ సోదరి, కర్నూలు

నెలసరి నలత

స్త్రీల జీవితంలో కీలకమైన దశ ఇది. మహిళగా మారే క్రమంలో ఈ దశలోనే పునరుత్పత్తి వ్యవస్థ పూర్తి ఎదుగుదలకు చేరుకుంటుంది. అయితే కొందరు టీనేజీ అమ్మాయిలకు నెలసరి సమయంలో శారీరక అసౌకర్యం కలగడం సహజం. అయితే భావోద్వేగాలు అదుపు తప్పడం, నడుము, కాళ్లలో నొప్పులు, తలనొప్పి, అలసట మొదలైన అసౌకర్యాలు శరీర తత్వాలనుబట్టి మారుతూ ఉంటాయి.

నెలసరి నొప్పులు తగ్గాలంటే?

మానసిక, శారీరక అసౌకర్యాలు భరించలేనంతగా ఉంటే, ఉపశమనం కోసం ఆయుర్వేద చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే....

- **నువ్వుల నూనె మర్దన:** ఆయుర్వేద అభ్యంగన స్నానం కోసం ఈ నూనె వాడతారు. దీన్లోని లినోలిక్ యాసిడ్‌కు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం కలిగి ఉంటుంది. విషాలను హరించే తత్వం కూడా ఈ నూనెకు ఉంటుంది. కాబట్టి నెలసరి సమయంలో ఈ నూనెతో పొత్తికడుపు మీద సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.
- **మెంతుల మహిమ:** కాలేయం, మూత్రపిండాలు, మెటబాలిజంకు మెరుగైన ఔషధం మెంతులు. వీటితో నెలసరి నొప్పులు కూడా తగ్గుతాయి. కాబట్టి 2 టీస్పూన్ల మెంతులను 12 గంటలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి.
- **వేడి కాపడం:** పొత్తికడుపు మీద వేడి కాపడం పెడితే గర్భాశయ కండరాలు ఉపశమనం పొంది నొప్పులు తగ్గుతాయి. కాబట్టి వేడి నీళ్ల నింపిన బాటిల్‌ను పొత్తికడుపు మీద ఉంచి కాపడం పెట్టాలి. వేడి జావ తాగినా, వేడి నీళ్ల స్నానం చేసినా కూడా ఫలితం దక్కుతుంది.
- **వ్యాయామంతో ఉపశమనం:** నొప్పితో మంచానికే అతుక్కుపోయే బదులు, వ్యాయామంతో ఒళ్లు కదిలిస్తే కటి ప్రదేశానికి రక్తప్రసరణ పెరిగి నొప్పులు తగ్గుతాయి. నెలసరి సమయంలో మూత్రాశయ కండరాలు కుంచించుకుపోయేలా చేసే హార్మోన్లను నెమ్మదించేలా చేసే ఎండార్ఫిన్లు వ్యాయామం చేస్తే విడుదలవుతాయి. కాబట్టి ఈ సమయంలో తేలికపాటి వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆ మూడు రోజులే కాకుండా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పిస్తే క్రమేపీ నెలసరి నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **శొంఠి, మిరియాల టీ:** శొంఠి, మిరియాల పొడి కలిపిన నీళ్లను వేడి చేస్తే హెర్బల్ టీ తయారవుతుంది. దీన్లో పాలు కలపకుండా తాగితే, నొప్పులకు కారణమయ్యే హార్మోన్ల పరిమాణం తగ్గి నొప్పులు తగ్గుతాయి. ఈ టీ వల్ల నెలసరి సమస్యలు కూడా సరి అవుతాయి. అలసట కూడా వదులుతుంది.
- **జీలకర్ర వైద్యం:** జీలకర్ర వేసి మరిగించిన నీళ్లు తాగినా ఫలితం ఉంటుంది.
- **ఛామొమైల్ టీ:** ఈ పువ్వులు వేసి కాచిన నీళ్లు తాగితే పొత్తికడుపు, నడుము నొప్పులు తగ్గుతాయి. ఈ పూలలోని ఔషధ గుణాలు కూడా గర్భాశయాన్ని కుంచించుకుపోయేలా చేసే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- కప్పు పాలలో, దంచిన మూడు వెల్లుల్లి రెబ్బలు, పసుపు, తేనె, మిరియాల పొడి వేసి వెల్లుల్లి రెబ్బలు ఉడికేవరకూ కాచాలి. ఈ పాలను తాగి, వెల్లుల్లి రెబ్బలను నమిలేయాలి. ఇలా క్రమంతప్పకుండా 3 రోజులు చేసినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.



ఈ జాగ్రత్తలు పాటించాలి!

- చక్కెర, మైదా, శుద్ధిచేసిన పదార్థాలు, కృత్రిమ రంగులు ఉన్న పదార్థాలు మానేయాలి.
- బియ్యం, పాస్తా, బ్రెడ్ వాడకం మానేయాలి.
- ఉప్పు వాడకం బాగా తగ్గించాలి. ఉప్పు శరీరంలో నీరు నిల్వ ఉండేలా చేస్తుంది. దాంతో నెలసరి సమయంలో ఒళ్లు మరింత బరువై బద్ధకం ఆవరిస్తుంది.
- కాఫీ కూడా బాగా తగ్గించాలి. కెఫీన్ వల్ల నెలసరి నొప్పులు ఎక్కువవుతాయి.
- ప్రతి రోజూ పరగడుపున నిమ్మరసం తాగడం అలవాటు చేసుకోవాలి.
- నెలసరి ద్వారా పోయే రక్తం ద్వారా క్యాల్షియం శరీరం నుంచి వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలి.
- రోజుకి కనీసం 8 గంటల నిద్ర తప్పనిసరి. నిద్రతో శరీరం ఉపశమనం పొందుతుంది. ఫలితంగా నొప్పులూ అదుపులోకి వస్తాయి.
- నట్స్, సీడ్స్ తిని, ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్లు విడుదలై నొప్పులు తగ్గుతాయి.

- డాక్టర్ రాంప్రకాశ్
ఆయుర్వేద వైద్యులు,
హైదరాబాద్.



"కొద్దిసేపటి క్రితమే- గంటా ఐదు నిమిషాల్లో 80 ల్యాప్స్ (రెండు కిలోమీటర్లు) ఈదాను. వచ్చే నెల రోజుల్లో మరింత మెరుగుపడాలి" అంటారు **విద్యా గజపతి రాజు సింగ్**. విజయనగరం రాజకుటుంబానికి చెందిన ఈ 71 ఏళ్ల రాజకుమారి సామాన్యమైన వ్యక్తి కాదు... గత కొన్నేళ్లుగా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో అనేక గోల్డ్ మెడల్స్ గెలుచుకున్న ఛాంపియన్. 'నవ్య' ఆమెను పలకరించినప్పుడు అనేక విశేషాలను వివరించారు.

ఆ క్రమశిక్షణే నడిపిస్తోంది

మీ బాల్యం ఎలా గడిచింది?

మా పెదనాన్నగారు విజయనగర సంస్థానానికి చెందిన ప్రముఖుడు పి.వి.జి.రాజు. మా నాన్నగారు ఆయన సోదరుడు విశ్వేశ్వర గజపతి రాజు. పెదనాన్నగారు విజయనగరం, హైదరాబాద్‌లలో ఉంటే- మేము మద్రాసు (చెన్నై)లో ఉండేవాళ్లం. నేను పుట్టింది, పెరిగింది అక్కడే. నేను, మా చెల్లి మద్రాసులో చర్చ్ పార్క్ స్కూలో చదువుకున్నాం. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మద్రాసు ప్రెసిడెన్సీకి మద్రాసు రాజధాని. బ్రిటిష్ వారు అక్కడి నుంచే పాలించేవారు. ప్రెసిడెన్సీకి అది ప్రధాన కేంద్రం కావడంతో.... తెలుగు ప్రాంతాలకు చెందిన జమీందారీ కుటుంబాలకు అక్కడ ఎస్టేట్లు ఉండేవి. పిఠాపురం, విజయనగరం, కపిలేశ్వరపురం, బొబ్బిలి, చుక్కవరం, సురవరం- ఇలా అందరూ రాజకుటుంబీకులు మద్రాసులో ఉండేవారు. అందరం తరచూ కలుసుకుంటూ ఉండేవాళ్లం.

మీరు మంచి స్విమ్మర్. సైక్లింగ్ చేస్తారు.. ఇవన్నీ ఎప్పటి నుంచి అలవాటు అయ్యాయి?



మమ్మల్ని మా నాన్నగారు చాలా క్రమశిక్షణతో పెంచారు. నేను పుట్టిన తర్వాత ఒక రోజు హఠాత్తుగా ఆయన వేట, మద్యపానం, ధూమపానం, మాంసాహారం, పేకాట- ఇవన్నీ మానేశారు. శుద్ధ శాకాహారిగా మారిపోయారు. స్కూలుకు వెళ్లి బాగా చదువుకోవటం, ఆ తర్వాత వ్యాయామం.... ఇదే మా రొటీన్. టెన్నిస్, హార్స్ రైడింగ్- ఇలా అనేక అంశాల్లో శిక్షణ ఇప్పించారు. నేను కాలేజీలో చదువుకొనే రోజుల్లో మూడేళ్ల పాటు నేనే టెన్నిస్ టీమ్ కెప్టెన్‌ని. దేశంలోని అనేక ప్రాంతాల్లో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేవాళ్లం. బహుశా ఆ క్రమశిక్షణే ఇప్పటికీ కొనసాగుతోంది.

మీరు చిన్నప్పుడు విజయనగరం వెళ్లేవారా? ఆ జ్ఞాపకాలేమిటి?

సెలవుల్లో విజయనగరం వెళ్తూ ఉండేవాళ్లం. మా చిన్నప్పుడు పెదనాన్న ఫూల్‌బాగ్ ప్యాలెస్‌లో ఉండేవారు. మా కజిన్స్ ఆనంద్ గజపతిరాజు, అశోక్ గజపతిరాజు, సునీతలతో ఆడుకుంటూ ఉండేవాళ్లం. నాకు విజయనగరం కోట, ఆ పట్టణం అంటే చాలా ఇష్టం. సింహాచలం తరచూ వెళ్తూ ఉండేవాళ్లం. కొవిడ్ వచ్చిన తర్వాత విజయనగరం వెళ్లలేదు. కానీ అంతకుముందు ప్రతి ఏడాది వెళ్లేవాళ్లం. ఆనంద్ కూతురు పెళ్లికి, అశోక్ కూతుర్ల పెళ్లిళ్లకు విజయనగరం వెళ్లాను. అవన్నీ చాలా తీపి జ్ఞాపకాలు. ఇప్పటికీ గుర్తున్నాయి. విజయనగరంతో పాటుగా ఊటీ గురించి కూడా చెప్పాలి. ఊటీలో 'ఎన్‌కిల్ ఎస్టేట్' అని ఉంది. అది మాదే. ప్రస్తుతం ఊటీలో ఉన్న సెంటినరీ రోజ్ గార్డెన్- మా అమ్మమ్మ తన కోసం పెంచుకున్నదే! ఆవిడ నివసించిన దిల్‌కుష్ మహల్‌ను ఇప్పుడు స్కూలుగా మార్చారు. మా చిన్నప్పుడు- కజిన్స్ అందరం కలిసి ఊటీ వెళ్లేవాళ్లం. ఈ మధ్యకాలంలో ఊటీ బాగా కమర్షియల్‌గా మారిపోయింది. అందుకే వెళ్లటం మానేశాను.

లండన్‌లో విజయనగరం షీల్డ్స్

ఇంగ్లాండ్‌లో సుమారు 150 ఏళ్ల నుంచి 'నేషనల్ రైఫిల్ డే' (జూలై 26) రోజున 'విజయనగరం రోలింగ్ షీల్డ్స్' బహూకరిస్తారు. ఈ ఏడాది వాటిని అందజేయడం కోసం నన్ను లండన్ ఆహ్వానించారు. ఆ షీల్డ్స్ వెనుక ఒక కథ ఉంది. 1867లో మా ముత్తాత విజయరామ గజపతి- ఇంగ్లాండ్‌కు వెళ్లారు. ఆయన చాలా మంచి వేటగాడు. మంచి షూటర్. ఆ సమయంలో బ్రిటన్ పార్లమెంట్ సభ్యులకు మూడు అడుగులు ఉన్న రెండు వెండి రోలింగ్ షీల్డ్స్ ఆయన బహుమతిగా ఇచ్చారు. బ్రిటన్ పార్లమెంట్‌లో 'హౌస్ ఆఫ్ లార్డ్స్', 'హౌస్ ఆఫ్ కామన్స్' అని రెండు సభలు ఉంటాయి. ఈ సభల సభ్యులతో షూటింగ్ టీమ్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రతి ఏడాది జూలై 26వ తేదీన ఈ టీమ్‌ల మధ్య పోటీ జరుగుతుంది. గెలిచిన వారికి ఈ 'విజయనగరం షీల్డ్స్' బహూకరిస్తారు. ఆశ్చర్యమేమిటంటే సుమారు 150 సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది కమిటీ వారు నన్ను ఈ పోటీలకు ఆహ్వానించారు. అంతేకాదు, 'లార్డ్స్ టీమ్'లో నన్ను ఒక సభ్యురాలుగా చేశారు. నాకు షూటింగ్ రాదంటే- కోచ్‌ను పెట్టి నేర్పారు. 300, 400, 700 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను షూట్ చేయాలి. ఇది చాలా కష్టం. ఈసారి గెలిచిన టీమ్‌కు నేను ట్రోఫీలు అందించాను. ఇది చాలా గొప్ప అనుభవం. నాకు దక్కిన గౌరవం.

రాజకీయాల్లోకి ప్రవేశించాలని మీకు ఎప్పుడూ అనిపించలేదా?

లేదు. ఎందుకంటే నాకు విజయనగరంలో బేస్ లేదు. పెదనాన్నగారు ఫుల్‌టైమ్ పొలిటీషియన్. ఆనంద్, అశోక్‌లు- ఆయన వారసత్వం నిలబెట్టారు. ప్రస్తుతం అశోక్ కుమార్తె కూడా గెలిచింది. ఉత్తరాఖండ్‌లోని తెరీ గర్వాల్ ఎంపీ మాలా రాజ్యలక్ష్మీ షా మాకు దగ్గర బంధువు. ఆమె ఒకప్పుడు నేపాల్ యువరాణి. 2014లో ఆమె బీజేపీ తరుపున రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆమెను 'గుంగీ గుడియా' అని ఎగతాళి చేసింది. కానీ ఆమె ఎన్నికల్లో గెలిచింది. 2019, 2024 ఎన్నికల్లో రెండు లక్షలపైగా మెజారిటీతో విజయం సాధించింది. అక్కడ ప్రజలు ఆమెను గెలిపించారంటేనే- మంచి పనులు చేస్తున్నట్లు లెక్క కదా! మా కుటుంబంలోని వారందరూ ప్రజలకు మేలు చేయటానికే రాజకీయాల్లోకి వచ్చారు.



మీ రాజ కుటుంబాలలో మహిళలపై ఆంక్షలు ఉండేవా?

మేమందరం 1950ల తర్వాత పుట్టిన వాళ్లం. మా సమయంలో- మా కుటుంబాలలో అమ్మాయిల మీద ఆంక్షలు ఉండేవి కాదు. బొబ్బిలి, పిఠాపురం, విజయనగరం జమీందారీ కుటుంబాలలో అమ్మాయిలను చదివించేవారు. వెంకటగిరి సంస్థానంలోని మహిళలు మాత్రం చాలా కాలం పరదాలోనే ఉన్నారు.

ఈ కాలం మహిళలకు మీరు ఇచ్చే సలహా ఏవిటి?

వ్యాయామాన్ని ఒక అలవాటుగా చేసుకోండి. మనకు జీవితాంతం తోడుండేది వ్యాయామమే! అదే మనకు క్రమశిక్షణ నేర్పుతుంది, అవసరమైన శక్తిని ఇస్తుంది.

నా ఆరోగ్య రహస్యం అదే!

నేను కిందటి వారం తమిళనాడు రాష్ట్ర మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో ఐదు గోల్డ్‌మెడల్స్ గెలిచాను. ప్రతి ఏడాది నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ ఉంటా. ప్రతిసారి కనీసం మూడు గోల్డ్ మెడల్స్ వస్తూ ఉంటాయి. ప్రస్తుతం నాకు 71 ఏళ్లు. ప్రతి ఏడాది కనీసం రెండుసార్లు ట్రెక్కింగ్‌కు వెళ్తా. మే నెలలో నేపాల్‌లోని లాంగ్‌టాంగ్ వ్యాలీకి వెళ్లాను. అది 16 వేల అడుగు ఎత్తు ఉంటుంది. తరువాత లద్దాఖ్‌లో 'మెంగ్‌టాక్ దాంగ్రి' అనే సమ్మిట్‌కు వెళ్తున్నా. దాని ఎత్తు 20,750 వేల అడుగులు. ప్రతి శనివారం 50 కిలోమీటర్లు సైకిలు తొక్కుతా! నేను వెజిటేరియన్‌ని. అయితే ఎగ్స్ తీసుకుంటా. సలాడ్స్ ఫ్రూట్స్, చీజ్ తింటూ ఉంటా. అదే నా ఆరోగ్య రహస్యం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవలసిన వయసులో సవాళ్లతో కూడిన కుంకుమ పువ్వు సాగులోకి అడుగు పెట్టింది 64 ఏళ్ల **శుభాన్వి**. కశ్మీరుకు పూర్తి భిన్నమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో వాతావరణ సవాళ్లను సమర్థంగా అధిగమించి వాణిజ్యవేత్తగా ఎదిగింది.. అనేక మందికి ఉపాధి కల్పిస్తోంది.



ఈ వ్యవసాయం వినూత్నం

వ్యవసాయం పట్ల మక్కువ, గ్రామీణ మహిళల జీవితాలను ప్రభావితం చేయాలనే తపన, 64 ఏళ్ల శుభాన్విని కుదురుగా కూర్చోనివ్వలేదు. పిల్లలతో పాటు మనవలు, మనవరాళ్లు కూడా ఎదిగిపోవడంతో ఆవిడకు చేతి నిండా తీరిక చిక్కింది. ఆ తీరిక సమయాన్ని ఉత్పాదకమైన పని కోసం ఉపయోగించాలనే ఆలోచన ఆవిడకు తట్టింది. దాంతో తనకెంతో ఇష్టమైన వ్యవసాయాన్నే వ్యాపకంగా చేసుకుందామని పరిశోధన మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఆమె దృష్టి కుంకుమ సాగు వైపు మళ్లింది. అయితే కుంకుమపువ్వుకు పుట్టినిల్లైన కశ్మీరులా ఉత్తర్ ప్రదేశ్ చల్లని ప్రదేశం కాదు. కానీ ఇంట్లోనే చల్లటి వాతావరణాన్ని సృష్టించగలిగితే? ఈ ఆలోచన ఆమెలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది.

కిలోకు కిలో రాబడి

"2023లో శుభాన్విని స్మార్ట్‌ఫామ్స్‌ను స్థాపించాను. ముందుగా 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేసుకుంది. అయితే కోల్డ్ స్టోరేజీలో సరైన వెలుతురు ఉండదు. అందువల్ల పంటకు తగిన వెలుతురును ఏర్పాటు చేసుకున్నా. ఇదంతా మనకు మార్కెట్లో లభించే పరికరాలతోనే ఏర్పాటు చేసుకోవచ్చు" అంటారామే! శుభాన్వినికి తొలి రోజుల్లో దిగుబడి ఎంత వస్తుందనే బెంగ ఉండేది. కానీ నాణ్యమైన విత్తన దుంపలను ఉపయోగించటం వల్ల దిగుబడి కూడా బాగా పెరిగింది. ఒక కిలో పువ్వుల నుంచి 800 గ్రాముల నుంచి కిలో దాకా కుంకుమ పువ్వు లభిస్తోంది. ఇది చాలా అరుదైన విషయంగా చెప్పుకోవాలి.

త్వరలో విదేశాలకు కూడా..

ప్రస్తుతం శుభాన్విని ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు నగరాలకు కుంకుమ పువ్వును ఎగుమతి చేస్తోంది. అతి త్వరలోనే విదేశాలకు కూడా కుంకుమ పువ్వును ఎగుమతి చేయటానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. "మొదట్లో ఉత్తరప్రదేశ్‌లో కుంకుమ పువ్వును పండిస్తున్నానంటే ఎవరు నమ్మలేదు. ఈ రోజు నా దగ్గర దొరికే కుంకుమ పువ్వు- ఇతర దేశాలలో దొరికే అత్యుత్తమ కుంకుమ పువ్వుకు ఏ మాత్రం తీసిపోదు" అంటారామే!

కేరళలో లంచ్‌బెల్

ముంబైలో 'డబ్బావాలా' మస్తు ఫేమస్. వేలమంది కార్మికులు సరైన సమయానికి ఇళ్లనుంచి హోటళ్ల నుంచి ఆఫీసులకు డబ్బాల్లో ఆహారాన్ని అందచేస్తారు. ఇదే మాదిరిగా కేరళలో మహిళలతో 'లంచ్‌బెల్' పేరుతో ఆహారాన్ని ఆఫీసులకు అందచేసే పని కొనసాగుతోంది. ఈ 'లంచ్‌బెల్' విశేషాలను తెలుసుకుందాం.



డబ్బావాలా జీవితంపై ఏకంగా బాలీవుడ్‌లో ఏకంగా 'లంచ్‌బాక్స్' అనే సినిమా వచ్చింది. డబ్బావాలా పేరుతో డాక్యుమెంటరీలు వచ్చాయి. ఇక మరాఠీలో అయితే 'ముంబై కా డబ్బావాలా' అంటూ పదిహేడేళ్ల కితమే ఓ చిత్రం విడుదలైంది. అయితే కేరళలో మాత్రం విచిత్రంగా మహిళలతో ఈ 'లంచ్‌బెల్' ప్రాజెక్టు నడుస్తోంది. దీనికి కారణం.. మహిళలంతా కలసి కట్టుగా ఈ పని చేయాలనుకోవటమే.

అలా మహిళలతో...

ముంబైలో డబ్బావాలాలు తెల్లక్యాప్‌తో కనిపిస్తారు. అయితే కేరళలోని తిరువనంతపురంలోని 'కుడుంబశ్రీ' అనే మహిళల సమూహం ఆకుపచ్చ టీషర్టు, పింక్ క్యాప్‌తో దర్శనమిస్తారు. 'హోటల్స్‌లోని జంక్‌ఫుడ్ కాకుండా మేం కేరళలో తినే మంచి ఆహారాన్ని సరఫరా చేస్తాం. సాంబార్, ఊరగాయ ఖచ్చితంగా ఉంటాయి. ఆఫీసులు, బ్యాంకులు, సాఫ్ట్‌వేర్ కార్యాలయాలకు లంచ్‌బాక్సులను అందచేస్తారు. 'పాకెట్‌మార్ట్' అనే యాప్‌ను ఆహారం ఆర్డర్ చేసుకోవాలనుకునే వాళ్లు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాస్తవానికి ఉదయం ఏడు గంటలలోపు మాత్రమే బుకింగ్ ఆర్డర్స్‌ను పరిగణలోకి తీసుకుంటారు. మధ్యాహ్నం పన్నెండు లోపలే బాక్సులను కార్యాలయాలకు అందచేస్తారు. శాకాహారం అయితే అరవై రూపాయలు తీసుకుంటారు. మాంసాహారం, చేపల కూర లాంటివి అయితే 99 రూపాయలు తీసుకుంటారు. వెజ్‌థాలీ, బిర్యానీ లాంటి ఆహారాన్ని మెనూలోకి చేర్చారు. మళ్లీ రెండున్నర గంటలనుంచి సాయంత్రం మూడు లోపే ఆబాక్సులను తిరిగి కలెక్ట్ చేసుకుంటారు.



పలుమార్లు కొందరే...

తిరువనంతపురం కుడుంబశ్రీ యూనిట్‌లోనే సెంట్రల్ కిచెన్ ఉంది. హైజీన్ ఫుడ్ తయారు చేస్తారిక్కడ. తాజా ఆహారం, విటమిన్లు, న్యూట్రిన్లు ఉండే పోషకాహారాన్ని డెలివరీ చేస్తారు. ఎకో ఫ్రెండీకోసమే క్యారీ బాక్స్‌లను వాడుతున్నారు. 'ప్రతి రోజూ పదివేల ఆర్డర్లు వస్తాయి. రుచిగా ఉండటం వల్లనే ఈ స్పందన వస్తోంది. ముఖ్యంగా డబ్బాలు చేరవేశాక.. వాటికి కడిగి ఇస్తారు. వాస్తవానికి మేం అలా చెప్పం. అయినా కస్టమర్లు క్లీన్ చేస్తారు. ఇదో ఉద్యమం లాంటిదే. మాకు రిపీట్ కస్టమర్లే ఉంటారు' అంటారు లోకల్ కో ఆర్డినేటర్ రమేష్. భవిష్యత్‌లో కాలుష్యం చేయకుండా ఉండటానికి ఈ- స్కూటర్లు వాడనున్నారు. అంతేనా కొచ్చి లాంటి ఇతర ప్రాంతాల్లో కూడా లంచ్‌బెల్ మోగించటానికి రెడీ అవుతున్నారు.

మీరు మారాలి!

"అన్నీ సరిగ్గానే అనిపిస్తున్నాయి.. కానీ జీవితంలో ఆనందం ఉండటం లేదు.. "- ఇలాంటి డైలాగ్స్ మనకు వినిపిస్తూ ఉంటాయి. ముఖ్యంగా మధ్యవయస్కులైన మహిళలు తమ ప్రాధమ్యాలు తెలియక రకరకాల మానసిక ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు. అలాంటి వారు తమను తాము మార్చుకోవటం తప్ప వేరే మార్గం లేదంటున్నారు మానసిక నిపుణులు.

కొత్త దృష్టి కోణం

చాలా మంది మహిళలకు తమ కుటుంబమే జీవితం. తమ గురించి తాము అస్సలు పట్టించుకోరు. అలాంటి వారు చేయాల్సిన మొదటి పని- ఉరుకుల పరుగుల జీవితం నుంచి కొద్ది సేపు ఆగి- తమ జీవితాన్ని గురించి ఆలోచించుకోవటం. తమను తాము ప్రేమించుకోవటం మొదలుపెట్టినప్పుడు జీవితాన్ని కొత్త దృష్టికోణం బయటకు వస్తుంది.

మానసిక ఆరోగ్యం ముఖ్యం..

చాలా మంది ఒక రొటీన్‌లో పడిపోయి రకరకాల మానసిక సమస్యలకు గురి అవుతూ ఉంటారు. వారికి తాము మానసిక సమస్యలతో బాధపడుతున్నామనే విషయం కూడా తెలియదు. అందువల్ల ఎప్పుడైనా బాగా ఒత్తిడి పెరిగిపోయినప్పుడు- యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి పెట్టాలి. మానసిక ఆరోగ్యంపై దృష్టిని కేంద్రీకరించాలి.

ఆత్మవిశ్వాసం ముఖ్యం

చాలా సార్లు జీవితం మనకు కొత్త పాఠాలు నేర్పుతూ ఉంటుంది. ఆ సమయంలో ఆత్మ విశ్వాసం లేకపోతే డీలా పడిపోతారు. అలా డీలా పడకుండా ఉండాలంటే- ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి. ఆత్మవిశ్వాసం ఒక రోజులో వచ్చేది కాదు. చిన్న లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని.. వాటిని సాధించినప్పుడు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అది నెమ్మదిగా పెరుగుతుంది.

'నో' చెప్పటం నేర్చుకోండి..


కొన్ని సార్లు 'నో' చెప్పటం కూడా ముఖ్యమే! 'వద్దు' అని చెప్పటం రాకపోతే- వచ్చే సమస్యలు అనేకం. ఆ సమస్యలకు ఇతరులు బాధ్యులు కూడా కారు. అందువల్ల 'నో' చెప్పటం కూడా నేర్చుకోవాలి. మన చుట్టు సరిహద్దులు నిర్మించుకోవాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలి..

ఆరోగ్యకరమైన ఆలోచనలతో పాటుగా.. ఆరోగ్యకరమైన జీవనశైలికి కూడా చాలా ముఖ్యం. ఉదయాన్నే లేచి వ్యాయామం లేదా యోగా లేదా ధ్యానం ఏదో ఒకటి చేయాలి. దాని వల్ల రోజంతా ప్రతికూల ఆలోచనలు రాకుండా ఉంటాయి. కొత్త శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది.



ఆన్‌లైన్ షాపింగ్‌తో సోమరులవుతాం



అమెజాన్‌వి మార్కెట్‌ను కొల్లగొట్టే ధరలు

» ఆఫ్‌లైన్ వ్యాపారుల పొట్టగొడుతోంది

» ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి గోయల్

న్యూఢిల్లీ: దేశంలో ఈ-కామర్స్ రంగ వృద్ధి తీరుపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఈ-కామర్స్ సేవల అసాధారణ వృద్ధి సామాజిక విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉందని.. ఇది ఆందోళకరమే తప్ప గర్వపడే విషయం కాదన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ బూమ్‌తో భారత్ సోమరుల దేశంగా మారిపోయే ముప్పుపొంచి ఉందని హెచ్చరించారు. "మార్కెట్లో ఈ-కామర్స్ తన వంతు పాత్ర పోషించాలి. కానీ, ఎలాంటి పాత్ర పోషించాలి, దాన్ని ఎలా క్రమబద్ధీకరించాలనే విషయాన్ని చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది" అన్నారు. ఆన్‌లైన్ కామర్స్ సేవలు సాంప్రదాయికంగా వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారుల పొట్ట గొడుతున్నాయని అన్నారు. క్రమంగా చిరు వ్యాపారులు మార్కెట్ నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. దేశంలో ఆన్‌లైన్ కామర్స్ సేవల వృద్ధి, ఉపాధికల్పనకు సంబంధించి ఓ సంస్థ రూపొందించిన నివేదికను బుధవారం విడుదల చేసిన సందర్భంగా మంత్రి అదే రంగంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం గమనార్హం. అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యాపార తీరు, అనుసరిస్తున్న ధరల విధానంపై ఆయన ప్రధానంగా విరుచుకుపడ్డారు. భారత్‌లో 100 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం రూ.8,390 కోట్లు) పెట్టుబడులు పెడుతున్నట్లు గతంలో చేసిన అమెజాన్ చేసిన ప్రకటనను గోయల్ విమర్శించారు. అమెజాన్ ఇండియా తన నష్టాలను పూడ్చుకునేందుకే ఈ పెట్టుబడులను ప్రకటించిందని.. కంపెనీ ఇన్వెస్ట్‌మెంట్‌తో మన ఆర్థిక వ్యవస్థకు ఒరిగేదేమీ లేదన్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.6,000 కోట్లు నష్టం వచ్చిందంటే, కంపెనీ మార్కెట్‌ను కొల్లగొట్టేందుకు అనుసరిస్తున్న చౌక ధరల వ్యూహమే కారణం అయి ఉంటుందన్న అనుమానం వస్తోందన్నారు.

1.58 కోట్ల ఉద్యోగాలు సృష్టించిన ఆన్‌లైన్ విక్రేతలు

దేశంలో ఆన్‌లైన్ విక్రేతలు 1.58 కోట్ల ఉద్యోగాలు సృష్టించారని, అందులో 35 లక్షల ఉద్యోగులు మహిళలని తాజా నివేదిక వెల్లడించింది. దేశంలోని 17.6 రిటైల్ సంస్థలు ఈ-కామర్స్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నట్లు తెలిపింది. దేశంలో ఉద్యోగాల కల్పన, వినియోగదారుల సంక్షేమంపై ఈ-కామర్స్ రంగ ప్రభావానికి సంబంధించి పహ్లే ఇండియా ఫౌండేషన్ (పీఐఎఫ్) రూపొందించిన సర్వే నివేదికను గోయల్ బుధవారం విడుదల చేశారు. ప్రతి ఈ-కామర్స్ విక్రేత సగటున 9 మందికి ఉపాధి కల్పిస్తుండగా.. అందులో ఇద్దరు మహిళలు. కాగా, ఆఫ్‌లైన్ వర్తకులు సగటున ఆరు మందికి ఉపాధి కల్పిస్తుండగా.. అందులో ఒకరు మహిళా ఉద్యోగి అని నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉద్యోగాల కల్పనకు కీలక రంగాల్లో ఈ-కామర్స్ ఒకటి. ఆఫ్‌లైన్ వర్తకులతో పోలిస్తే, ఆన్‌లైన్ విక్రేతలు సగటున 54 శాతం అధిక ఉద్యోగాలు కల్పిస్తున్నారు. దాదాపు రెట్టింపు మహిళా ఉద్యోగులను నియమించుకున్నారని నివేదిక తెలిపింది.

ఐసీఐసీఐ లొంబార్డ్ నుంచి ‘ఎలివేట్’ పాలసీ

అపరిమిత కవరేజికి అవకాశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఐసీఐసీఐ లొంబార్డ్ ‘ఎలివేట్’ పేరుతో సరికొత్త ఆరోగ్య బీమా పాలసీ ప్రారంభించింది. ఏ వయసు వారైనా ఈ పాలసీలో చేరవచ్చని కంపెనీ హెల్త్ ఏజెన్సీ హెడ్ వివేక్ శ్రీవాస్తవ్ తెలిపారు. పాలసీదారుల వయసు, ఎంచుకునే యాడ్ ఆన్‌ల ఆధారంగా ఈ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పాలసీ ప్రీమియం ఉంటుందన్నారు. ఆరోగ్య బీమా రంగంలో ఇలాంటి వినూత్న పాలసీని తీసుకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ పాలసీ ద్వారా పాలసీదారులకు 20 రకాల తీవ్ర అనారోగ్యాలు, వ్యక్తిగత ప్రమాదాలు, ప్రసూతి, కొత్త శిశువులకూ ఆరోగ్య బీమా, వసతి, ప్రయాణ ప్రయోజనాలు లభిస్తాయి.

ఎలివేట్ పాలసీ ప్రధానాశాలు

- పాలసీదారులు తమ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంత కవరేజినైనా ఎంచుకోవచ్చు.
- యాడ్ ఆన్ ఆఫర్‌ను ఎంచుకోవడం ద్వారా పాలసీ గడువులో ఒకసారికి కవరేజికి మించి అయిన వైద్య ఖర్చుల మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.
- పవర్ బూస్టర్ యాడ్ ఆన్ ద్వారా క్లెయిమ్స్ ఉన్నా, లేక పోయినా కవరేజి మొత్తాన్ని ఏటా 100 శాతం పెంచుకోవచ్చు.
- జంప్ స్టార్ట్ యాడ్ ఆన్ ఆప్షన్ ద్వారా పాలసీ తీసుకునే నాటికి ఉన్న వ్యాధులకూ 31వ రోజు నుంచి కవరేజి.
- రీసెట్ బెనిఫిట్ కింద ఏడాది గడువులో ఎన్నిసార్లయినా అదనపు ప్రీమియం లేకుండా ఎన్నిసార్లు హాస్పిటల్‌లో చేరినా అన్నిసార్లు వైద్య ఖర్చుల క్లెయిమ్ అవకాశం.
- హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న 300కు పైగా హాస్పిటల్స్‌లో చికిత్స చేయించుకునే అవకాశం.

7 లక్షల కార్లు షోరూమ్‌ల్లోనే..



మొత్తం స్టాక్ విలువ రూ.73,000 కోట్లు

ఆటోమొబైల్ డీలర్ల గగ్గోలు

న్యూఢిల్లీ: ప్రయాణికుల వాహనాల అమ్మకాలు నీరసించాయి. దీంతో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా డీలర్ల వద్ద ఏడు లక్షల కార్ల నిల్వలు పేరుకు పోయాయి. వీటి విలువ ఎంత లేదన్నా రూ.73,000 కోట్ల వరకు ఉంటుందని ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) తెలిపింది. గత నెల ప్రారంభంలో 65-67 రోజుల అమ్మకాలకు సరిపడా నిల్వలు ఉంటే, ఇప్పుడది 70-75 రోజులకు చేరింది. కంపెనీలు ఎడాపెడా ఉత్పత్తి పెంచేయడం, అధిక వడ్డీరేట్లు ఇందుకు ప్రధాన కారణమంటున్నారు.

డీలర్లు లబోదిబో: సాధారణంగా డీలర్ల వద్ద కార్ల నిల్వలు నెల రోజులకు సరిపడా ఉంటాయి. ఇప్పుడది 70-75 రోజులకు పెరిగి పోయింది. దీంతో డీలర్లు ఆర్థికంగా చితికి పోతున్నారు. వర్కింగ్ కాపిటల్ అవసరాలు పెరిగిపోయి వడ్డీల భారం పెరిగి పోతోంది. ఈ పరిణామంతో కొంత మంది డీలర్లు దివాలా తీసే ప్రమాదం పొంచి ఉందని ఫాడా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కార్ల కంపెనీలు రిటైల్ అమ్మకాలకు అనుగుణంగా తమ ఉత్పత్తి వ్యూహం మార్చుకుని సరఫరాలు తగ్గిస్తే, ఈ పరిస్థితి నుంచి కొంత వరకు బయట పడవచ్చని డీలర్లు చెబుతున్నారు.

కంపెనీలే ఆదుకోవాలి: ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు కార్ల కంపెనీలే తమను ఆదుకోవాలని డీలర్లు కోరుతున్నారు. నెల రోజులకు మించి ఉండే నిల్వల నిర్వహణకు అయ్యే వర్కింగ్ కాపిటల్ వడ్డీ ఖర్చులైనా కంపెనీలు భరించాలని కోరుతున్నారు. లేకపోతే ప్రస్తుత కష్టాల నుంచి బయట పడడం డీలర్లకు కష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు పేరుకుపోయిన వాహన నిల్వల అమ్మకాల కోసం కంపెనీలు ప్రత్యేక పథకాలు, డిస్కౌంట్లు, ఆఫర్లు ప్రవేశ పెట్టాలని డీలర్లు కోరుతున్నారు.

ఆటుపోట్లు మామూలే: డీలర్లు ఇన్ని కష్టాల్లో ఉన్నా కార్ల కంపెనీల నుంచి పెద్దగా స్పందన లేదు. నిల్వలు పేరుకుపోవడం పెద్దగా ఆందోళన చెందాల్సిన అంశం కాదని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) తెలిపింది. ఇటువంటి ఆటోపోట్లు ఏర్పడుతూనే ఉంటాయని తేలికగా తీసిపారేసింది. అయితే డీలర్లు ఆర్థికంగా బాగుండడం, కంపెనీలకే మంచిదని మాత్రం అంగీకరించింది. డీలర్ల వద్ద పేరుకు పోయిన వాహనాల నిల్వలను వదిలించేందుకు ఆయా కంపెనీలే బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవడం మంచిదని సియామ్ తెలిపింది.

పేటీఎం టికెటింగ్ వ్యాపారం జొమాటో చేతికి

డీల్ విలువ రూ. 2,048 కోట్లు

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపు సేవల యాప్ పేటీఎం యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ భారీ డీల్ కుదుర్చుకుంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోకు తన ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని రూ.2,048 కోట్లకు విక్రయిస్తున్నట్లు వన్97 కమ్యూనికేషన్స్ బుధవారం ప్రకటించింది. అంటే, పేటీఎం యాప్‌లో అందుబాటులో ఉండే మూవీస్, స్పోర్ట్స్, ప్రముఖ ఈవెంట్ల టికెట్ బుకింగ్ సేవల వ్యాపారం త్వరలో జొమాటో చేతుల్లోకి వెళ్లనుంది. టికెటింగ్ సేవల బదిలీకి 12 నెలల వరకు సమయం పట్టవచ్చని వన్97 వెల్లడించింది. ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారం ద్వారా పేటీఎంకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.297 కోట్ల ఆదాయం, రూ.29 కోట్ల స్థూల లాభం సమకూరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73200 ▲	67,100 ▲	92,000 ▲
ముంబై	71,720 ▼	65,700 ▼	84,910 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

సెన్సెక్స్ 102 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ సూచీలు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 102.44 పాయింట్ల పెరుగుదలతో 80,905.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 71.35 పాయింట్ల వృద్ధితో 24,770.20 వద్ద క్లోజైంది. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడంతోపాటు గ్లోబల్ మార్కెట్లో అప్రమత్త ధోరణి మన మార్కెట్లో లాభాలను పరిమితం చేశాయి.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 83.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో ఒడుదుడుకులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణం.
- నిర్మాణ పరిష్కారాలందించే ఇంటరార్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ రూ.600 కోట్ల ఇష్యూకు ఏకంగా 93.46 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్‌కు ఎన్‌సీఎల్‌టీ ఓకే: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్‌కు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై బెంచ్ ఆమోదం తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి షేర్లను డీలిస్ట్ చేసి, అనంతరం ఐసీఐసీఐ బ్యాంక్‌కు పూర్తి అనుబంధ సంస్థగా మారనున్నట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ 2023 జూన్‌లో ప్రకటించింది. డీలిస్టింగ్‌లో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్‌హోల్డర్లకు ప్రతి 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను కేటాయించనున్నారు.

ఫ్రెషర్స్‌కు హ్యాపీడేస్!



72 శాతం యాజమాన్యాలు సై

టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక

ముంబై: జాబ్ మార్కెట్ క్రమంగా మెరుగుపడుతోంది. అనుభజ్ఞులతో పాటు ఫ్రెషర్లకూ ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఫ్రెషర్లను నియమించుకునే ఆలోచనలో ఉన్నట్లు ఓ సర్వేలో పాల్గొన్న 72 శాతం కంపెనీ యాజమాన్యాలు వెల్లడించాయి. ఈ ప్రథమార్థంతో పోలిస్తే ఫ్రెషర్ల హైరింగ్ యోచనలో ఉన్న కంపెనీల సంఖ్య మరో 4 శాతం పెరగగా.. గత ఏడాది ద్వితీయార్థంతో పోలిస్తే 7 శాతం పెరిగింది. టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ బుధవారం విడుదల చేసిన ‘కేరీర్ అవుట్‌లుక్ రిపోర్ట్ హెచ్‌2' లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 603 కంపెనీల ప్రతినిధులను సర్వే చేసినట్లు టీమ్‌లీజ్ తెలిపింది. ఫ్రెషర్ల నియామకాలు పెరగనుండటం మంచి సంకేతం. భవిష్యత్‌పై కంపెనీ యాజమాన్యాల్లో పెరుగుతున్న విశ్వాసానికిదే నిదర్శనం. గ్రాడ్యుయేట్లు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది సరైన సమయమని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకులు, సీఈఓ శంతను రూజ్ అన్నారు. ఉద్యోగాల్లో సాంకేతికత, డిజిటల్ నైపుణ్యాలు ముఖ్యభూమిక పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టనున్న గ్రాడ్యుయేట్లు అనుభవపూర్వకమైన విద్యాభ్యాసం ద్వారా అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సర్వేలో పాల్గొన్న 70 శాతం యాజమాన్యాలు సూచించగా.. విద్యా సంస్థలు ఇండస్ట్రీతో భాగస్వామ్యం ద్వారా కంపెనీలకు అవసరమైన నైపుణ్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని 62 శాతం యాజమాన్యాలు సలహా ఇచ్చాయి.

స్పోర్ట్స్

వినేశ్.. పంట పండింది!



- ఒక్కసారిగా పెరిగిన బ్రాండ్ వాల్యూ
- క్యూ కడుతున్న కంపెనీలు
- నీరజ్, భాకర్‌కు కూడా భారీ డిమాండ్

న్యూఢిల్లీ: ఒలింపిక్ పతకం సాధించాలన్న రెజ్లర్ వినేశ్ ఫొగట్ కల చెదిరి ఉండొచ్చు. కానీ, ఆమె పాపులారిటీ అమాంతం పెరిగింది. దీంతో ఫొగట్‌ను తమ ఉత్పత్తుల ప్రచారకర్తగా నియమించుకోవడానికి పలు కంపెనీలు క్యూ కడుతున్నాయి. అలాగే పారిస్‌లో పతకాలు సాధించిన మరికొందరు అథ్లెట్ల బ్రాండ్ వ్యాల్యూ కూడా భారీగా పెరిగింది. ప్యాకేజింగ్ ఫుడ్, హెల్త్, న్యూట్రిషన్, జ్యుయెలరీ, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ ఇలా పలు రంగాలకు చెందిన కంపెనీలు అథ్లెట్లతో ఒప్పందాలు చేసుకోవడానికి పోటీపడుతున్నాయి. పారిస్‌కు ముందు ఫొగట్ ఎండార్స్‌మెంట్ ఫీజు రూ. 25 లక్షలు ఉంటే.. ఇప్పుడు రూ. 75 లక్షల నుంచి కోటి రూపాయలకు పెరిగిందని ఓ ఎగ్జిక్యూటివ్ చెప్పాడు. పతకం నెగ్గకపోయినా.. ఆమె చూపిన ధైర్యం, హుందాతనం అందరి హృదయాలను గెలుచుకొందన్నాడు. విశ్వక్రీడల్లో 50 కిలోల విభాగం ఫైనల్ ముందు 100 గ్రాములు ఎక్కువ బరువు ఉందనే కారణంతో వినేశ్‌పై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. నైకీ, కంట్రీ డిలైట్‌తో ఫొగట్ ఒలింపిక్స్‌కు ముందే అగ్రిమెంట్ చేసుకొంది. ఇక, రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, రెండు కాంస్యాలతో చరిత్ర సృష్టించిన షూటర్ మను భాకర్‌కు కూడా భారీ డిమాండ్ నెలకొంది. చోప్రా బ్రాండ్ వాల్యూ 30 నుంచి 40 శాతం దాకా పెరిగి.. సుమారు రూ. 330 కోట్లకు చేరుకొందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. భారత్‌లో క్రికెటర్ల తర్వాత చోప్రాకే ఎక్కువ పాపులారిటీ అనడంలో సందేహం లేదు. నీరజ్ ఎండార్స్‌మెంట్ ఫీజు గతంలో రూ. 3 కోట్లు ఉంటే.. మెగా క్రీడల తర్వాత రూ. 4 నుంచి 4.5 కోట్లకు పెరిగిందట. మరోవైపు యూత్‌లో సూపర్ క్రేజ్ తెచ్చుకొన్న భాకర్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకొనేందుకు కంపెనీలు పెద్ద మొత్తంలో ఒప్పందాలు చేసుకోవడానికి సిద్ధమయ్యాయి. గతంలో ప్రకటనల కోసం ఏడాదికి రూ. 25 లక్షలు మను తీసుకునేది. అయితే, అదిప్పుడు ఏకంగా ఆరు రెట్లు పెరిగి రూ. 1.5 కోట్లకు చేరిందని టాక్.

పారిస్ పారాలింపిక్స్

లక్ష్యం 12



సుమిత్ అంటిల్

అథ్లెటిక్స్‌లో పతకాలపై భారీ ఆశలు

న్యూఢిల్లీ: పారిస్ పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 12 పతకాలు గెలవాలని మనోళ్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈమేరకు స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్‌తో కూడిన 16 మంది భారత అథ్లెటిక్స్ తొలి బృందం బుధవారం పారిస్ పయనమైంది. ఈనెల 28న క్రీడలు ప్రారంభం కానున్నా..పారిస్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు మన ఆటగాళ్లు ముందుగానే అక్కడకు బయల్దేరారు. పారాలింపిక్స్‌లో అథ్లెటిక్ పోటీలు ఈనెల 30 నుంచి వచ్చేనెల ఎనిమిది వరకు స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో నిర్వహిస్తారు. ‘పారిస్‌లోని నెల్సన్ మండేలా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సుమిత్ తదితర అథ్లెట్లు సాధన చేస్తారు' అని పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ సత్యానారాయణ తెలిపారు. ‘అథ్లెటిక్స్‌లో కనీసం ఐదు స్వర్ణాలు సహా మొత్తం 12 పతకాలు గెలుపొందగలమని భావిస్తున్నాం. అదే జరిగితే పారాలింపిక్స్‌లో మనది అత్యుత్తమ ప్రదర్శన అవుతుంది' అని సత్యనారాయణ చెప్పారు. గత మేలో జపాన్‌లోని కోబెలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఆరు స్వర్ణ, ఐదు రజత, ఆరు కాంస్యాలతో కలిసి మొత్తం 17 పతకాలతో పట్టికలో ఆరో స్థానంలో నిలవడం విశేషం. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో అద్భుత ప్రదర్శన పారాలింపిక్స్‌లో మనోళ్ల ప్రదర్శనపై భారీ అంచనాలు పెంచింది. ఇక టోక్యో పారాలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో భారత్ ఓవరాల్‌గా 19 పతకాలు (ఐదు స్వర్ణ, ఎనిమిది రజత, ఆరు కాంస్యాలు) సొంతం చేసుకుంది. ఈసారి పారాలింపిక్స్‌కు 84 మందితో కూడిన భారీ బృందాన్ని బరిలో దించుతోంది. 12 క్రీడాంశాల్లో మనోళ్లు తలపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో 38 మంది అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పారిస్‌లో ఓవరాల్‌గా కనీసం 25 పతకాలు సాధించగలమని భారత పారాలింపిక్స్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝూరియా అంచనా వేస్తున్నాడు.

టైటిల్‌పై గురి

ఈసారి పారాలింపిక్స్‌లో జావెలిన్ త్రోయర్, డిఫెండింగ్ చాంపియన్ సుమిత్ అంటిల్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. కొన్నాళ్లుగా నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న 26 ఏళ్ల సుమిత్.. పారిస్‌లో కచ్చితంగా స్వర్ణం గెలవడన్న అంచనాలున్నాయి. జావెలిన్ త్రో ఎఫ్64 విభాగంలో పోటీపడుతున్న సుమిత్.. 2021 టోక్యో పారాలింపిక్స్‌లో జావెలిన్‌ను 68.55 మీటర్లు త్రో చేసి రికార్డు ప్రదర్శనతో స్వర్ణం సాధించాడు. ఆ మరుసటి ఏడాది హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా పారాక్రీడల్లో జావెలిన్‌ను ఏకంగా 73.29 మీటర్లు విసిరి విజేతగా నిలిచిన సుమిత్.. సరికొత్త ప్రపంచ రికార్డుతో తనప్రదర్శనను మరింత మెరుగుపరచుకున్నాడు. నిరుడు పారిస్‌లో నిర్వహించిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ సత్తాచాటుతూ 70.83 మీటర్లతో సుమిత్ బంగారు పతకం కొల్లగొట్టాడు. ఇక.. ఈ ఏడాది జపాన్‌లోని కోబెలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 69.50 మీటర్లకే పరిమితమైనా, టైటిల్ నిలబెట్టుకొని తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. అయితే, పారిస్ పారాలింపిక్స్‌లో కచ్చితంగా 75 మీటర్ల ప్రదర్శనతో సరికొత్త రికార్డు నెలకొల్పగలడన్న ధీమాను సుమిత్ వ్యక్తం చేస్తున్నాడు.

ఫేవరెట్ నీరజ్

● నదీమ్ దూరం ● డైమండ్ లీగ్ మీట్ నేడు

రాత్రి 12.20 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో



లాసన్నే: పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. మరోసారి అలరించడానికి సిద్ధమయ్యాడు. ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ దూరం కావడంతో.. గురువారం రాత్రి జరిగే డైమండ్ లీగ్ (డీఎల్) లాసన్నే మీట్‌లో చోప్రా ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. పాకిస్థాన్ త్రోయర్ నదీమ్‌కు ఒలింపిక్ స్వర్ణం కోల్పోయిన చోప్రా.. గాయంతో ఇబ్బంది పడుతుండడంతో ఈ మీట్‌లో పాల్గొంటాడా? లేదా? అనే సందేహాలు రేకెత్తాయి. అయితే, గజ్జల్లో నొప్పితో బాధపడుతున్నా, మరోసారి డీఎల్ టైటిల్ నెగ్గాలనే కసితో ఉన్న చోప్రా.. తాను బరిలోకి దిగనున్నట్టు స్పష్టం చేశాడు. 2022లో నీరజ్ డైమండ్ లీగ్ చాంపియన్‌గా నిలిచాడు. కానీ, గతేడాది జాకబ్ వాల్డెజ్ (చెక్) విజేతగా నిలవగా.. చోప్రా రెండోస్థానానికే పరిమితమయ్యాడు. వచ్చేనెల 14న బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో సీజన్ ఫైనల్ డీఎల్ జరగనుంది. దీనికి అర్హత సాధించాలంటే డీఎల్ సిరీస్‌ల్లో టాప్-6లో నిలవడం తప్పనిసరి. ప్రస్తుతం చోప్రా మొత్తం ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. గత మేలో దోహాలో జరిగిన మీట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఇక, ఒలింపిక్స్‌లో తొలి ఆరుస్థానాల్లో నిలిచిన ఐదుగురు లాసన్నేలో కూడా పోటీపడుతుండడంతో నీరజ్‌కు గట్టిసవాలే ఎదురుకానుంది. విశ్వక్రీడల్లో 92.97 మీటర్ల రికార్డు త్రోతో అందరినీ అవాక్కయ్యేలా చేసిన నదీమ్ ఒక్కడే ఈ మీట్‌కు గైర్హాజరు కానున్నాడు. ఈ సీజన్‌లో ఒక్క ఈవెంట్‌లోనే పాల్గొన్న అర్షద్.. ఐదు పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంప్ వాల్డెజ్ టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉండగా.. రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) కూడా సత్తా చాటాలనుకొంటున్నాడు. అయితే, వీరందరిలో నీరజ్ నిలకడైన ప్రదర్శనతో సాగుతుండడంతో.. టాప్‌లో నిలవగలడన్న అంచనాలు భారీగా ఉన్నాయి.

పాక్ 158/4

బంగ్లాతో తొలి టెస్ట్

రావల్పిండి: సయిమ్ అయూబ్ (56), సౌద్ షకీల్ (57 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. బంగ్లాదేశ్‌తో బుధవారం మొదలైన తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ కోలుకొంది. వర్షం కారణంగా ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌లో బంగ్లా బౌలర్ల దెబ్బకు ఒక దశలో పాక్ 16/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, ఓపెనర్ అయూబ్, షకీల్ నాలుగో వికెట్‌కు 98 పరుగులు జోడించడంతో.. పాక్ తొలిరోజు ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో 158/4 స్కోరు చేసింది. షకీల్‌తోపాటు రిజ్వాన్ (24) క్రీజులో ఉన్నాడు. షోరిఫుల్, హసన్ మహమూద్ చెరో 2 వికెట్లు తీశారు.

మైదానంలో మూత్ర విసర్జన!

ఫుట్‌బాలర్‌కు రెడ్‌కార్డ్

న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో ఉత్కంఠభరిత క్షణాల్లో ఆటగాళ్లు సహనం కోల్పోయి ప్రత్యర్థులపట్ల మొరటుగా ప్రవర్తించడం కద్దు. ఈక్రమంలో వారు రెడ్‌కార్డ్ శిక్షకు గురవుతారు. కానీ అందుకు భిన్నంగా జరిగింది ఓ సాకర్ మ్యాచ్‌లో. ఓ ఆటగాడు అనుచితంగా ప్రవర్తించి మైదానం వీడాడు. కోపా పెరూ కప్ డివిజన్ టోర్నీలో అట్లెటికో అవజున్-కంటోర్సిలో ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్..ఇంజ్యూరీ టైమ్‌కోసం 71వ నిమిషంలో ఆగింది. ఆ సమయంలో అవజున్ స్ట్రయికర్ సెబాస్టియన్ మునోజ్.. ఫ్యాన్స్ ఎవరూ లేని ఓవైపు వెళ్లి మైదానంలో మూత్రవిసర్జన చేశాడు. దాంతో అతడికి రెఫరీ రెడ్‌కార్డు చూపి బయటకు పంపాడు.

సాయినాథ్‌కు కాంస్యం

అమ్మాన్ (జోర్డాన్): అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాడు పర్దీ సాయినాథ్ (51 కిలోలు) కాంస్యం సాధించాడు. రెపిచేజ్ రౌండ్ ద్వారా పతక పోరులో నిలిచిన సాయినాథ్ 3-1తో యరాసిల్ ముస్సాన్ (కజకిస్తాన్)ను ఓడించాడు. అంతకుముందు రోనక్ దహియా (110 కి) కాంస్యం నెగ్గాడు. మహిళల్లో అదితి కుమారి (43 కి), నేహ (57 కి), పుల్కిత్ (65 కి) సెమీస్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి ఫైనల్స్‌లో అడుగుపెట్టారు.

గుకేష్‌కు మరో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): భారత గ్రాండ్ మాస్టర్ గుకేష్ వరుసగా రెండో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. సింక్యుఫీల్డ్ కప్ రెండో రౌండ్‌లో ఇయాన్ నెపోమినియాచి (రష్యా)తో జరిగిన గేమ్‌లో గుకేష్ 60 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. మాక్సిమ్ వచైర్ లగ్రావె (ఫ్రాన్స్)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు.

శ్రీజేష్‌కు రూ. 2 కోట్లు

» కేరళ ప్రభుత్వ నజరానా



తిరువనంతపురం: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత హాకీ జట్టు స్టార్ గోల్‌కీపర్ శ్రీజేష్‌కు అతని సొంత రాష్ట్రం కేరళ భారీ నజరానాను ప్రకటించింది. శ్రీజేష్‌కు రూ. 2 కోట్లు నగదు ప్రోత్సాహకంగా ఇవ్వాలని బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ణయం తీసుకున్నారు.

‘జపాన్’ ప్రీక్వార్టర్స్‌కు సతీష్

యొకొహామ (జపాన్): భారత యువ షట్లర్ సతీష్‌కుమార్ కరుణాకరణ్ జపాన్ ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఆరంభరౌండ్లో సతీష్ 6-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ప్రత్యర్థి ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. క్వార్టర్స్ బెర్త్ కోసం కంటాఫాన్ వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్) సతీష్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

రోహిత్, ద్రవిడ్‌లకు సియెట్ అవార్డులు







న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ సియెట్ క్రికెట్ అవార్డులను అందుకున్నారు. ‘ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' పురస్కారం రోహిత్‌కు, ‘జీవిత సాఫల్య' అవార్డును ద్రవిడ్‌కు ప్రదానం చేశారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ‘ఉత్తమ వన్డే క్రికెటర్'గా ఎంపికయ్యాడు. ‘వన్డే ఉత్తమ బౌలర్' అవార్డు షమిని, ‘ఉత్తమ టెస్ట్ బ్యాటర్' పురస్కారం యశస్వీ జైస్వాల్‌ను వరించాయి. అశ్విన్‌కు ‘ఉత్తమ టెస్ట్ బౌలర్' అవార్డు దక్కింది. ‘ఉత్తమ క్రీడా పరిపాలకు'డిగా జై షా ఎంపికయ్యాడు. భారత మహిళల జట్టు వైస్‌కెప్టెన్ మంధాన ‘ఉత్తమ భారత బ్యాటర్'గా, దీప్తిశర్మ ‘ఉత్తమ భారత బౌలర్'గా అవార్డులు స్వీకరించారు. టీ20లలో అత్యధిక మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించినందుకు హర్మన్‌ప్రీత్‌కు, టెస్ట్‌ల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన షఫాలీ వర్మకు, కోల్‌కతా నైట్ రైడర్స్ సారథి శ్రేయాస్ ‘అత్యుత్తమ కెప్టెన్'గా మెమొంటోలు అందజేశారు.

నేడు అచ్యుతాపురానికి సీఎం చంద్రబాబు

- ఫార్మా కంపెనీ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

అమరావతి/విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఆయన అచ్యుతాపురానికి వెళ్లి ప్రమాదం జరిగిన ఫార్మా కంపెనీని సందర్శించనున్నారు. ఉదయం 10.30 గంటల తరువాత విజయవాడ నుంచి విమానంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడనుంచి హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌కు వెళతారు. అనంతరం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రి, మరికొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని, అక్కడినుంచి విశాఖ చేరుకుని కేజీహెచ్ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించనున్నారు. కాగా, ఈ ఘటనపై ఆరోగ్యశాఖ కార్యదర్శి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఫ్యాక్టరీస్ డైరెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, బాయిలర్స్ డైరెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌తో ఆయన బుధవారం అనేకసార్లు మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అవసరమైయితే క్షతగాత్రులను ఎయిర్ అంబులెన్స్ ద్వారా విశాఖ లేదా హైదరాబాద్ తరలించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

గవర్నర్, పవన్, మంత్రి భరత్ దిగ్భ్రాంతి

అచ్యుతాపురం ఫార్మా సెజ్ ప్రమాద ఘటనపై గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులు త్వరగా కోలుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ ఆర్థిక, వైద్య సహాయం అందించాలని పవన్ సూచించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు.

ఫార్మా బాధిత కుటుంబాలకు 'ఎల్జీ పరిహారం' ఇవ్వాలి: జగన్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): 'అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు నా ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్ బాధిత కుటుంబాలకు అందజేసినట్లుగా రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలి' అని వైసీపీ అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎక్స్ వేదికగా సెజ్ ప్రమాదంపై స్పందించారు. 'ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు కారణంగా పలువురు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మరణించినవారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడి చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా ఉత్తమ వైద్యం అందించాలి. వారు కోలుకునేంత వరకూ ఆర్థిక సహాయం చేయాలి. ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి. మళ్లీ ఇలాంటివి జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి' అని జగన్ కూటమి ప్రభుత్వానికి సూచించారు.

కోటి పరిహారం ఇచ్చింది కంపెనీ.. జగన్ కాదు

'ఎల్జీ బాధితులకు' ఇచ్చినట్లుగా నష్టపరిహారం ఇవ్వాలని జగన్ డిమాండ్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమయింది. నాడు వైసీపీ ప్రభుత్వం హయాంలో విశాఖలోని ఎల్జీ పాలిమర్స్‌లో జరిగిన ప్రమాదంలో ఘటనాస్థలంలో మృతిచెందిన 9 మంది కుటుంబాలకే రూ.కోటి పరిహారాన్ని ఇచ్చారు. ఆ మొత్తం ఎల్జీ కంపెనీ తన నిధుల నుంచే సమకూర్చింది. ప్రభుత్వం ఇచ్చింది రూపాయి కూడా లేదు. అదే ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ తరువాత ముగ్గురు మరణించారు. వారి కుటుంబాలకు పైసా పరిహారం అందలేదు. ప్రమాదం జరిగిన తరువాత ఎల్జీ యాజమాన్యంతో ఏకాంతంగా సమావేశమైన జగన్.. పాలిమర్స్‌పై లోతైన విచారణ జరపకుండా చూసీ చూడనట్లుగా వ్యవహరించారు.


అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన ఎసెన్షియా కర్మాగారం


కర్మాగారంలో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

చేటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, అధికార వర్గాల కథనం ప్రకారం.. ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఇంటర్మీడియట్ కెమికల్స్ ఉత్పత్తి చేస్తారు. 40 ఎకరాల్లో విస్తరించిన ఈ కర్మాగారంలో మొత్తం 381 మంది ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తారు. బుధవారం మధ్యాహ్నం తొలి షిఫ్టు కార్మికులు విధులు ముగించుకుని వెళ్తుండగా... దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కొన్ని నిమిషాల్లోనే భారీ పేలుడు సంభవించింది. దీని తీవ్రతకు శ్లాబ్, గోడ కుప్పకూలిపోయాయి. ఒకదాని వెంట మరొకటిగా జరిగిన ఘటనలతో కార్మికులు కకావికలమయ్యారు. పేలుడు ధాటికి కొందరి శరీరాలు తుత్తునియలయ్యాయి. శ్లాబ్ శిథిలాల కింద కొందరు నలిగిపోయారు. చుట్టూ దట్టమైన పొగ అలుముకోవడంతో... ఎటుపోతున్నామో తెలియకుండా పరుగులు తీస్తూ గోడలకు తగిలి, మెట్లపై నుంచి కొందరు కింద పడిపోయారు. ఈ మూడు కారణాలతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. 'ఎసెన్షియా'లో ఒక్కో షిఫ్టులో 80 మంది కార్మికులు పని చేస్తారు. సరిగ్గా ఏ-షిఫ్టు సిబ్బంది బయటికి వెళ్తూ... బి-షిఫ్టు కార్మికులు లోపలికి వెళ్లేటప్పుడే ఈ ఘోరం జరిగింది. మరో ఐదు నిమిషాలు ఉంటే తొలి షిఫ్టు కార్మికులు మొత్తం బయటికి వచ్చేవాళ్లు. రెండో షిఫ్టు సిబ్బంది వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి వెళ్తుండగా ఈ పేలుడు జరిగింది. దీంతో బయట ఉన్న కార్మికులు పరుగులు తీశారు. కొందరు ధైర్యం చేసి కర్మాగారంలోకి ప్రవేశించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురంలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఘాటైన వాసనలతో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది.

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

ప్రమాదం మధ్యాహ్నం జరిగినా దట్టమైన పొగలు కమ్ముకోవడం, వాటిని పీల్చినవారు అస్వస్థతకు గురి కావడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తప్ప ఇంకెవరూ లోపలకు వెళ్లలేకపోయారు. రాత్రి చీకటి పడేంత వరకు గాయపడిన వారిని అంబులెన్సుల్లో తరలిస్తూనే ఉన్నారు. ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగిన తర్వాతే సహాయ చర్యలు ఊపందుకున్నాయి. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. సాయంత్రం 5గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి.

ఆవిరి మేఘాలతో 'అపాయం..'

గ్యాస్ లీకైనపుడు అది గాలిలో కలిసిపోతే ఏ ప్రమాదం ఉండదు. అదే గ్యాస్ లీకై తలుపులు మూసిన గదిలోనే ఉంటే.. అవి మేఘంగా మారుతుంది. చిన్న 'స్పార్క్'తో భారీ పేలుడు సంభవిస్తుంది. ఎసెన్షియాలో జరిగిన ప్రమాదం కూడా అలాంటిదే. 'మిథైల్ టెరిషరీ బుయటైల్ ఈథర్' గాలిలో కలిసిన వెంటనే దట్టమైన ఆవిరి మేఘాలుగా మారిపోతుంది. భవనం మొత్తం క్లోజ్‌గా ఉండటంతో.. ఇది పొగలా అలుముకుంది. ఎలక్ట్రికల్ ప్యానళ్ల నుంచి భవనంలో అన్ని మూలలకు విస్తరించింది. మంటలు చెలరేగిన వెంటనే అప్పటికే పైపుల్లో ఉన్న ఆవిరి మేఘం విచ్ఛిన్నమవడంతో రియాక్టర్ పేలిందని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమికంగా నివేదించినట్లు తెలిసింది.

మృతుల్లో ఏజీఎంలు, ట్రైనీలు

ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన వారిలో బుధవారం అర్ధరాత్రి సమయానికి 17 మందిని గుర్తించారు. మృతులు వీరే.. నీలాపు రామిరెడ్డి (ఏజీఎం/అసోసియేట్ డైరెక్టర్), ప్రశాంత్ హంస (సీనియర్ ఎగ్జిక్యూటివ్), మహంతి నారాయణ (టీమ్ లీడర్), కొప్పర్తి గణేశ్ కుమార్ (సీనియర్ ఎగ్జిక్యూటివ్), చల్లపల్లి హారిక (ట్రైనీ ఇంజనీర్), పైడి రాజశేఖర్ (ట్రైనీ ప్రాసెస్ ఇంజనీర్), మరిశెట్టి సతీశ్ (సీనియర్ ఎగ్జిక్యూటివ్), మొండి నాగబాబు (అసిస్టెంట్ మేనేజర్), నాగేశ్వర రామచంద్రరావు (టీమ్ లీడర్), వేగి సన్యాసినాయుడు (హౌస్ కీపింగ్ బాయ్), యల్లబిల్లి చిన్నారావు (పెయింటర్), జవ్వాది పార్థసారధి (ఫిట్టర్), పపూడి మోహన్ దుర్గా ప్రసాద్ (హౌస్ కీపింగ్), బమ్మిడి ఆనందరావు (అసిస్టెంట్ మేనేజర్), మర్ని సురేందర్ (అసిస్టెంట్ మేనేజర్), పూసర్ల వెంకటసాయి (సీనియర్ ఎగ్జిక్యూటివ్), జవ్వాది చిరంజీవి (ఫిట్టర్).

అసలేం జరిగింది..

ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ ప్రమాదానికి 'వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్' కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. థర్డ్‌ఫ్లోర్‌లో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఒక ట్యాంకర్‌లోకి 'మిథైల్ టెరిషరీ బుయటైల్ ఈథర్' అనే సాల్వెంట్ (ద్రవ రసాయనం) పంపిస్తున్నారు. ఈ క్రమంలో పైపులు లీకై.. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని విద్యుత్ ప్యానల్స్‌పై రసాయనం పడింది. దీంతో రసాయనం ఆవిరై... దట్టమైన మేఘాలు ఏర్పడ్డాయి. ఆ గది మొత్తం అలుముకున్నాయి. ఆ తర్వాత ఎలక్ట్రికల్ ప్యానల్స్ ఏసీ డక్టుల ద్వారా భవనమంతా రసాయన మేఘాలు వ్యాపించాయి. సాల్వెంట్ పడిన ఎలక్ట్రిక్ ప్యానల్స్ వద్ద నిప్పు రాజుకుంది. క్షణాల్లోనే దట్టమైన పొగలా అలుముకున్న రసాయన ఆవిరి వల్ల భారీ పేలుడు జరిగింది. దీని తీవ్రతకు గ్రౌండ్‌ఫ్లోర్ శ్లాబ్, గోడ కుప్పకూలాయి. మూడో ఫ్లోర్‌లో ఉన్న రియాక్టర్ కూడా పేలిపోయినట్లు తెలుస్తోంది.

అనుభవజ్ఞులు లేకనే...

ఎసెన్షియా కంపెనీలో అనుభవజ్ఞులైన నిపుణులు లేకపోవడమే భారీ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. కర్మాగారంలో జూనియర్లు, ఇటీవల డిగ్రీ పూర్తిచేసిన గ్రాడ్యుయేట్లు పనిచేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. కర్మాగారంలో మూడో ఫ్లోర్‌లోని రియాక్టర్ నుంచి కింద ఫ్లోర్‌లోకి సాల్వెంట్ తరలించే క్రమంలో అది లీకైన విషయాన్ని అనుభవంలేని సాంకేతిక నిపుణులు గుర్తించలేకపోయారని అంచనాకు వచ్చారు. అదే సీనియర్లు అయితే లీకులను వెంటనే అరికట్టడం, వర్క్ స్పాట్‌లో ప్రధానంగా ఎలక్ట్రికల్ ప్యానళ్లు ఉన్న గదిలో ఆవిరి మేఘాన్ని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకునేవారని అంటున్నారు. ఇటీవల వసంత కెమికల్స్‌లో ప్రమాదం సంభవించినపుడు కొంత నష్టం జరిగినా సీనియర్లు ఉండడంతో అక్కడ భారీ ముప్పు తప్పిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.


అచ్యుతాపురంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


ప్రమాదంలో మృతిచెందిన పూడి మోహన్‌దుర్గాప్రసాద్, సీహెచ్ హారిక


అంబులెన్స్‌లో మృతదేహం


ఛిద్రమైన మృతదేహం


పేలుడు తీవ్రతకు సమీపంలోని చెట్టుపై పడిన ఓ కార్మికుడి శరీర భాగాలు

సోదరులకు ప్రేమతో రాఖీ కట్టి..



సర్పవరం జంక్షన్: అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదంలో కాకినాడ నగరానికి చెందిన కుమారి చల్లపల్లి హారిక(22) మృతి చెందింది. కడపలో విద్యాభ్యాసం పూర్తిచేసిన హారిక ఏడాది క్రితమే ఈ కంపెనీలో చేరింది. రాఖీ పండుగ సందర్భంగా పెదనాన్న కుమారులకు రాఖీ కట్టేందుకు రెండు రోజులు సెలవు పెట్టి సోమవారం కాకినాడ వచ్చింది. వారికి రాఖీ కట్టి ఆనందంగా గడిపింది. మరో రెండు రోజులు ఉండాలని తల్లి అన్నపూర్ణ, సోదరులు ఎంత ప్రాధేయపడినా వినకుండా బుధవారం తెల్లవారుజామున కాకినాడ నుంచి బయల్దేరి వెళ్లింది. విధి నిర్వహణలో ఉండగా రియాక్టర్ పేలిన దుర్ఘటనలో హారిక మృతి చెందిందన్న వార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రాఖీ కట్టేందుకు వచ్చి, సోదరులతో ఆనందంగా గడిపి బుధవారం ఉదయమే వెళ్లిన తమ కుమార్తె ఇలా అకాల మరణం చెందిందన్న వార్త విని ఆమె తల్లి కుప్పకూలిపోయింది.

ప్రమాదానికి బాధ్యులెవరు?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా.. సేఫ్టీ ఆడిట్ చేపట్టాలని ఆదేశం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. భారీ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది తీవ్రంగా గాయపడటం కలచి వేసిందని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులెవరని ఆరా తీశారు. ప్రమాద ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, క్షతగాత్రులను పరామర్శించేందుకు రావటానికి పవన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. సహాయ చర్యలకు ఆటంకం కలుగుతుందన్న అధికారుల సూచనతో తన ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన థర్డ్‌పార్టీ ఏజెన్సీ విధానం వల్లే కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిగా సన్నగిల్లి ప్రమాదాలకు దారితీస్తున్నాయని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. అచ్యుతాపురం సెజ్ దుర్ఘటనలో బాధితులకు తక్షణ సాయం, సహాయక చర్యలు అందజేస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులను దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందజేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టరు, ఎస్పీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారన్నారు.

అది అమెరికా కంపెనీ..

ఇప్పటికే కొంత వాటా అమ్మకం

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఏపీ సెజ్‌లో 2019లో ఏర్పాటు చేసిన ఫార్మా కంపెనీ ఎసెన్షియా.. అమెరికాకు చెందినది. కనెక్టికట్ దీని ప్రధాన కేంద్రం. ఇది మందుల తయారీలో పరిశోధన, అభివృద్ధి, నిర్వహణలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఫార్మా, బయోటెక్ కంపెనీలకు సేవలందిస్తుంది. దాదాపు 16 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ కంపెనీ అమెరికాలోని కనెక్టికట్, భారత్‌లోని హైదరాబాద్‌లో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్వహిస్తోంది. అనకాపల్లి జిల్లాలోని ఏపీ సెజ్‌లో కమర్షియల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఫార్మా కంపెనీలకు ప్రధాన ముడి సరకులు సరఫరా చేస్తుంది. ఇటీవల ఈ కంపెనీలో కొంత వాటాను ఇతరులకు విక్రయించారని సమాచారం.


అనంతపురం జిల్లా బెళుగుప్ప సమీపంలోని పెద్ద వంకలో కొట్టుకుపోయిన టిప్పర్

అనంతలో భారీ వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 21: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బెళుగుప్ప మండలంలో అత్యధికంగా 89.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాయదుర్గంలో 85.4, వజ్రకరూరు 82.6, కళ్యాణదుర్గం 80.2, కూడేరు 78.4, పెద్దవడుగూరు 65.2, ఉరవకొండ 62.4, గుత్తి 60.8, పామిడి 53.8, కంబదూరులో 45.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బెళుగుప్ప సమీపంలోని పెద్ద వంక బ్రిడ్జిపై నీరు పారుతోంది. నీటి ఉధృతికి బ్రిడ్జి మీద నుంచి టిప్పర్ కొట్టుకుపోయి వంకలో పడింది. అయితే, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ఆ మార్గంలో గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు జిల్లాలోని 926.74 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రూ.4.4 కోట్ల నష్టం వాటిల్లింది. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 301 చెరువులు ఉండగా, వాటిలో 116 చెరువులకు వర్షం నీరు చేరింది.

నాటి సీసీ ఫుటేజీ ఇవ్వండి

- వైసీపీ కేంద్ర కార్యాలయానికి పోలీసుల నోటీసు

మంగళగిరి, ఆగస్టు 21: గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయానికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసు జారీ చేశారు. 2021 అక్టోబరు 19న టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణ నిమిత్తం ఆ రోజు వైసీపీ కార్యాలయంలో 24 గంటలపాటు సీసీ కెమేరా ఫుటేజీని అందజేయాలని అందులో కోరారు. కార్యాలయం తరఫున ఆ పార్టీ ప్రతినిధులు మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో హాజరై సీసీ ఫుటేజీని అందించాలని సూచించారు.

వివేకా హత్య కేసులో.. ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్

- షరతులతో మంజూరుచేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరో నిందితుడి(ఏ-6)గా ఉన్న గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని.. సీబీఐ కోర్టు సంతృప్తి మేరకు రెండు పూచీకత్తులు ఇవ్వాలని.. పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించాలని.. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని.. ప్రతివారం పులివెందుల పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని, కేసు దర్యాప్తులో జోక్యం చేసుకోరాదని.. సాక్ష్యాలు తారుమారు చేయరాదని.. పలు షరతులు విధించింది. వీటిని ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుచేయాలని సీబీఐ, వివేకా కుమార్తె సునీత కోరవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆదేశాలు జారీచేశారు. వివేకా హత్య కేసుకు సంబంధించి ఇప్పట్లో ట్రయల్ ప్రారంభమయ్యేలా లేదని.. తనకు బెయిల్ ఇవ్వాలని పేర్కొంటూ ఉదయ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని సీబీఐ, సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. 13 నెలలుగా ట్రయల్ ముందుకు సాగకుండా ఉదయ్‌రెడ్డి వ్యూహాత్మకంగా అడ్డుకుంటున్నారని.. ఇప్పుడు మళ్లీ హైకోర్టుకు వచ్చి సమీప భవిష్యత్‌లో ట్రయల్ మొదలయ్యే అవకాశం లేనందున బెయిల్ ఇవ్వాలని వాదించడం అక్రమమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 14న తీర్పు రిజర్వు చేసి బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా.. ఉదయ్‌రెడ్డికి బెయిల్ రావడంతో ఈ కేసులో కుట్రదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నిందితులు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి బయటే ఉన్నట్లయింది. ఏ4 దస్తగిరి (అప్రూవర్)ని సీబీఐ కోర్టు సాక్షిగా గుర్తించింది. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి మాత్రమే ప్రస్తుతం జైల్లో ఉన్నారు.

ఏపీలో బీజేపీ సభ్యత్వం కోటికి చేరాలి

- పార్టీ శ్రేణులతో పురందేశ్వరి...
- సభ్యత్వ ప్రముఖ్‌గా దయాకర్‌రెడ్డి



అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ భావజాలం బీజేపీలోనే ఎక్కువగా ఉందని, సేవా గుణమున్న కార్యకర్తలకు కమలం పార్టీలో లోటు లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. పార్టీ అనుబంధ మోర్చాల అధ్యక్షులు, పదాధికారులతో ఆమె విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదును రాష్ట్రంలో కోటికి తీసుకెళ్లాలని లక్ష్యం నిర్దేశించారు. అనుబంధ విభాగాలు, మోర్చాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సెప్టెంబరు 1 నుంచి యుద్ధ ప్రాతిపదికన సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రముఖ్‌గా పార్టీ ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి నియమితులయ్యారు. కార్యక్రమంలో ప్రయాగ రాజ్ ఎమ్మెల్యే సిద్ధార్థనాథ్ సింగ్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థ సారథి పాల్గొన్నారు.

దేశం విడిచి పారిపోయేందుకు దేవినేని అవినాశ్ యత్నం!

- టీడీపీ ఆఫీసుపై దాడి వెనుక కుట్ర కోణాన్ని తేల్చాలి
- నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించాలి
- ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దు
- హైకోర్టుకు సీనియర్ న్యాయవాది లూథ్రా వినతి
- ముగిసిన వాదనలు.. సెప్టెంబరు 3న తీర్పు

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వ్యవహారంలో.. వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని దేశం విడిచి పారిపోయేందుకు నిందితుడు దేవినేని అవినాశ్ యత్నించారని, ఆయన్ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచామన్నారు. తొందరపాటు చర్యలు వద్దని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో పిటిషనర్లు దర్యాప్తునకు సహకరించడం లేదని తెలిపారు. అధికారాన్ని వినియోగించి గత మూడేళ్లుగా దర్యాప్తును ప్రభావితం చేశారన్నారు. దాడి వెనుక కుట్ర కోణాన్ని తేల్చాల్సి ఉందని.. అందుకోసం నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాల్సి ఉందన్నారు. వారికి అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తే దర్యాప్తు ముందుకు సాగదన్నారు. వారి నేరచరిత్రను కోర్టు ముందుంచామని.. దానిని పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో.. నిర్ణయాన్ని వాయిదా వేసిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్.. సెప్టెంబరు 3న తీర్పు వెల్లడిస్తానని ప్రకటించారు. ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్లు వేసినవారిలో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ కార్యకర్తలు జి.రమేశ్, షేక్ రబ్బానీ బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్, మరికొందరు ఉన్నారు.


ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేస్తున్న బొత్స సత్యనారాయణ

ఏ విచారణైనా చేసుకోండి.. వద్దంటే మానేస్తారా?

- శాసనమండలి సభ్యుడిగా బొత్స ప్రమాణస్వీకారం
- ప్రతిపక్ష నేత అయ్యేందుకు వీలుగా లేళ్ల అప్పిరెడ్డి రాజీనామా

అమరావతి/గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'విద్యాశాఖలో చిక్కీలు, ట్యాబ్‌లు, సింగిల్ ఆర్డర్ జీవోల విషయంలో మేం వద్దంటే ఎంక్వైరీలు మానరు.. ప్రభుత్వం మాది కాదు. ఏదైనా చేసుకుంటే చేసుకోండి. తప్పుంటే శిక్షించండి' అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వైసీపీ తరఫున విశాఖ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనతో.. మంగళవారమిక్కడ శాసనసభ ప్రాంగణంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు తన చాంబర్లో పదవీప్రమాణం చేయించారు. అనంతరం బొత్స మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రావడం లేదని ప్రశ్నించగా.. 'ఇప్పటికి ఒక సమావేశమే కదా జరిగింది! ఇంతలోనే ఎమ్మెల్యేలు రావడం లేదంటే ఎలా' అనిఎదురు ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం వచ్చి 75 రోజులే అయిందని వారికి టైమివ్వాలిగా అని వ్యాఖ్యానించారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేల్లో ఏడుగురు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడతారన్న ప్రచారాన్ని ప్రస్తావించగా.. ఊహాగానాలకు సమాధానం చెప్పలేనంటూ బొత్స దాటవేశారు. మరోవైపు.. ఆయన మండలిలో ప్రతిపక్ష నేత బాధ్యతలు చేపట్టే అవకాశముంది. ప్రస్తుత ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి బుధవారం రాజీనామా చేశారు.

ఈవీఎంలపై అనుమానాలను నివృత్తి చేయాలి: వైవీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 21: ఈవీఎంలపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఒంగోలులో స్పష్టం చేశారు. వీవీ ప్యాట్స్ స్లిప్పులను లెక్కించాలన్నారు. వెలిగొండ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం ఏమి చేసింది, వైసీపీ ప్రభుత్వం ఏమి చేసిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని చెప్పారు.


కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సత్కరిస్తున్న లోకేశ్

అమిత్ షా పిలుపుతో ఢిల్లీకి లోకేశ్

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి పిలుపు రావడంతో టీడీపీ యువ నేత, మంత్రి లోకేశ్ బుధవారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. కొన్ని రాజకీయ అంశాలపై మాట్లాడే నిమిత్తం షా ఆయన్ను పిలిపించారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం ఆయన ఢిల్లీ నుంచి తిరిగి వస్తారు.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ

ఢిల్లీ పర్యటనలో ఉన్న లోకేశ్ బుధవారం కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను చర్చించినట్లు లోకేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

పంచాయతీరాజ్‌లో బదిలీలకు మార్గదర్శకాలు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో బదిలీలకు ఆ శాఖ కమిషనరేట్ కార్యాలయం మార్గదర్శకాలు, షెడ్యూల్ జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయడంతో అన్ని శాఖలు ఉద్యోగుల బదిలీకి మార్గదర్శకాలు విడుదల చేస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయని, ఆయా జిల్లాల కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, డ్వామా పీడీలు బదిలీలు చేపట్టాలని సూచించారు. బదిలీ కోసం జిల్లా స్థాయిలో ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆయా హెచ్ఓడీలు 25వ తేదీన పరిశీలించాలని, 26న ఆ బదిలీలకు సంబంధించి సిఫారసులతో కమిషనర్ కార్యాలయానికి చేర్చాలని, కమిషనరేట్ కార్యాలయం 28న పరిశీలిస్తుందని, 29న ఎంపీడీవోలు, ఈవోపీఆర్ అండ్ ఆర్డీలు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు ఇతర జిల్లాలకు బదిలీ కోసం కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో బదిలీలకు 31న ఆదేశాలివ్వాలని, డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పనిచేసే డీఎల్‌పీవో, ఏవోలకు కమిషనర్ బదిలీలు చేసేందుకు 31 తేదీని గడువుగా ప్రకటించారు. 26 తర్వాత స్వీకరించిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరాదన్నారు. అదే విధంగా గ్రామీణాభివృద్ధిశాఖలో బదిలీలకు షెడ్యూల్ విడుదల చేశారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏపీపీఎస్సీ వాయిదా వేసింది. సెప్టెంబరు 2 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా, అభ్యర్థుల వినతులను పరిగణనలోకి తీసుకుని వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ.. తేదీలను తర్వాత ప్రకటిస్తామంది. కాగా, ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల నిష్పత్తి పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఈ కారణంతోనే వాయిదా వేసినట్లు చెబుతున్నారు.

అఘాయిత్యం చేస్తే...

అదే ఆఖరి రోజు

- విచారణలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే నేనే స్వయంగా ఘటనా స్థలికి వస్తా
- గంజాయి, డ్రగ్స్‌ను కట్టడి చేయండి
- సైబర్ నేరాలకు బ్రేకులు పడాల్సిందే
- శాంతిభద్రతలపై సమీక్షలో చంద్రబాబు


హోంశాఖపై మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడేవారికి అదే ఆఖరి రోజు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విచారణలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే తానే స్వయంగా ఘటనా స్థలికి వస్తానని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. 'రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని అదుపు చేయండి. సైబర్ నేరాలకు బ్రేకులు పడాల్సిందే. నేరాల కట్టడికి ఆధునిక టెక్నాలజీ వినియోగించండి. నేరం చేస్తే శిక్ష తప్పదన్న భయం కల్పించేలా పోలీసులు పనిచేయాలి' అని ముఖ్యమంత్రి పోలీసు శాఖను ఆదేశించారు. పోలీసు శాఖ బలోపేతానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. పోలీసు ప్రతిష్ఠ పెంచాలని, ప్రజలకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో నేరాల తీరుతెన్నులపై డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్ర విభజన జరిగాక 2014-19 మధ్యలో జరిగిన నేరాలతో పోల్చితే 2019-24 మధ్యలో 46.8 శాతం నేరాలు పెరిగాయని వివరించారు. అనంతరం చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులకు పలు కీలక సూచనలు చేశారు. గడిచిన ఐదేళ్లతో పోల్చితే రాష్ట్రంలో పోలీసింగ్ తీరులోనే స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. ఎవరు నేరం చేసినా శిక్ష తప్పదనే భయం పోలీసులు కల్పిస్తేనే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. శాంతిభద్రతల విషయంలో తన ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని, పోలీసులు అలసత్వాన్ని ప్రదర్శిస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ పేరు వినిపిస్తేనే ప్రశాంత రాష్ట్రం అనాలని, నేరం జరిగిన తర్వాత బాధ్యుల్ని శిక్షించడం కన్నా జరగక ముందే అప్రమత్తమై నిరోధించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపాలని సీఎం ఆదేశించారు. జగన్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మైనర్లపై 152 శాతం అఘాయిత్యాలు పెరిగాయని శాంతి భద్రతలపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వయంగా డీజీపీ తిరుమల రావు వివరించారు. మహిళలపై నేరాలు జరగకుండా నిరోధించేందుకు 'దిశ' (చట్టం లేదు) ద్వారా కఠిన చర్యలు తీసుకొంటున్నట్లు గతంలో జగనన్న చెప్పినదంతా ఉత్తుత్తిదేనని తేటతెల్లం చేశారు. 2019-24 మధ్యలో రాష్ట్రంలో మహిళలపై 36 శాతం నేరాలు పెరిగాయని, మిస్సింగ్ కేసులు ఏకంగా 84 శాతం ఎక్కువైనట్టు గుట్టు విప్పారు. సైబర్ నేరాలు, దాడులు, దౌర్జన్యాలు కూడా పెరిగినట్లు డీజీపీ వివరించారు.

కాలంచెల్లిన వాహనాలతోనే...

రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్లు పోలీసు శాఖ సమకూర్చుకున్న సీసీ కెమెరాలు, డ్రోన్లు, బాడీవార్న్ కెమెరాలు, ఎల్‌హెచ్ఎంఎస్‌లు ఏవీ పని చేయట్లేదని ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇటు టెక్నాలజీ పరంగా, అటు కాలం చెల్లిన జీపులతో పోలీసు శాఖ నేరాలు నిరోధించేందుకు అపసోపాలు పడుతోందని చెప్పారు. రాష్ట్ర పోలీసు శాఖలో 2019 నాటికి 143 డ్రోన్లు ఉంటే 55 పనిచేయట్లేదని.. 1250 బాడీ వార్న్ కెమెరాలకు గానూ కేవలం 444 పని చేస్తున్నాయని తెలిపారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ కెమెరాల్లో 1180కి గానూ మరీ అధ్వానంగా 317 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. నేరాల కట్టడిలో కీలకమైన సీసీ కెమెరాల్లో 14,712కు గానూ 2371 పనికి రాకుండా పోయాయని, ఆటోమెటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ పూర్తిగా మూలకు చేరిందన్నారు. వాటి నిర్వహణ కోసం కేవలం 30కోట్లు అడిగినా వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదని, మెయింటెనెన్స్ లేకపోవడం వల్లే ఇవన్నీ పాడయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2014-19 మధ్య 222కోట్లు ఖర్చు చేసి అప్పటి ప్రభుత్వం 5215వాహనాలను పోలీసు శాఖకు కొనిస్తే.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 67 కోట్లు మాత్రమే వాహనాలకు ఖర్చు చేసిందన్నారు. కాలం చెల్లిన వాహనాలతో కష్టంగా ఉందని, ఇప్పటికిప్పుడు 2812 వాహనాల కొనుగోలుకు 281 కోట్లు అవసరమని డీజీపీ అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల నిర్వహణ నిధులు తక్షణమే విడుదల చేస్తామని, విడతల వారీగా పోలీసు శాఖకు అన్నీ సమకూరుస్తామని అన్నారు. విపత్తు నిర్వహణ శాఖను సైతం వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని హోంమంత్రి అనిత అన్నారు. శాఖ బలోపేతానికి అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందని సీఎం చెప్పారు.

బెజవాడలో పోలీసు అకాడమీ

- స్థలం గుర్తించాలని సీఎం ఆదేశం: హోం మంత్రి

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో పోలీసు అకాడమీ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్నంలో రూ.290 కోట్లతో గ్రేహౌండ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని.. దానికి సీఎం త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. గంజాయి నిర్మూలనకు నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిపాదనలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయని.. త్వరలో కేబినెట్ ఆమోదం పొందుతుందని వెల్లడించారు. ప్రతి జిల్లాలో డీఎస్పీ స్థాయి అధికారితో ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పర్యటనకు అవసరమైన వాహనాలను సాధ్యమైనంత త్వరలో సమకూర్చుతామన్నారు. 'ప్రతి వాహనానికి ప్రస్తుతం నెలవారీ 150లీటర్ల ఆయిల్ వినియోగాన్ని 300లీటర్లకు పెంచేందుకు సీఎం అంగీకరించారు. ఇదివరకు ప్రతి స్టేషన్‌కు ఇన్వెస్టిగేషన్ చార్జీలుగా రూ.8వేలు ఇచ్చేవారు. గత ప్రభుత్వం వీటినీ నిలిపివేసింది. తిరిగి ఆ చార్జీలు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. గంజాయి దుష్పరిణామాలపై 26జిల్లాల్లోనూ అవగాహనా ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు' అని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆత్మరక్షణ కోర్సులు పెడతామని చెప్పారు.

జగన్ భద్రతకు నాడు 6 కోట్లు

జగన్ సీఎంగా ఉండగా తన భద్రత కోసం 980 మందిని నియమించుకుని నెలకు రూ.6కోట్లు ఖర్చు చేశారని హోంమంత్రి విమర్శించారు. నెలకు ఇంకో రూ.53 లక్షలు ఖర్చు చేసి మరో 50 మందిని అధికార దర్పం కోసం పెట్టుకున్నారని మండిపడ్డారు. 'ప్రతిపక్ష నేత హోదా లేకపోయినా.. జగన్‌కు జడ్ ప్లస్ సెక్యూరిటీ కొనసాగిస్తున్నాం, ఇందుకు నెలకు రూ.50లక్షలు ఖర్చవుతోంది. ఆయన సీఎంగా ఉన్నప్పుడు భువనేశ్వరి, బ్రాహ్మణికి భద్రత తొలగించారు. తన తల్లి విజయలక్ష్మికి, సతీమణి భారతికి 1+1 భద్రత ఇచ్చారు. మా ప్రభుత్వం వారికి 2+2 భద్రత కల్పిస్తోంది' అని తెలిపారు.

గత ఐదేళ్లలో గ్రీజే పెట్టలేదు..!

- కనీసం పెయింట్ కూడా వేయలేదు
- అందుకే పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయ్
- ప్రముఖ ఇంజనీర్ కన్నయ్యనాయుడు ఆవేదన
- జలాశయ గేట్ల రూపశిల్పికి చంద్రబాబు ఘన సన్మానం

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పెట్టలేదని, పెయింట్ కూడా వేయలేదని ప్రముఖ ఇంజనీర్ ఎస్.కన్నయ్యనాయుడు అన్నారు. అందుకే పులిచింతల, గుండ్లకమ్మలాంటి ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయని తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు గేట్ల గురించి ముందే హెచ్చరించానని.. లీకేజీ ఫొటోలు కూడా పంపించానని.. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో గేటు కొట్టుకుపోయిందని చెప్పారు. ఇటీవల తుంగభద్ర డ్యాంలో వరదకు కొట్టుకుపోయిన 19వ గేటు నుంచి నీటి ప్రవాహంతో జలాలు వృథాకాకుండా స్టాప్‌లాగ్ గేటును అమర్చి 30 టీఎంసీల జలాలను కాపాడిన జలాశయ గేట్ల రూపశిల్పి కన్నయ్యనాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయానికి పిలిపించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కన్నయ్యనాయుడు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల గేట్ల జీవితకాలం 45ఏళ్లని.. వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాష్ట్రప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తుంగభద్ర, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీ గేట్లు అమర్చి 45 ఏళ్లు దాటిపోయిందన్నారు. 'తుంగభద్ర డ్యాం గేట్లు ఇప్పటికే 70 ఏళ్లు పనిచేశాయి. డ్యాం ఇంజనీర్లు, అధికారులు సాధ్యం కాదని చేతులెత్తేస్తే చేసి చూపిస్తానని చెప్పి సిబ్బందితో ఐదు రోజుల్లో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేయడం ఇండియాలో రికార్డు. స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుతో ఖరీఫ్ సాగుకు ఇబ్బంది లేకుండా చేయడం సంతోషంగా ఉంది. గేటు కొట్టుకుపోయిన వెంటనే రైతుల కళ్లలో కన్నీళ్లు చూశాను. స్టాప్‌లాగ్ గేటు పెట్టిన తర్వాత అదే రైతులు స్వీట్లు పంచుకోవడంతో ఆనందించాను. ఇప్పటి వరకూ ఏ ఆనకట్టా పాడవకుండా కాపాడగలిగాను. నా సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాజెక్టులో సమస్య తలెత్తినా వెంటనే వస్తానని, నా తుది శ్వాస వరకూ పని చేస్తా' అని సీఎంకు ఆయన హామీ ఇచ్చారు. వాస్తవానికి గేటు కొట్టుకుపోయిన సమయంలో కన్నయ్యనాయుడు హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఉన్నారు. బయటకు వస్తే ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉన్నా.. చంద్రబాబు ఆదేశాలు, రాయలసీమ రైతాంగానికి సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో హుటాహుటిన తుంగభద్ర డ్యాంకు చేరుకున్నారు. స్టాప్‌లాగ్ గేటు బిగించడానికి నడుం బిగించారు.

మాతో ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఏసీబీని ఆదేశించింది. దీనిపై చంద్రబాబు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ కోర్టు ఆదేశాలను కొట్టివేస్తూ హైకోర్టు 2016 డిసెంబరు 9న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆళ్ల సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని మరో పిటిషన్ వేశారు. ఈ రెండు వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా.. ఈ కేసులో ఇప్పటికే రెండు చార్జిషీట్లు దాఖలయ్యాయని, జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ లేవని సుప్రీంకోర్టు పేర్కొంది. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, న్యాయవాదులు గుంటూరు ప్రభాకర్, ప్రమోద్ కుమార్, ప్రేరణ విచారణకు హాజరయ్యారు. తొలుత ఆళ్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే రూ.5కోట్లు, ఓటు వేయకుండా గైర్హాజరైతే రూ.2కోట్లు ఇస్తామని చంద్రబాబు తరఫున అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి బేరసారాలు జరిపారని.. దీనికి సంబంధించి కాల్ రికార్డింగులు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు ఉన్నాయని, ఆ జాబితాను ధర్మాసనానికి అందజేశారు. కేసుల జాబితాను పరిశీలించిన తర్వాత పిటిషనర్ ఆళ్లపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వేదిక చేసుకోవద్దని హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ 2014 నుంచి ఇటీవలి ఎన్నికల వరకు శాసనసభ్యుడిగా ఉన్నారని లూథ్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన పార్టీ ప్రతిపక్షంలో ఉందని, పిటిషన్ దాఖలు చేసిన సమయంలో కూడా ప్రతిపక్షంలోనే ఉందని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ కనిపించడం లేదని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆళ్ల వేసిన ఎస్ఎల్‌పీని డిస్మిస్ చేసేందుకు ధర్మాసనం సంసిద్ధత వ్యక్తంచేయగా.. దానిని ఉపసంహరించుకుంటున్నట్లు ఆయన తరఫు న్యాయవాది తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రమాదం..





చిన్నారుల జలకాలాటల మాటున ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం సురక్షితం కానీ వంతెనపై నుంచి కృష్ణానది ప్రవాహంలో దూకుతూ వారు ఆడుకుంటున్న తీరు చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. నగరంలోని పడవలరేవు ప్రాంతంలో ఏలూరు కాలువపై నిర్మించిన వంతెనపై నుంచి ఈ చిన్నారులు చాలా ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో దూకుతూ ఆడుకుంటున్నారు. ఈ వంతెనకు అటు ఇటూ 6 అడులకు పైనే రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినా వాటి పక్కనుంచి నడుచుకుంటూ వంతెనపై నుంచి దూకుతున్నారు. ఒకవేళ అనుకోనిదేదైనా జరిగితే అప్పటికప్పుడు వారిని రక్షించేందుకు ఏమాత్రం అవకాశం లేదు. కాబట్టి సంబంధిత అధికారులు అటువైపు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన తెలుగు యువతి

వన్‌టౌన్: రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని గుంటూరు జిల్లా, తాడేపల్లికి చెందిన యువతి అన్నపూర్ణ అలవోకగా అధిరోహించారు. ఈ పర్వతం సముద్రమట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఒక నిద్రాణమైన అగ్నిపర్వతంగా ఎల్బ్రస్ పర్వతం ఉంది. ఇది యురేషియా సూపర్ ఖండంలో ఎత్తైన స్ట్రాటోవల్కానోగా గుర్తింపు పొందింది. ప్రపంచంలోని పదవ అత్యంత ప్రముఖ శిఖరంగా ఇది ఉందన్నారు.



బడా బినామీ వేటలో పోలీసులు!

● బడా బాబులకు బినామీగా వాసు
● చీటింగ్ కేసులో ఆయన భార్య అరెస్టు

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బడాబాబులకు బినామీగా ఉన్న ఓ వ్యక్తి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. నగరానికి చెందిన నల్లూరి వాసు రాజకీయ నేతలకు, పోలీసు అధికారులకు బినామీగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొంతకాలంగా వాసు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఆయన భార్య నల్లూరి గీత చిట్‌ఫండ్స్ పేరుతో కోట్లాది రూపాయలకు తమను మోసం చేసిందని పోలీసు కేసు నమోదు చేశారు. దీంతో ఆగస్టు 14న ఆమెను పోలీసులు అరెస్టు చేసి గుంటూరు జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 27వరకు రిమాండ్ విధించారు. వాసు దంపతులు టీడీపీ రాష్ట్ర కార్యాలయం సమీపంలోని మంజీరా అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నారు.

బయటికొస్తున్న మోసాలు

నల్లూరి వాసు బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. చిట్టీల నిర్వాహకుడిగా ధనవంతులకు పరిచయమై పబ్ ఏర్పాటు పేరుతో రూ.30కోట్ల వరకు అప్పు చేశాడు. దీనిపై ఈనెల 7న పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన కంభంపాటి పృథ్వీరాజ్ వ్యాపారి. గుంటూరుకు చెందిన సాయిబాబు అనే వ్యక్తిని వ్యాపారంలో పరిచయం చేసుకున్నాడు. ఇతడి ద్వారా పటమట తోటవారి వీధిలో కిసాన్ రోడ్డుకు చెందిన నల్లూరి వాసు 2015లో పరిచయమయ్యాడు. వాసు చిట్టీల వ్యాపారం చేస్తున్నానని వారిని నమ్మించాడు. పృథ్వీరాజ్... వాసు వద్ద రూ.10 లక్షల చిట్టీ వేశాడు. ఈ డబ్బును వాసు బావమరిది కోనేరు వెంకట మధుబాబు వసూలు చేసేవాడు. అలాగే, నగరానికి చెందిన హేమంత్‌ను వాసు.. పృథ్వీరాజ్‌కు పరిచయం చేశాడు. ఈ వ్యాపారంలో పృథ్వీ, వాసుకు మధ్య స్నేహం బలపడింది. నగరంలో హేమంత్ పబ్ ఏర్పాటు చేస్తున్నాడని చెప్పి పృథ్వీరాజ్ నుంచి వాసు రూ.20 కోట్లను దఫదఫాలుగా అప్పుగా తీసుకున్నాడు. పృథ్వీకి తెలియకుండా అతడి స్నేహితుల నుంచి మరో రూ.10 కోట్లు తీసుకున్నాడు. ఈ క్రమంలో నెల రోజులుగా వాసు ఉలుకు పలుకు లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

క్రీడాభివృద్ధి చేసేవారికి శాప్ చైర్మన్ ఇవ్వాలి

● సీఎం చంద్రబాబును కోరిన కేపీ రావు

విజయవాడ స్పోర్ట్సు: క్రీడానేపథ్యం ఉన్నవారు, క్రీడాభివృద్ధికి బద్ధులైన వారికే శాప్ చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు తెలిపారు. క్రీడా వసతులను పీపీపీ మోడల్‌లో డెవలప్ చేసే, రాష్ట్ర బడ్జెట్‌పై ఆధారపడకుండా చేసే రైట్‌పర్సన్‌కు ఇవ్వాలన్నారు. పీపీపీ మోడల్‌లో 13 జిల్లాల్లో మొదటి దశలో రూ.2వేల కోట్లు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు కేపీ రావు వివరించారు.

అనధికార లే అవుట్లో ప్లాట్లు కొనొద్దు

● కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్: అనుమతిలేని అనధికార లే అవుట్లలో ప్లాట్‌లు కొనుగోలు చేయవద్దని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటువంటి లే అవుట్లలో ప్లాట్‌లు కొనుగోలు చేయటం చట్టవిరుద్ధమని, ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవన్నారు. అనధికార లే అవుట్లలో రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజీ, సదుపాయాలు కల్పించబడవన్నారు. అనధికారికముగా లే అవుట్లు వేసి అమ్మకాలు చేస్తున్న స్థల యజమానులు, డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అనధికార లే అవుట్లు ఇవే..

1, విజయవాడ కుందవారి కండ్రిక - సర్వే నంబర్లు - 58/1బి, 58/4బి, 38/1ఏ
2, విజయవాడ విద్యాధరపురం - సర్వేనంబరు - 91పీ
3, విజయవాడ నార్త్ గుణదల - సర్వేనంబరు - 137/1, 194, 165, 166, 180/3, 88, 31, 54/2బీ

జూనియర్ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ కావలెను

కృష్ణలంక: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయుటకు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం-1, హిస్టరీ-1, వాణిజ్య శాస్త్రం-1 సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో (పీజీ) 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. గురువారం 22న మధ్యాహ్నం 2 గంటలలోపు ప్రిన్సిపాల్ చేతికి దరఖాస్తులు అందివ్వాలన్నారు. డెమోక్లాసులు, ఇంటర్వ్యూలు ఆగస్టు 22న ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం, డీవైఈవో కార్యాలయం నందు జరుగుతాయన్నారు. వివరాలకు 9948782570, 9849614915లో సంప్రదించాలని కోరారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్యారమ్స్ ఎంపిక పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ పర్యవేక్షణ, జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్, యూత్ బాలబాలికలకు రాష్ట్రస్థాయి క్యారమ్స్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఆడిన వారి నుంచి ప్రాబబుల్స్‌ను ఎంపికచేసినట్టు రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ తెలిపారు. వీరికి కోచింగ్ నిర్వహించి తుది జట్టును ప్రకటిస్తామని సంఘ అధ్యక్షుడు నీరజ్‌కుమార్ సంపతి తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా కార్యదర్శి జె మురళీకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే సుబ్బారావు, ఆలిండియా అంపైర్ ఎస్‌కే అజ్మతుల్లా, ఇన్‌చార్జి బీ వెంకయ్య పాల్గొన్నారు.

ఎంపికైన జట్టు

జూనియర్ బాలురు: వీ జీవన్‌కుమార్, జీ రాజేష్, పీ పవన్, కే చందు, ఎస్కే మస్తాన్, ఎస్‌కే తౌసీఫ్ (ప్రకాశం), **బాలికలు:** కే సోనీ, టీ గంగోత్రి, బీ వెంకటేశ్వర్లు, ఎస్కే మొబీరా (ప్రకాశం), **యూత్ బాలురు:** కార్తీక్ (ఎన్టీఆర్), బీఎస్‌వీడీ ప్రసాద్ (కృష్ణా), సూరజ్ (గుంటూరు), **యూత్ బాలికలు:** నవ్య (గుంటూరు), మయూఖ (గుంటూరు), సరస్వతి (విశాఖ) ఎంపికయ్యారన్నారు.

అనాథ శవాలతో అవస్థలు..!

'అన్‌నోన్' బాడీ కొట్టుకొచ్చిందా రూ.4వేల వరకు పోలీసుల జేబుకు చిల్లు

● ఏడాదికి ప్రతి స్టేషన్‌కు దాదాపు 7 నుంచి 10 కేసులు ● రైల్వేలో ఒక్కో అనాథ శవానికి రూ.5వేలు చెల్లింపు



విజయవాడ లీగల్: 'అనాథ శవాలు'.. ఈ పేరు వింటేనే పోలీసు సిబ్బంది వణికిపోతున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, కృష్ణలంక పోలీసు స్టేషన్లలో తరచూ ఈ అనాథ శవాలు కృష్ణానదిలో కొట్టుకొస్తుంటాయి. ఏడాదికి ప్రతి స్టేషన్‌కు దాదాపు 7 నుంచి 10 కేసులు వస్తున్నాయి. ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి ప్రమాదవశాత్తు మునిగి చనిపోవడమో లేదా, పైనుంచి నదీ ప్రవాహంలో కొట్టుకురావడమో జరుగుతుంటాయి. విధుల్లో ఉన్న ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆదేశాలతో అనాథ శవం విచారణ చేపట్టారో వారి జేబుకు చిల్లు పడినట్టేనని అంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది కేసు విచారణ ప్రారంభిస్తుంటారు. గుర్తుతెలియని మృతదేహాన్ని పరిశీలించి గుర్తులేమైనా దొరికినా మృతుడి ఆనవాలు దొరికినా బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని అందజేస్తారు. అలా కాకుండా 3, 4రోజులైతే బాడీ డీ కాంపోజ్ అయితే బాడీని బయటకు తీయించి, పోస్టుమార్టం, ఇతరత్రా కార్యక్రమాలు మొత్తం కేసు విచారణాధికారే భరించాల్సి వస్తుంది. కార్పొరేషన్ వారైనా కనీసం రూ.1500 రాయితీ ఇస్తే బాగుంటుందని సిబ్బంది చెబుతున్నారు. కొత్తగా వచ్చిన పోలీసు కమిషనర్ ఇలాంటి అనాథ శవాల కేసులు విచారణ చేపట్టే సిబ్బందికయ్యే ఖర్చులన్నీ పోలీసు వెల్ఫేర్ ఫండ్ నుంచి ఇప్పిస్తే బాగుంటుందంటున్నారు. రైల్వేలో ఇలాంటి అనాథ శవాలు లభించినప్పుడు రైల్వే శాఖ అప్పటికప్పుడు విచారణాధికారికి రూ.5వేల వరకు ఇస్తుందంటున్నారు.

సీఎం చంద్రబాబుతో రాష్ట్రాభివృద్ధి: ఎంపీ



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి నాదెండ్ల మనోహర్

భారతీనగర్, ఆగస్టు 21: ఐదేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైపోవడంతో అందరూ తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుత పరిస్థితుల్లో దూరదృష్టి ఉన్న నేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి శుభసూచికమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని నాక్ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నారెడ్కో సంస్థ మీట్ అండ్ గ్రీట్ జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి అమరావతి రాజధాని ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజనే కారణమన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి శ్రీకారం చుడితే 2019లో వచ్చిన జగన్ సర్కార్ మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని సీఆర్‌డీఏ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాస్త నిదానంగా వ్యవహరించాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, నారెడ్కో సభ్యులు పాల్గొన్నారు.

వైద్య పరిశోధనలకు భారతి మృతదేహం

● చివరి కోరిక మేరకు కాటూరు మెడికల్ కళాశాలకు అప్పగింత



పాయకాపురం, ఆగస్టు 21: మృతి అందరిదీ... కానీ స్మృతి కొందరికే దక్కుతుంది. ఆ కోవకే చెందుతారు రేగుల స్వతంత్ర భారతి. మరణానంతరం కూడా తాను ఈ సమాజానికి ఏదో ఓ రూపంలో ఉపయోగపడాలని భావించారు. వయోభారం ఫలితంగా మంగళవారం రాత్రి స్వతంత్ర భారతి మృతి చెందారు. ఆమె చివరి కోరిక మేరకు బుధవారం మృతదేహాన్ని కాటూరి మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు. కొత్తగూడెం సింగరేణి కాలరీస్‌లో ప్రెస్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన ఆమె పదవీ విరమణానంతరం అక్కడే ఉన్నారు. 6నెలల క్రితం ఆరోగ్యం సహకరించకపోవటంతో నగరంలోని తమ్ముడు రేగుల సతీష్, జయశ్రీ కుటుంబంతో ఉంటున్నారు. భారతికి సంతానం లేకపోవడంతో సోదరుడి కుటుంబమే అన్నీ అయి వృద్ధాప్యంలో అండగా ఉన్నారు. 1974 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజును జన్మించిన ఆమెకు వారి తల్లిదండ్రులు స్వతంత్ర భారతి పేరిట నామకరణం చేశారు. భారతి దేహాన్ని అనాటమీ విభాగం పరిశోధనలకు వినియోగిస్తుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ ఆమె మృతి అనంతరం సకాలంలో నేత్రాలను స్వీకరించింది. కాటూరి మెడికల్ కళాశాల నుంచి వచ్చిన వైద్య బృందానికి విజయవాడ ప్రభుత్వాసుపత్రి దేహాన్ని అప్పగించారు.

ఎన్జీవో సంఘంతోనే ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

ఎన్జీవో నేత విద్యాసాగర్



సభ్యత్వం ఇస్తున్న విద్యాసాగర్

వన్‌టౌన్, ఆగస్టు 21: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ చేసిన కృషి, పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యాయని ఎన్జీవో నేత విద్యాసాగర్ తెలిపారు. సంఘ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగానే మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారని, సభ్యత్వం తీసుకోవటం, సంఘంలో చేరటం అభినందనీయమన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో వైద్యారోగ్య శాఖలో పర్మినెంట్ అయిన కాంట్రాక్టు ఉద్యోగుల సభ్యత నమోదును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించేలా సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కొత్తగా రెగ్యులర్ ఉద్యోగులుగా నియామకమైన మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతన ఖరారు, తదితర అంశాల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ జిల్లా నేతలు బి.సత్యనారాయణరెడ్డి, వి.సతీష్ కుమార్, బి.వి. రమణ, ఎం. రాజబాబు, ఎ.నాగార్జున రావు పాల్గొన్నారు.

రైల్వేలో నగదు రహిత లావాదేవీలు



రైల్వేస్టేషన్, ఆగస్టు 21: రైల్వేలో నగదు రహిత లావాదేవీలు, డిజిటలైజేషన్, కాగిత రహిత పనిని ప్రోత్సహించేందుకు రైల్వే డివిజన్ల 100 శాతం హ్యాండ్‌హెల్డ్ టెర్మినల్స్ (హెచ్‌హెచ్‌టీ) పని చేస్తున్నాయని రైల్వే డివిజన్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని టికెట్ చెకింగ్ యూనిట్లలోను పనిచేస్తున్నాయని, ప్రతి టీటీఈ వద్ద పరికరాలున్నాయన్నారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా ప్రయాణికులు ప్రత్యక్షంగా నగదు తీసుకువెళ్లకుండా లావాదేవీలను నిర్వహించవచ్చన్నారు. హెచ్‌హెచ్‌టీల ప్రయోజనాలపై సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలియజేస్తూ ఈ ప్రక్రియ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. డివిజన్ అంతటా డిజిటల్ లావాదేవీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికుడు ఎక్కాల్సిన స్టేషన్‌లో హెచ్‌హెచ్‌టీ డివైజ్‌లో ఒకసారి రాలేదని మార్క్ చేస్తే తరువాత ప్రయాణికులు తదుపరి స్టేషన్‌లో రైలు ఎక్కి అదే బెర్త్‌ను కావాలని కోరితే కేటాయించలేమని స్పష్టం చేశారు. ఆర్ఏసీ, వెయిట్ లిస్టు ప్రయాణికులకు సదరు బెర్త్‌లను కేటాయిస్తామన్నారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ 100 శాతం హెచ్‌హెచ్‌టీని అమలు చేయటం పట్ల డివిజన్ వాణిజ్య శాఖను అభినందించారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణానుభవాన్ని అందించటమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, నగదు రహిత లావాదేవీల విధానం అమలులో హెచ్‌హెచ్‌టీలు ఒక ముందడుగని తెలిపారు.

ఇండి గ్యాస్ పొలంబడి నిర్వహణపై శిక్షణ



కృష్ణలంక, ఆగస్టు 21: ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలానికొకటి చొప్పున జిల్లాలోని అన్ని మండలాల్లో ఇండిగ్యాస్ సర్టిఫికేషన్ నిమిత్తం రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అనుసంధానించి, మేలైన వ్యవసాయ పద్ధతుల పొలంబడి కార్యక్రమాలను లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. ఈ పథకం సమర్థవంతంగా అమలు చేయాలనే సంకల్పంతో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారిణి సాకా నాగమణెమ్మ అధ్వర్యంలో నగరంలోని ఏపీఎన్జీవో అసోసియేషన్ హాలులో వ్యవసాయ శాఖలోని డివిజన్, మండలాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి నాగమణెమ్మ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్ బాలునాయక్, డీటీసీ టిమాధవీలత జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, అధికారులకు, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులు పాల్గొన్నా రు. రైతులు ఎఫ్‌పీవోలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, ఇండ్ గ్యాస్ పద్ధతులు పాటిస్తూ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ ద్వారా రైతులు స్కోప్ సర్టిఫికెట్‌ను పొందడం వంటి అంశాలను వివరించారు. ఏపీ సేంద్రీయ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ వారి స్కోప్ సర్టిఫికెట్‌ను ఇచ్చిన తరువాత డీజీ రెడీ సర్టిఫికెట్‌ను ఎఫ్‌పీవో పొందవచ్చునన్నారు. తద్వారా 135 దేశాల్లో సొంతంగా రైతు లేదా రైతు గ్రూపులఉత్పత్తులను అమ్ముకొనే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలపై పొలంబడి ద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

● చోద్యం చూస్తున్న అధికారులు
● బుడమేరు వెంట అక్రమ నిర్మాణం



రోడ్డు పక్కనే వెలసిన ఆక్రమణ

సత్యనారాయణపురం, ఆగస్టు 21: నిత్యం రద్దీగా ఉండే అయోధ్యనగర్ అన్నా క్యాంటీన్ సమీపంలో ఇరిగేషన్ స్థలంలో యథేచ్ఛగా అక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికే అన్నాక్యాంటీన్ వెంట పూలమొక్కలు అమ్మేవారు బుడమేరు వెంట ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించారు. దాని పక్కనే ప్రధానమైన నూజివీడు రహదారిపై బుడమేరు వెంట అక్రమ కట్టడం నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడంతో మరిన్ని కట్టడాలు వెలిసే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇక్కడ రోడ్డు వెంట ఉన్న హాకర్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడిక్కడ నిర్మాణం చేపడితే ప్రమాదాలు ఎక్కువవుతాయని ఆరోపిస్తున్నారు. అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం చేసుకుంటేనే వాలిపోయే అధికారులు ఇక్కడ నడిరోడ్డుపై అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం గమనార్హం. అక్రమ కట్టడం నిమిత్తం పెద్దమొత్తంలో నగదు చేతుల మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహాలక్ష్మీ అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించిన ఎల్‌ఈపీఎల్ సంస్థ సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 21: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నాగార్జున వర్శిటీ సమీపంలోని దశావతార వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీ అమ్మవారికి ఎల్‌ఈపీఎల్ సంస్థ సిబ్బంది బుధవారం సారె సమర్పించారు. నగరంలో నివాసముంటున్న సంస్థ సిబ్బంది భక్తిశ్రద్ధలతో, మేళతాళాలతో అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయంలో సిబ్బంది పూజలు నిర్వహించారు.



ధర్మపథం వేదికపై ఫణిరాజకుమారి బృందంచే భక్తి సంగీత విభావరి

ధర్మపథం వేదికపై భక్తి సంగీత విభావరి

వన్‌టౌన్, ఆగస్టు 21: దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై బుధవారం నాదేండ్ల ఫణిరాజకుమారి ఆధ్వర్యంలో అవర్ మ్యూజిక్ టీమ్ భక్తి సంగీత విభావరి నిర్వహించింది. పలు భక్తి కీర్తనలను ఆలపించి ఆహూతులను అలరించారు. దాదాపు 12 కీర్తనలకు తమ స్వరం నుంచి రాగ, తాళ లయబద్ధంగా గానం వినిపించారు. భక్తుల ప్రశంసలు అందుకున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేరుతో వైసీపీ నేత మోసం

పెనమలూరు, ఆగస్టు 21: సీఎం సహాయ నిధి నుంచి సహాయం ఇప్పిస్తానని మభ్యపెట్టి రూ.45వేలు మోసం చేసిన వైసీపీ నేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకిలో నివాసముండే వైసీపీ నేత మోర్ల మహిధర్‌కు యనమలకుదురు గ్రామానికి చెందిన బోడేపూడి రేవంత్ కుటుంబంతో పరిచయం ఉంది. రేవంత్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆసుపత్రిలో ఖర్చయిన రూ.12 లక్షలను తాను సీఎం సహాయనిధి నుంచి ఇప్పిస్తానని నమ్మబలికి రేవంత్ భార్య వనిత నుంచి రూ.40వేలు తన ఖాతాకు మళ్లించుకున్నాడు. తర్వాత సీఎం సహాయనిధి సాయం గురించి మహిధర్‌ను అడగ్గా ఇచ్చేది లేదు, దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడడంతో ఆమె బుధవారం పెనమలూరు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగులపై కొనసాగుతున్న వివక్ష

వన్‌టౌన్, ఆగస్టు 21: సచివాలయ ఉద్యోగులపై 5ఏళ్లుగా వివక్ష కొనసాగుతుందని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పనికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వాడుకుంటూ రోజుకూలీల్లా చూస్తుండటం దారుణమన్నారు. ఐఎంఎంఎస్, సీఆర్ యాప్‌లో మరుగుదొడ్ల ఫొటోలు, వాష్‌బేసిన్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించటం అన్యాయమన్నారు. ఉన్నత విద్యావంతులైన వారికి గౌరవప్రదమైన విధులు అప్పగించాలన్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

● ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

చిట్టినగర్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ వి ద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయటంతో వారు బుధవారం స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుడిని పిలిచి అడగ్గా ఆమె వద్ద కూడా వక్రం గా మాట్లాడటంతో విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. చిట్టినగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూ ల్లో బాలిక 8వ తరగతి చదువుతోంది. స్కూల్లో పోతిన హేమంత్ (36) లెక్కలు మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కొ న్ని రోజులుగా బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో బా లిక విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపింది. ప్రిన్సిపా ల్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అతడు వక్రంగా మాట్లాడటం తో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసునమోదు చేశారు.

టీడీపీ ఆఫీస్‌పై దాడి ఘటనలో రిమాండ్ పొడిగింపు

గన్నవరం: టీడీపీ కార్యాలయంపై దాడి చేసి రిమాండ్‌లో ఉన్నవారికి బుధవారం మళ్లీ 14 రోజులు రిమాండ్ పొడిగించారు. గతేడాది టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటంతో పాటు వాహనాల దగ్ధం కేసులో ఇప్పటి వరకూ 25 మందిని పోలీసులు అరెస్టు చేయగా వారంతా వివిధ జైళ్లలో ఉన్నారు. వీరికి రిమాండ్ పొడిగించారు.

కోనోకార్పస్ మొక్కలను కాపాడండి

▸ ముఖ్యమంత్రికి జనచైతన్య వేదిక విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు దోహదపడిన కోనో కార్పస్(దుబాయి) మొక్కలను రక్షించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ఈమేరకు ఓ ప్రకటన చేశారు. 'ప్రపంచంలో 40 దేశాల్లో కోనోకార్పస్ పెరుగుతోంది. రాష్ట్రంలో గత దశాబ్దం పైనుంచి దాదాపు 40 లక్షలకుపైగా మొక్కలు అభివృద్ధి చెందాయి. ఈ మొక్కలు అన్ని నేలల్లో బతుకుతాయి. ఆక్సిజన్ అధికంగా అందించి, పర్యావరణ హితంగా ఉంటాయి. పచ్చదనం కోసం ఈ కోనో కార్పస్ వృక్షజాతిని కాపాడాలి' అని లక్ష్మణరెడ్డి తెలిపారు.

మోదానీపై విచారణకు జేపీసీ వేయాలి

▸ ఈడీ ఆఫీసుల వద్ద నేడు కాంగ్రెస్ పార్టీ ధర్నా: మధుయాష్కీగౌడ్

విజయవాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో మోదానీ(మోదీ, అదానీ) కుంభకోణాలపై సమగ్ర విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి మధుయాష్కీగౌడ్ డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. 'బడా కార్పొరేట్ల మద్దతుతో కేంద్రంలో మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాడు. ప్రభుత్వ ఆస్తులను అదానీకి ధారాదత్తం చేశారు. మోదీ, అదానీల కుంభకోణాలపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా అన్ని ఈడీ కార్యాలయాల వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తోంది' అని తెలిపారు.

జగన్ అసెంబ్లీకి వచ్చే పరిస్థితిలేదు: గిడుగు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21: రాష్ట్రంలో కేవలం 11 సీట్లకు పరిమితమైన వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీలోకి వచ్చే పరిస్థితిలేదని కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం మాట్లాడారు. 'ప్రజల సమస్యలపై జగన్ అసెంబ్లీకి వెళ్లి మాట్లాడే పరిస్థితిలేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలోకి వెళ్లి నిరంతరం ప్రజల పక్షాన ఉండి సమస్యలపై పోరాడుతుంది' అని గిడుగు స్పష్టం చేశారు.

ఉత్తమ పాలసీ తీసుకొస్తాం: మంత్రి కొండపల్లి

విజయవాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధి కోసం దేశంలోనే ఉత్తమ పాలసీని తీసుకొస్తామని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఇండస్ట్రీ కొత్త పాలసీ రూపకల్పనలో భాగంగా ఏపీఐఐసీ, సీఐఐ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ... 'పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిని చూపిస్తున్నారు. పారిశ్రామికాభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతాం. సింగిల్‌విండో పాలసీ అమలులో భాగంగా నెలకు రెండుసార్లు సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అన్ని రంగాలకు ప్రాధాన్యమిస్తాం' అని మంత్రి కొండపల్లి తెలిపారు.

విదేశాలకెళ్తే.. తిరిగొస్తారనే నమ్మకం లేదు!

▸ జగన్, విజయసాయికి అనుమతి ఇవ్వద్దు: వర్ల

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నో కేసుల్లో ఏ1గా ఉన్న జగన్‌రెడ్డి, ఏ2 విజయసాయిరెడ్డి విదేశాలకు వెళ్తే, తిరిగి వస్తారన్న నమ్మకం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. వీరిద్దరూ విదేశాల కు వెళ్లడానికి అనుమతి ఇవ్వరాదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

జగన్ కళ్లు తెరవాలి: కేఎస్ జవహర్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజకీయ అవసరాల కోసం కోర్టులను వాడుకోవద్దని సుప్రీంకోర్టు వేసిన మొట్టికాయతో అయినా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి కళ్లు తెరవాలని టీడీపీ నేత కేఎస్ జవహర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'జగన్మోహన్‌రెడ్డికి హైకోర్టు మొట్టికాయలు వేస్తే అవి చాలవని సుప్రీంకోర్టుకు వెళ్లి చెంప దెబ్బలు తిన్నాడు' అని అన్నారు.

పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సభ్యుడిగా వేమిరెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీలో సభ్యుడిగా టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు. 15 మంది లోక్‌సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులతో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీని ఆయన ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ స్మృతివనం పూర్తి చేస్తాం:డోలా

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్టు పెండింగ్ పనులను ముఖ్యమంత్రితో చర్చించి పూర్తి చేస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం సచివాలయంలో ప్రాజెక్టు వివరాలు, పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. స్మృతివనం ప్రాజెక్టును ఏపీఐఐసీ నిర్మిస్తోందని, దాని నిర్వహణ బాధ్యతలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చూస్తోందని చెప్పారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కృషి: మంత్రి కొల్లు

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేస్తామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఆయన విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును సందర్శించారు. ప్లాంటు మొత్తం తిరిగి ఉత్పత్తి వివరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ప్లాంటును ప్రైవేటీకరణ చేయబోమని ఇప్పటికే కేంద్రం ప్రకటించిందని, మిగిలిన సమస్యలను కూడా రాష్ట్రం తరపున ఢిల్లీకి తెలియజేసి, ప్లాంటు పరిరక్షణకు కృషిచేస్తామన్నారు.

అధిక ధరలు, రేషన్‌కార్డులపై సీపీఐ ఆందోళనలు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అధిక ధరలు, కొత్త రేషన్‌కార్డుల కోసం సెప్టెంబరు 1 నుంచి 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని సీపీఐ పిలుపునిచ్చింది. ఈనెల 28న విజయవాడలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది. సెప్టెంబరులోగా అన్ని శాఖల సమావేశాను పూర్తి చేయాలని పార్టీ జిల్లా శాఖలకు పిలుపునిచ్చింది. బుధవారం విజయవాడలోని దాసరి భవన్ నుంచి పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ జూమ్ మీటింగ్ నిర్వహించారు.

అంధ విద్యార్థులను వేధిస్తున్నాడు

▸ కుమార్‌రాజాపై చర్యలు తీసుకోండి: సీపీఐ రామకృష్ణ

అంధ విద్యార్థులపై కేసులు పెడుతూ వేధిస్తున్న వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎ.కుమార్‌రాజాపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. 'అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో పాఠ్యపుస్తకాల ముద్రణకు అయ్యే ఖర్చును భరిస్తామని కేంద్రం చెప్పింది. అయినా గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లోని అంధ విద్యార్థులకు ఈ ఏడాది పుస్తకాలను ముద్రించలేదు. అదేమని అంధ విద్యార్థులపై కుమార్‌రాజా అక్రమ కేసులు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు' అని రామకృష్ణ తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లకు రెండో విడత కౌన్సెలింగ్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. గురువారం(ఈనెల 22వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 23 నుంచి 25వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, అవే తేదీల్లో విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని, 26న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

మూడేళ్ల బాలికపై వృద్ధుడి అఘాయిత్యం

కోటవురట్ల, ఆగస్టు 21: మూడేళ్ల బాలికపై వృద్ధుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో బుధవారం జరిగిందీ ఘటన. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. మూడేళ్ల బాలికను సమీపంలో ఉంటున్న 65 ఏళ్ల వృద్ధుడు కోట పాములు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తానని చెప్పి బుధవారం తన ఇంటికి తీసుకువెళ్లాడు. కుమార్తె కనిపించకపోవడంతో ఆమె తల్లి చుట్టుపక్కల వెతుకుతోంది. ఈలోగా పాములు ఇంట్లో నుంచి బయటకు వస్తూ ఆమెను చూసి కంగారుపడ్డాడు. వెంటనే ఆమె ఇంటిలోకి వెళ్లి చూడగా బాలిక శరీరంపై స్వల్పగాయాలతో కనిపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికను ఆస్పత్రికి తరలించారు.

30-40% ఫిర్యాదులు రీ సర్వేపైనే!

▸ దానికి ముందున్న పరిస్థితి పునరుద్ధరిస్తాం: అనగాని

▸ 22ఏ జాబితా నుంచి అర్హమైనవి తొలగిస్తాం

▸ అటు వైసీపీ నేతలూ పిండుకున్నారు

▸ అందుకే ఫిర్యాదులకు జనం పరుగులు

▸ వినతులకు వచ్చే నెల నుంచి శాశ్వత వ్యవస్థ

▸ తెల్ల కాగితంపై ఫిర్యాదు ఇచ్చినా తీసుకుంటాం

▸ 'ఆంధ్రజ్యోతి'తో రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్



టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అనగాని

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'భూముల రీసర్వేకు ముందు రెవెన్యూ రికార్డుల్లో రైతుల భూములకు సంబంధించి ఉన్న పరిస్థితిని పునరుద్ధరించాలని భావిస్తున్నాం. దీనిపై అధికారులతో చర్చిస్తున్నాం' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు. రీసర్వే చేపట్టిన వైసీపీ ప్రభుత్వం అభ్యంతరాల పరిశీలనకు సమయం ఇవ్వకుండా ఆత్రంగా వ్యవహరించడం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, తమకు వస్తున్న భూ సంబంధిత ఫిర్యాదుల్లో 30-40 శాతం రీసర్వే లోసుగులపైనే ఉంటున్నాయని తెలిపారు. ఆయన బుధవారమిక్కడ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'రీసర్వే తర్వాత రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి వాటిని సరిదిద్దడానికి రెవెన్యూ యంత్రాంగానికి గతంలో 45 రోజుల సమయం ఉండేది. వైసీపీ ప్రభుత్వం మొదట దానిని 30 రోజులకు తగ్గించింది. ఆ తర్వాత 15 రోజులకు కుదించింది. ఇంత తక్కువ వ్యవధిలో ఫిర్యాదులు పరిష్కారం చేయలేక తప్పుల తడకగా రికార్డులు తయారు చేశారు. సమయం తగ్గించడం వల్లే ఇన్ని సమస్యలు వచ్చాయని ఉద్యోగ సంఘాల నేతలు కూడా చెప్పారు. జగన్ బొమ్మ ఉన్న రాళ్లు వేసుకోవాలని.. ఆయన ఫొటో ఉన్న పాస్‌పుస్తకాలు ఇచ్చేయాలన్న ఆరాటం, ఆత్రం ఈ పరిస్థితికి కారణం. సమస్యలు తగ్గించాల్సిన రీసర్వే వాటిని విపరీతంగా పెంచింది. ఏం చేయాలో తీవ్రంగా ఆలోచిస్తున్నాం. రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల్లో ఆ సర్వే కంటే ముందున్న స్థితిని పునరుద్ధరించాలని అనుకుంటున్నాం. దీని వల్ల రైతులు కనీసం తమ భూములపై రుణాలైనా తెచ్చుకోగలుగుతారు. రీసర్వే తర్వాత అమ్మకాలు, కొనుగోళ్లు జరిగి రిజిస్ట్రేషన్లు పూర్తయిన భూముల వివరాలు మార్చలేం. కానీ మిగిలిన వాటిని మార్చవచ్చు' అని వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో విచ్చలవిడితనంతో వ్యవహరించడం వల్లే ఇప్పుడు భూ సమస్యలపై ఫిర్యాదులు గుట్టలకొద్దీ వస్తున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించడం కాకుండా వాటిని అడ్డుపెట్టుకుని పిండుకోవాలని వైసీపీ నేతలు ప్రయత్నించడం వల్లే ప్రజలు ఇప్పుడు వినతులు సమర్పించడానికి పరుగులు తీస్తున్నారని వ్యాఖ్యానించారు. 'మేం అందుకుంటున్న ఫిర్యాదుల్లో మూడు రకాల రెవెన్యూ సమస్యలు ఎక్కువ కనిపిస్తున్నాయి. సర్వేయర్లు, వీఆర్వోలు చేసిన తప్పిదాలు ఒక భాగం. రీసర్వేలో జరిగిన తప్పులు మరొకటి. 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూముల సమస్యలు మూడోది. వీటన్నిటినీ సరిచేయడంపై ఆలోచన చేస్తున్నాం. అందుకే ప్రజల నుంచి ఈ సమస్యలపై వినతులు స్వీకరించడానికి సెప్టెంబరులో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. వాటిని 90 రోజుల్లో పరిష్కరించాలని గడువు పెట్టుకున్నాం. కొన్ని ఆ గడువులో పరిష్కరించలేకపోవచ్చు. మరో నెల అదనంగా పట్టవచ్చు. నిర్దిష్ట గడువు అని కాకుండా ప్రతి సమస్యను ఎలా పరిష్కరించాలన్నదానిపైనే కసరత్తు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

నిషేధ జాబితాపై నిశిత పరిశీలన

నిషేధ భూముల జాబితాపై నిశిత పరిశీలన చేయాలని నిర్ణయించినట్లు రెవెన్యూ మంత్రి తెలిపారు. 'ఒక సర్వే నంబర్లో ప్రభుత్వ భూమి లేదా దేవదాయ శాఖ భూమి పది సెంట్లు ఉన్నా ఆ మొత్తం సర్వే నంబర్‌ను నిషేధ జాబితాలో పెట్టారు. దీంతో మిగిలిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. సర్వే చేసి ప్రభుత్వ భూమి పోను మిగిలిన రైతుల భూములకు వేరే సర్వే నంబర్లు ఇచ్చి ఆ సమస్యను పరిష్కరించాలని చూస్తున్నాం. నిషేధ జాబితా నుంచి అర్హమైన భూములను తీసేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. కానీ దానికి ముందు అన్ని కోణాల్లో పరిశీలన చేస్తాం. కోర్టులో ఉన్న వివాదాల విషయంలో మేమే మీ చేయలేం. కొందరు రైతులు, పేదలు గతంలో పెద్దల చేతిలో మోసపోయారు. మోసానికి గురైన వారికి ఏ విధంగా న్యాయం చేయగలమో ఆలోచిస్తున్నాం. అవసరమైతే పోలీసు కేసులు పెట్టిస్తాం' అని చెప్పారు. రెవెన్యూ శాఖలో ఈ నెలలో బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాత ప్రజల నుంచి వినతుల స్వీకరణకు శాశ్వత వ్యవస్థను నెలకొల్పుతామని తెలిపారు. 'పైసా ఖర్చు లేకుండా తెల్ల కాగితంపై ఫిర్యాదు ఇచ్చినా తీసుకుంటాం. న్యాయం చేసే ప్రయత్నం చేస్తాం. రైతులకు పాస్ పుస్తకాలు కూడా ఉచితంగానే ఇవ్వాలనుకుంటున్నాం' అని అనగాని వెల్లడించారు.

మీ ఆస్పత్రిపై ఫిర్యాదులొచ్చాయ్!

▸ చెప్పిన చోటుకు రండి మాట్లాడుకుందాం!

▸ ట్రస్ట్ పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఫోన్లు

▸ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి లక్షల్లో డిమాండ్

▸ ఆస్పత్రులు సమాచారం ఇవ్వాలి: ట్రస్ట్ సీఈవో

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): 'మీ ఆస్పత్రికి ట్రస్ట్ అనుమతి కావాలా? వెంటనే మా దగ్గరకి రండి'.. 'మీ ఆస్పత్రిలో తనిఖీలు జరగబోతున్నాయి. తనిఖీలు జరగకుండా అపుతాం'.. 'ట్రస్ట్ సీఈవో కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీ ఆస్పత్రిపై ఫిర్యాదులొస్తున్నాయి. మేం చెప్పిన ప్లేస్‌కు రండి మాట్లాడుకుందాం' ఇవీ ఎన్టీఆర్ వైద్య సేవ(ఆరోగ్యశ్రీ) ట్రస్ట్ పేరుతో ఆస్పత్రులకు వస్తున్న ఫోన్‌కాల్స్. ఎన్టీఆర్ వైద్యసేవలో పనులు చేయిస్తామంటూ కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ఆస్పత్రులను సంప్రదించి బురిడీ కొట్టిస్తున్నాయి. కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు వారి మాయలో పడి లక్షల్లో సమర్పించుకుంటున్నాయి. గతవారం రోజుల్లో ట్రస్ట్, ట్రస్ట్ సీఈవో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చాలా ఆస్పత్రులకు ఫోన్లు వెళ్లాయి. ఆస్పత్రుల నుంచి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫోన్ కాల్స్‌పై నాలుగైదు రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఫిర్యాదులపై ట్రస్ట్ సీఈవో లక్ష్మీశా స్పందించారు. ట్రస్ట్ పేరుతో, సీఈవో పేరుతో ఎవరు ఫోన్ కాల్స్ చేస్తున్నారని ఆరా తీశారు. ఎప్పటి నుంచి ఇలాంటి కాల్స్ వెళ్తున్నాయి? ఏఏ నెంబర్ల నుంచి వెళ్తున్నాయి? ఇప్పటి వరకూ ఎంత మంది వీరి మాయలో పడ్డారు? ఎంత సమర్పించుకున్నారు? తదితర వివరాలు సేకరించారు. ఆస్పత్రులకు ఇలా కాల్ చేసిన ఫోన్ నెంబర్లు మొత్తం సేకరించారు. కానీ, ఈ వ్యవహారంపై ట్రస్ట్ స్థాయిలో విచారణ సాధ్యం కాదు కాబట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రస్ట్ మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో ట్రస్ట్ పేరుతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సమస్యలు ఎదుర్కొన్న ప్రతి ఆస్పత్రి వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ట్రస్ట్ సీఈవో కోరుతున్నారు.

వైజాగ్ ఫిల్మ్ క్లబ్ కోర్ కమిటీ రద్దు

▸ బైలా మార్చాలని నిర్ణయం

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కోర్ కమిటీని రద్దు చేస్తూ వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం) తీర్మానం చేసింది. తిమ్మాపురంలోని క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కడా ఏ క్లబ్‌కు లేని విధంగా ఇక్కడ వైసీపీ పెద్దలు వారి హయాంలో కోర్ కమిటీ పేరుతో శాశ్వత కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వారి తదనంతరం ఆయా కుటుంబాల వారసులే అందులో ఉండేలా బైలా మార్చేశారు. ఈ విషయాలన్నీ గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జూన్ 22న క్లబ్‌కు వెళ్లి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏకపక్షంగా ఏర్పాటైన కమిటీ తప్పుకోవాలని సూచించారు. దీంతో కమిటీ మొత్తం రాజీనామా చేసింది. ఏకపక్షంగా రూపొందించిన బైలాను సరిచేసి, అక్టోబరు నాటికి కొత్త కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించింది. క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేఎస్ రామారావు మాట్లాడుతూ, 1,400 మంది సభ్యుల విజ్ఞప్తి మేరకు తగిన చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే గంటాకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ నేతలు శ్మశానాన్నీ కబ్జా చేశారు

▸ రెవెన్యూ మంత్రి అనగానిని ముంచెత్తిన భూ సమస్యలు

▸ ప్రతి వినతిపై కలెక్టర్లు, తహసిల్దార్లకు ఫోన్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను భూ సంబంధిత ఫిర్యాదులు ముంచెత్తాయి. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన తమ పార్టీ నేతలు కేఎస్ జవహర్, ఆచంట సునీతతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి వినతిపైనా ఆయన జిల్లా కలెక్టర్ లేదా మండల తహసిల్దార్‌కు నేరుగా ఫోన్ చేసి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తాము ఒక స్థలాన్ని లీజుకు తీసుకొని నిర్మాణాలు చేపడితే వైసీపీ మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ రూ.50 లక్షలు లంచం తీసుకొని వాటిని కూల్చి వేయించారని, దానివల్ల తాము తీవ్రంగా నష్టపోయామని కర్నూలు నగరం నుంచి వచ్చిన కొందరు బాధితులు మంత్రికి ఫిర్యాదు చేశారు. అక్రమ కూల్చివేతలపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం పోలేపల్లిలో వైసీపీ నేత నర్సింహులు పేదలకు చెందిన 450 ఎకరాల భూమిని కబ్జా చేసి కంచె వేశాడని, భూమి వద్దకు వెళ్తే పోలీసులతో కొట్టిస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన ఒక బాధితుడు ఫిర్యాదు చేశారు. 28 కుటుంబాలు దీని వల్ల బాధలు పడుతున్నాయని, న్యాయం చేయాలని కోరారు. నరసాపురం మండలం లింగబోయిన చర్ల పంచాయితీ పరిధి రామకూరిపాలెంలో తన భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అనుచరులు కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని, తాను ఎన్నిసార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని చామకూరి కుసుమ కుమారి పద్మావతి ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో చేపట్టిన రీ సర్వేలో తమ భూమిని తగ్గించి వేశారని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరం గ్రామానికి చెందిన పూల పుష్పావతి ఫిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నా బోగస్ పత్రాలు సృష్టించి తమ భూమి మూడు ఎకరాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరపాలని కదిరి పట్టణానికి చెందిన కె.సికిందర్ విజ్ఞప్తి చేశారు. విజయనగరం జిల్లా పూసపాటి రేగ మండలం కోనాడలో వైసీపీ నేతలు శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమణలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థుడు కోరారు.

కౌంటర్లు వేయకపోతే ఉపేక్షించం

▸ అధికారులపై హైకోర్టు ధర్మాసనం కన్నెర్ర

▸ హెచ్‌పీసీఎల్ ప్రాంతీయ మేనేజర్‌కు రూ.50వేలు ఖర్చులు విధింపు

▸ రెండు వేర్వేరు పిల్‌లలో ప్రభుత్వానికి రూ.10వేల చొప్పున ఖర్చులు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సకాలంలో కౌంటర్లు వేయని అధికారులపై హైకోర్టు మరోసారి కన్నెర్ర చేసింది. ఓ పిల్‌లో కౌంటర్ వేయని హెచ్‌పీసీఎల్ ప్రాంతీయ మేనేజర్‌కు రూ.50వేలు, మరో రెండు వ్యాజ్యాల్లో ప్రభుత్వానికి రూ.10వేల చొప్పున ఖర్చులు విధించింది. పిల్‌లు ఇటీవలే దాఖలయ్యాయని, ఖర్చులు విధించవద్దని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చేసిన అభ్యర్థనపై ధర్మాసనం సానుకూలంగా స్పందించలేదు. కౌంటర్లు వేయకుండా నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. సొమ్మును న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యానంలో విక్రయించడానికి, వినియోగించడానికి ఉద్దేశించిన పెట్రోలియం ఉత్పత్తులను ఏపీలో విక్రయించడాన్ని అడ్డుకొనేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ రాజమండ్రికి చెందిన భీమా నాగరమేశ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల బ్లాక్ మార్కెటింగ్ వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై అనేకసార్లు విచారణ జరిపిన ధర్మాసనం కౌంటర్‌లు దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న పెట్రోలియం కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ప్రతివాదులు అందరూ కౌంటర్లు వేశారా అని ఆరాతీసింది. హెచ్‌పీసీఎల్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. కౌంటర్ తన వద్దకు చేరిందని, సరైన ఫార్మాట్‌లో లేకపోవడంతో దాఖలు చేయలేదని తెలిపారు. సమయం ఇవ్వాలని కోరారు. దీంతో హెచ్‌పీసీఎల్ ప్రాంతీయ మేనేజర్ వైఖరిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేస్తూ రూ.50వేలు ఖర్చులు విధించింది. ఖర్చులు విధించవద్దని, కనీసం ఆ మొత్తాన్ని తగ్గించాలని న్యాయవాది వీర్‌రెడ్డి కొప్పూరి అభ్యర్థించినా కోర్టు జాలి చూపలేదు. అదేవిధంగా రాష్ట్రంలోని దిగువ కోర్టుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించకపోవడం వల్ల పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని న్యాయవాది తాండవ యోగేశ్ వేసిన పిల్‌లో సకాలంలో కౌంటర్ వేయనందుకు హోంశాఖ ముఖ్యకార్యదర్శికి రూ.10వేలు ఖర్చులు విధించింది. అలాగే రాష్ట్రంలో అన్ని కోర్టుల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలుచేయడంలేదని పేర్కొంటూ న్యాయవాది యోగేశ్ దాఖలు చేసిన పిల్‌లో కౌంటర్ వేయనందుకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి రూ.10వేలు జరిమానా విధించింది.



నీళ్లు చల్లి మంటలు ఆర్పుతున్న దుకాణదారులు

బీడీ రేపిన చిచ్చు..!

▸ బీడీ అంటించుకుని అగ్గిపుల్ల పడేసిన పొగరాయుడు

▸ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఘటన

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 21: పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోయింది. దానిలోని పెట్రోల్ రోడ్డుపై పారింది. అదే సమయంలో ఓ వ్యక్తి బీడీ అంటించుకుని అగ్గిపుల్ల కింద పడేశాడు. అంతే.. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో జనం భయాందోళనతో పరుగులు తీశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని పాత బస్టాండు సమీపంలో ఓ పెట్రోల్ బంకు ఉంది. ఓ వ్యక్తి బుధవారం ఉదయం ఇక్కడ 20 లీటర్ల క్యాన్‌లో పెట్రోల్ పట్టించుకున్నాడు. ఆ క్యాన్‌ను తన ద్విచక్ర వాహనంపై పెట్టుకుని సమీపంలో బైక్ ఆపి మెడికల్ షాప్‌లోకి అతను వెళ్లిన కాసేపటికి క్యాన్ కింద పడి పగిలిపోయింది. పెట్రోల్ మొత్తం రోడ్డు వెంబడి పారింది. అదే సమయంలో ఆ దగ్గరలో ఓ వ్యక్తి బీడీ అంటించుకుని అగ్గిపుల్లను రోడ్డుపై వేశాడు. పెట్రోలు అగ్గిపుల్లను తాకగానే భారీగా మంటలు చెలరేగాయి. రోడ్డు పక్కన ఉన్న ఓ ద్విచక్ర వాహనం పాక్షికంగా దగ్ధమైంది. మంటలు చెలరేగిన ప్రాంతానికి పది అడుగుల దూరంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దుకాణదారులు నీటితో మంటలు ఆర్పివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మింగేసిన మ్యాన్ హోల్

▸ తనిఖీ కోసం దిగిన సూపర్‌వైజర్.. ఆక్సిజన్ అందక దుర్మరణం



మ్యాన్ హోల్‌లో మృతిచెందిన జక్రి

పెందుర్తి (విశాఖపట్నం), ఆగస్టు 21: మ్యాన్ హోల్ ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ సంఘటన విశాఖ జిల్లా పెందుర్తి మండలం కృష్ణరాయపురంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలో ఎల్అండ్‌టీ సంస్థ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టింది. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టరు వద్ద రెండేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న యానాంకు చెందిన అండె జక్రి(25) బుధవారం సిబ్బందితో కలిసి కృష్ణరాయపురం వద్ద తనిఖీలకు సిద్ధమయ్యారు. అక్కడి మ్యాన్ హోల్ మూతను తెరిచి, సుమారు పది అడుగుల లోతులోకి దిగారు. లోపల ఆక్సిజన్ అందకపోవడంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారి కేకలు వేశారు. దీంతో సహచర సిబ్బంది అతడిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మ్యాన్ హోల్ నుంచి విష వాయువు(కార్బన్‌మోనాక్సైడ్) వెలువడుతుండడంతో వారు లోపలకు దిగలేకపోయారు. ఈ నేపథ్యంలో మ్యాన్ హోల్ వద్ద ఫ్యాన్ ఏర్పాటు చేసి, లోపలికి ఆక్సిజన్ పంపే ప్రయత్నం చేశారు. అయితే జక్రి నుంచి ఎలాంటి స్పందనా లేదు. మ్యాన్ హోల్ లోపలకు దిగేందుకు సిబ్బంది భయపడినప్పటికీ కృష్ణరాయపురానికి చెందిన ఓ యువకుడు ముందుకు వచ్చాడు. దీంతో పోలీసులు అతన్ని తాడు సాయంతో లోపలకు దింపారు. అప్పటికే జక్రి మృతిచెందాడు.

అపోలో యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్

▸ కలుషితాహారం తిన్న 300 మంది విద్యార్థులకు అస్వస్థత

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో సుమారు 300 మంది విద్యార్థులు కలుషితాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. అపోలో ఆస్పత్రిలో కొందరికి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మరి కొందరికి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అపోలో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, నర్సింగ్, పారామెడికల్, ఆర్థో, ఫిజియోథెరపీ విభాగాలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన విద్యార్థుల్లో కొంత మందికి కళ్లు తిరగడంతో పాటు జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు అయ్యాయి.

ఏజెన్సీలో చట్ట విరుద్ధంగా వడ్డీ వ్యాపారం

▸ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన ఐటీడీఏస్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో చట్ట విరుద్ధంగా ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు వడ్డీ వ్యాపారం చేస్తున్నాయంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు తమ కార్యాలయాలను ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేశాయేమో గుర్తించాలని అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల సబ్ కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది. చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నవారిపై ఏమి చర్యలు తీసుకున్నారో వివరాలను అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని స్పష్టం చేసింది.

మాక్ పోలింగ్ తప్ప మార్గం లేదు

▸ బాలినేని వ్యవహారంలో తేల్చిచెప్పిన కేంద్ర ఎన్నికల సంఘం

▸ పిటిషన్‌పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అభ్యంతరం లేవనెత్తినప్పుడు బర్న్ మెమొరీ ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా? అని నిర్ధారించుకొనేందుకు మాక్ పోలింగ్ నిర్వహణ తప్ప మరో మార్గం లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం కూడా హైకోర్టులో వాదనలు కొనసాగాయి. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పుపై పిటిషనర్‌కు ఏమైనా సందేహం ఉంటే అక్కడకే వెళ్లి స్పష్టత కోరాలని తెలిపారు. మాక్ పోలింగ్ నిర్వహించాలని ఈసీఐ తీసుకున్న నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి ఉందన్నారు. ఎన్నికల పిటిషన్ దాఖలు చేసి కోర్టు ఆదేశిస్తే తప్ప వీవీప్యాట్లలో స్లిప్పులు లెక్కించడం సాధ్యపడదని తెలిపారు. వీవీప్యాట్ స్లిప్పులకు, బర్న్ మెమొరీకి సంబంధం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈవీఎంల విషయంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని ఈసీఐ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. వీవీప్యాట్‌లలో ఉన్న స్లిప్‌లను, ఈవీఎంలలో పోలైన ఓట్లను సరిపోల్చి చూడాలన్నదే సుప్రీంకోర్టు తీర్పు ఉద్దేశంగా పేర్కొన్నారు. అభ్యర్థులను ఈసీఐ గందరగోళానికి గురిచేస్తోందని చెప్పారు.

అరకు కాఫీ అదిరింది

▸ జీసీసీ స్టాల్‌ను సందర్శించిన డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్ సతీష్‌రెడ్డి



విజయవాడలో అరకు కాఫీని సేవిస్తున్న డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి సలహాదారు జి.సతీష్‌రెడ్డి

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ పరిశోధనా సంస్థ(డీఆర్‌డీఓ) పూర్వ చైర్మన్, భారత రక్షణ మంత్రి సలహాదారు జి.సతీష్ రెడ్డి బుధవారం విజయవాడలో అరకు కాఫీ రుచి చూశారు. అరకు కాఫీ రుచికి ఫిదా అయిన సతీష్‌రెడ్డి... 'కాఫీ చాలా బాగుంది, రుచి అద్భుతంగా ఉంది' అని కితాబిచ్చారు. విజయవాడ పర్యటన నేపథ్యంలో గొల్లపూడి సమీపంలో ఉన్న గిరిజన్ ఆర్గానిక్ హౌస్‌ని సతీష్‌రెడ్డి సందర్శించారు. ఏపీ ప్రభుత్వ గిరిజన్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఉత్పత్తుల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. ఫిల్టర్, ఇన్‌స్టంట్ కాఫీలను కొనుగోలు చేశారు.

ఎమర్జెన్సీ సేవలకైనా హాజరుకండి

▸ జూనియర్ డాక్టర్లను కోరిన ఆరోగ్య శాఖ

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే విధుల్లోకి చేరాలని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జూనియర్ వైద్యులకు విజ్ఞప్తి చేశారు. కనీసం ఎమర్జెన్సీ సేవలకైనా హాజరుకావాలని కోరారు. అమరావతి సచివాలయంలోని 5వ బ్లాక్‌లో జూనియర్ వైద్యులతో బుధవారం ఆయన చర్చించారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై ప్రతి ఒక్కరం బాధపడుతున్నామన్నారు. అయితే ఆస్పత్రుల్లో రోగుల ఇబ్బందులను కూడా దృష్టిలో పెట్టుకొని జూనియర్ వైద్యులు కనీసం ఎమర్జెన్సీ సేవలకైనా హాజరు కావాలని కోరారు. పూర్తిగా విధులు బహిష్కరిస్తే ఆస్పత్రుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని చోట్ల సెక్యూరిటీ సమస్యలున్నాయని, రాత్రిపూట భద్రత పెంచాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 22 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

బిట్స్ పిలానీలో పీజీ కోర్సులు

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇవి వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు. సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కెరీర్ బ్రేక్ లేకుండా కోర్సులు కొనసాగించే వీలుంటుంది. వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ సెషన్స్, మిగిలిన రోజుల్లో ఆఫీసు వేళల తరవాత ఆన్‌లైన్ లెక్చర్స్ ఉంటాయి. డౌట్ క్లియరింగ్ సెషన్స్, ఆన్‌లైన్ ట్యుటోరియల్స్, ఇండస్ట్రీ టాక్స్, ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ఫైనల్ సెమిస్టర్‌లో డిజర్టేషన్(ప్రాజెక్ట్ వర్క్) ఉంటుంది. ప్రతి సెమిస్టర్‌లో మిడ్, కాంప్రహెన్సివ్ పరీక్షలు ఉంటాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా లేదా ఎంచుకొన్న పరీక్ష కేంద్రానికి వెళ్లి రాయవచ్చు.

ఎంటెక్ డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. డేటా సైంటిస్టులు, డేటా అనలిస్టులు, డేటా ఆర్కిటెక్టులు, డేటా ఇంజనీర్లుగా రాణించేందుకు అవసరమైన మేథమెటికల్, ఇంజనీరింగ్ స్కిల్స్ పెంపొందించేలా కోర్సుని రూపొందించారు. మేథమెటికల్ ఫౌండేషన్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టికల్ మెథడ్స్, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్ డిజైన్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డేటా మైనింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, ఎథిక్స్ ఫర్ డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ అండ్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా వేర్‌హౌసింగ్, ప్రాసెసింగ్ ఆఫ్ అనలిటిక్స్ తదితర అంశాలు వివరిస్తారు.

ఎంటెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు సెమిస్టర్లు. మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, ఏఐ సైంటిస్టులుగా రాణించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. ఇందులో మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నెట్‌వర్క్స్, కంప్యూటర్ విజన్, రోబోటిక్స్, డీప్ లెర్నింగ్, డేటా అనాలిసిస్ తదితర అంశాలు వివరిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఈ ప్రోగ్రామ్ వ్యవధి 11 నెలలు. ఇందులో రిగ్రెషన్, ఫీచర్ ఇంజనీరింగ్, క్లాసిఫికేషన్, అన్ సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ అండ్ అసోసియేషన్ రూల్ మైనింగ్, టెక్స్ మైనింగ్, డీప్ లెర్నింగ్ అండ్ ఏఎన్ఎన్ తదితర అంశాలు బోధిస్తారు. ఎనిమిది వారాల క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ కూడా ఉంటుంది.



అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఎమ్మెస్సీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం, ప్రోగ్రామింగ్ నాలెడ్జ్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** bits-pilani-wilp.ac.in/

రిమైండర్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ



స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 8
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతో పాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆఫీస్, డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్ల, శ్రీకాకుళం-532410
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in



ఏపీ సార్వత్రిక విద్యలో పదో తరగతి ప్రవేశాలు



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి ప్రవేశాల ప్రకటన విడుదలైంది.

వయసు: 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు. జనన ధ్రువీకరణ పత్రం లేదా టీసీని సమర్పించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 27

రూ.200 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లింపు చివరి తేదీ: ఆగస్టు 28

వెబ్‌సైట్: https://apopenschool.ap.gov.in/

ఒబెరాయ్ గ్రూప్ స్కాలర్‌షిప్

ఒబెరాయ్ గ్రూప్ తమ సంస్థ 90వ వార్షికోత్సవాల సందర్భంగా 'ద ఒబెరాయ గ్రూప్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్'ని ప్రారంభించింది. హాస్పిటాలిటీ రంగంలో తరవాత తరాన్ని ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ని ఉద్దేశించారు. ఒబెరాయ్ గ్రూప్‌ని రాయ్ బహదూర్ సింగ్ ఒబెరాయ్ నెలకొల్పారు. తరవాత ఈ సంస్థను ప్రిథ్విరాజ్ సింగ్ ఒబెరాయ్ అభివృద్ధి పథంలో నడిపించారు. వీరిద్దరి పేరిటే స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కి రూపకల్పన చేశారు.

- **రాయ్ బహదూర్ మోహన్ సింగ్ ఒబెరాయ్ - డేర్ టు డ్రీమ్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో హోటల్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు దీన్ని ఉద్దేశించారు.
- **ప్రిథ్విరాజ్ సింగ్ ఒబెరాయ్- బి ద బెస్ట్ స్కాలర్‌షిప్:** ఇండియా, విదేశాల్లో ఉన్న ఒబెరాయ్ గ్రూప్ హోటళ్ల సిబ్బందికి దీనిని ఉద్దేశించారు. ఈ స్కాలర్‌షిప్స్ పొందిన అభ్యర్థులు స్విట్జర్లాండ్‌లోని ఈహెచ్ఎల్ హాస్పిటాలిటీ బిజినెస్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో రెండేళ్ల ఎంబీఏ కోర్సు చదివే అవకాశం లభిస్తుంది.

వెబ్‌సైట్: https://www.oberoigroup.com/scholarships/

జాబ్ కార్నర్

హెచ్ఏఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 166

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), ఎల్‌సీఏ తేజస్ డివిజన్... కింద పేర్కొన్న నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డిప్లొమా టెక్నీషియన్: **43 పోస్టులు**
- టెక్నీషియన్: **123 పోస్టులు**

ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, మెటలర్జీ, ఫిట్టర్, షీట్ మెటల్, ఫౌండ్రీమన్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రోప్లాటర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, అప్రెంటిషిప్ సర్టిఫికెట్ ఉండాలి.

జీతం: నెలకు రూ.44,796 నుంచి రూ.46,764

వయోపరిమితి: 2024 జూలై 31 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ వారికి మూడేళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.200. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్-అప్రెంటిస్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 28

వెబ్‌సైట్: https://hal-india.co.in/

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్

గచ్చిబౌలిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం... 2024-25 విద్యా సంవత్సరానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు

1. పీజీటీ(మేథ్స్, కామర్స్)
2. టీజీటీ(మేథ్స్, ఇంగ్లీష్)
3. పీజీటీ - ప్రైమరీ టీచర్
4. స్పెషల్ ఎడ్యుకేటర్
5. ఎడ్యుకేషనల్ కౌన్సెలర్
6. స్పోర్ట్స్/ఆర్ట్ కోచ్

అర్హత: పోస్టును అనసరించి డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీఈడీ, సీటీఈటీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 24

వేదిక: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, గచ్చిబౌలి, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://gachibawli.kvs.ac.in/

నల్సార్ వర్సిటీలో ఫ్యాకల్టీ

ఖాళీలు 33

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా(నల్సార్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్: **18 పోస్టులు**
2. అసోసియేట్ ప్రొఫెసర్: **8 పోస్టులు**
3. ప్రొఫెసర్: **7 పోస్టులు**

విభాగాలు: లా, మేనేజ్‌మెంట్, సోషియాలజీ, ఎకనామిక్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు నెట్/సెట్/స్లెట్ స్కోరు ఉండాలి. పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు రూ.750. **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 12

వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/recruitment/

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ట్రెయినీలు

ఖాళీలు 64

కేరళలోని ప్రభుత్వరంగ సంస్థ- కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. షిప్ డ్రాఫ్ట్స్‌మన్ ట్రెయినీ(మెకానికల్): **46 పోస్టులు**
2. షిప్ డ్రాఫ్ట్స్‌మన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్): **18 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 25 ఏళ్లు మించకూడదు.

వ్యవధి: 2 సంవత్సరాలు

స్టయిపెండ్: మొదటి ఏడాది రూ.14,000; రెండో ఏడాది రూ.20,000

దరఖాస్తు ఫీజు: రూ.600. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: https://cochinshipyard.in/

పవర్‌గ్రిడ్‌లో జూనియర్ ఇంజనీర్లు

ఖాళీలు 38

గుర్‌గావ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. జూనియర్ ఇంజనీర్(గ్రేడ్-3/ఎస్2)(సర్వే ఇంజనీరింగ్)
2. సర్వేయర్(గ్రేడ్-4/డబ్ల్యూ4)
3. డ్రాఫ్ట్స్‌మన్(గ్రేడ్-4/డబ్ల్యూ 4)



అర్హత: ఐటీఐ(డ్రాఫ్ట్స్‌మన్ సివిల్ / ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మన్), ఇంజనీరింగ్ డిప్లొమా(సివిల్/సర్వేయర్), బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: జూనియర్ ఇంజనీర్ పోస్టుకు 31 ఏళ్లు, సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.

వేతనం: జూనియర్ ఇంజనీర్ పోస్టుకు రూ.26,000 - రూ.1,18,000; సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు రూ.22,000 - రూ.85,000.

దరఖాస్తు ఫీజు: జూనియర్ ఇంజనీర్(సర్వే ఇంజనీరింగ్) పోస్టుకు రూ.300; సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు రూ.200. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, షార్ట్‌లిస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 29

వెబ్‌సైట్: https://www.power-grid.in/



దురాశ ఫలితం

ఒక నగరంలో రంగా మరియు కమల అనే భార్యా భర్తలు ఉండేవారు. రంగా అడవికి వెళ్లి కట్టెలు కొట్టి తెచ్చి అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఒకరోజు రంగాకు కాలికి గాయం ఐన ఒక ముని కనిపించాడు. రంగా ముని గాయానికి కట్టు కట్టి సేవ చేసాడు అపుడు ముని సమయానికి సాయం చేసి నాకెంతో మేలు చేసావు. నీకేం కావాలో కోరుకో అన్నాడు. రంగా ఆగండి స్వామీ ఇంటికి వెళ్లి నాభార్యను అడిగొస్తాను అని చెప్పి ఇంటికి వచ్చి కమలను అడగగా ఆమె మనకొక ఇల్లు కావాలని అడిగిరండి అని చెప్పింది. ఆమెకోరిక ప్రకారమే ఆ మర్నాటికల్లా వారికి ఒక ఇల్లు ప్రత్యక్షమైంది. కొద్ది రోజుల తర్వాత కమలకు పెద్ద మేడలో ఉండాలనే కోరిక కలిగింది. మునిని అడిగి రమ్మని భర్తను అడవికి పంపింది. ముని సరే అనడంతో ఆమర్నాడు మేడ ప్రత్యక్షమైంది. కొంత కాలం గడిచాక కమలకు ఆ రాజ్యానికి తానే రాణి కావాలనే కోరిక పుట్టింది. మరలా భర్తను ముని వద్దకు పంపింది. ముని సరే అనడంతో కొద్దిరోజుల్లోనే వారిద్దరూ ఆ రాజ్యానికి రాజు, రాణి అయ్యారు. కొంతకాలం తర్వాత మరలా ముని వద్దకు వెళ్లాడు రంగా ఈసారి ఏం కోరికతో వచ్చావు? అని అడిగిన మునితో స్వామీ నా భార్య సూర్య చంద్రులు తనింటనే ఉండేలా వరం అడిగి రమ్మంది అన్నాడు. ఆ మాటలు విన్న ముని ఎంత దారుణమైన కోరిక ఇది అనుకుంటూ సూర్యచంద్రులు మీ ఇంటనే ఉండాలంటే మీరిద్దరూ ఒక చెట్టు కింద ఉంటే సరి అన్నాడు. రంగా తన భవనం వద్దకు వచ్చేసరికి కమల బాధగా ఏడుస్తూ, చెట్టుకింద కూర్చుని కనిపించింది. మన సంపద, మన బవనం అంతా మాయం అయిపోయిందండీ అని బాధగా అన్నది. ఉన్నదానితో తృప్తిపడలేని నీ ఆత్యాశ చూసావా మనకు ఎలాంటి పరిస్థితి తెచ్చిపెట్టిందో? అన్నాడు రంగా. ఇకపై ఉచితంగా దొరికేవాటికి ఆశపడకుండా ఉన్నదానితో సర్దుకుని కష్టపడి పనిచేసి సంపాదించుకుందాం అండీ అన్నది కమల. ఆమెలో వచ్చిన ఈ మార్పుకు రంగా చాలా సంతోషించాడు.

10 తేడాలు గుర్తించండి



ఎన్ని పిల్లులు, కుక్కలు ఉన్నాయి



సరైన నీడ ఏది



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 390

		6	2		4			
2		7		6		3		
						8		
6	7		1	3				4
		8				9		
9				8	7		6	3
		4						
		1		5		4		8
			4		1	7		

సుడోకు - 389 సమాధానం

2	9	1	3	6	7	8	5	4
8	6	3	5	4	1	2	7	9
4	5	7	2	8	9	3	1	6
1	4	6	9	5	2	7	3	8
7	2	8	1	3	4	6	9	5
9	3	5	8	7	6	1	4	2
6	1	9	7	2	5	4	8	3
5	8	2	4	1	3	9	6	7
3	7	4	6	9	8	5	2	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.